దిక్రైమ్ న్యూస్
Crime News
తెలుగు దినపత్రిక
శనివారం, మార్చి 01, 2025 | సంపుటి - 20 | సంచిక 151 | వెల - 4రూ | పేజీలు - 12
Hyderabad, Karimnagar, Khammam, Nalgonda, Nizamabad, Warangal, Mahabubnagar.

# మహిళల కోసం మినీ ఇండస్ట్రియల్ పార్క్

**దళిత పారిశ్రామికవేత్తలకు మరింత ప్రయోజనం**

**ఫిక్కీ సదస్సులో మంత్రి శ్రీధర్ బాబు వెల్లడి**




హైదరాబాద్ : రాష్ట్రంలోని ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో మహిళల కోసం మినీ ఇండస్ట్రియల్ పార్క్‌ను అభివృద్ధి చేస్తామని తెలంగాణ ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు తెలిపారు. ఎస్సీ, ఎస్టీ ఎమ్మెల్యేలు, పారిశ్రామికవేత్తలు, అధికారులతో కూడిన ప్రత్యేక బృందాన్ని నియమిస్తాం. 2లో

## 6న తెలంగాణ కేబినేట్ భేటీ

**పలు కీలక అంశాలపై చర్చ**



2

హైదరాబాద్ : రాష్ట్ర మంత్రివర్గ సమావేశం మార్చి 6వ తేదీన నిర్వహించనున్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన సమావేశం జరుగనుంది. ఈ కేబినెట్ సమావేశంలో పలు కీలక అంశాలపై చర్చించి నిర్ణయాలు తీసుకోనున్నారు. రాష్ట్రంలో రెండో దఫా కులగణన నిర్వహించిన నేపథ్యంలో వాటికి సంబంధించిన గణాంకాలపై కేబినెట్ చర్చించనుంది.

# పనిచేసిన వారికి పదవులు ఇస్తాం

## పనిచేయని వారి పదవులు ఊడబెరుకుతాం

### రాహుల్ ప్రధాని అయితేనే దేశానికి రక్ష

### కష్టపడ్డవారికి గుర్తింపు ఎప్పుడూ ఉంటుంది

### పీసీసీ విస్తృత స్థాయి సమావేశంలో సిఎం రేవంత్

***పదవులు రాలేదని కాంగ్రెస్ నేతలు ఎవరూ నిరుత్సాహ పడాల్సిన అవసరం లేదని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. పార్టీ కోసం కష్టపడి పనిచేసిన వారికి కచ్చితంగా పదవులు వస్తాయన్నారు. రాహుల్ గాంధీని ప్రదాని చేయడమే లక్ష్యంగా అంతా కలసికట్టుగా పనిచేయాలని పిలుపునిచ్చారు. గాంధీభవన్‌లో ఏర్పాటు చేసిన పీసీసీ విస్తృత స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. గాంధీ భవన్ లో జరిగిన టీపీసీసీ విస్తృత స్థాయి సమావేశంలో కాంగ్రెస్ కొత్త ఇన్చార్జి మీనాక్షి నటరాజన్ తో పాటు సీఎం రేవంత్ రెడ్డి పాల్గొన్నారు.***



హైదరాబాద్ :

నాలుగైదేళ్లు జిల్లా అధ్యక్షులుగా పనిచేసిన వారికి నామినేటెడ్ పదవులు ఇచ్చాం. పార్టీలో నమ్మకంగా ఉన్నవారికి ఉన్నత పదవులు ఇచ్చాం. పార్టీ కోసం కష్టపడిన వారికి సముచిత స్థానం కల్పిస్తున్నాం. మండలాలు, అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా ఫీడ్‌బ్యాక్ తీసుకొని పదవులు ఇస్తాం. ప్రస్తుతం రెండేళ్ల కాలానికి కార్పొరేషన్ ఛైర్మన్ పదవులు ఇచ్చాం. మార్చి 10 లోపు జిల్లాల వారీగా ఇన్‌ఛార్జి మంత్రులు నామినేటెడ్ పదవులకు సంబంధించిన నివేదికలు ఇవ్వాలని ఆదేశించారు. అలాగే రాహుల్ గాంధీని ప్రధాన మంత్రిని చేసే వరకూ మనం విశ్రమించొద్దన్నారు. ప్రతిపక్షాలు చేసే విమర్శలను పట్టించుకోవద్దు. రాహుల్ ప్రధాని అయితే, దేశం అభివృద్ధి అవుతుంది. కాంగ్రెస్‌కు తక్కువ.. ఎక్కువ.. అనే తారతమ్యాల్లేవు. అనుభవజ్ఞులైన ఇద్దరిని ఇప్పటికే రాజ్యసభకు నామినేట్ చేశాం. ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలి. రాష్ట్రంలో కులగణన అనేది అతిపెద్ద కార్యక్రమం. దేశంలోనే అత్యధిక పన్నులు కడుతున్న రాష్ట్రం తెలంగాణ. కష్టపడి పనిచేసే వారికి అవకాశాలు ఇవ్వాల్సిన బాధ్యత పార్టీపైనే ఉంటుందని అన్నారు. పార్టీ కోసం కష్టపడ్డ వారికి తప్పకుండా గుర్తింపు ఉంటుంది అని తెలిపారు. పని చేసిన వారి జాబితాను కొత్త ఇంఛార్జ్ సిద్ధం చేస్తారు.. కొందరికి పదవులు రాలేదు.. మిగతా 2లో

## మూడు రాష్ట్రాల్లో హిమపాతం

**మంచుతో కప్పకుపోయిన రోడ్లు**

**ఉత్తరాఖండ్‌లో మంచు చరియల కింద 57 మందికార్మికులు**

న్యూఢిల్లీ : దేశంలోని మూడు రాష్ట్రాల్లో భారీగా మంచు కురుస్తోంది. జమ్మూకశ్మీర్ , హిమాచల్‌ప్రదేశ్, ఉత్తరాఖండ్ లలో మంచు తీవ్రంగా ఉన్నది. ఉష్ణోగ్రతలు కనిష్ఠ స్థాయికి పడిపోయాయి. ఎక్కడ చూసినా మంచు దిబ్బలే దర్శనమిస్తున్నాయి. కనుచూపుమేర శ్వేత వర్ణం అలుముకుంది. అక్కడ రోడ్లన్నీ శ్వేతవర్ణాన్ని తలపిస్తున్నాయి. రోడ్లపై భారీగా హిమపాతం 2

## కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డికి సీఎం రేవంత్‌రెడ్డి 9 పేజీల లేఖ

**ప్రాజెక్టుపై కిషన్‌రెడ్డిని, ప్రధానిని కలిసిన విషయాన్ని గుర్తుచేసిన రేవంత్**

**మెట్రో విస్తరణకు ఐదు కారిడార్ల ప్రతిపాదలను చేశామని వివరణ**

**తెలంగాణకు ఏం చేశారో చెప్పాలని లేఖలో పేర్కొన్న సీఎం**

2

హైదరాబాద్ : తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కేంద్రమంత్రి కిషన్ రెడ్డికి 9 పేజీల లేఖ రాశారు. 'తెలంగాణ రాష్ట్రానికి ప్రాజెక్టుల మంజూరులో కేంద్ర క్యాబినెట్ మంత్రిగా మీ బాధ్యతను గుర్తు చేయడం కోసం లేఖ' అని సీఎం పేర్కొన్నారు. రాష్ట్రాలకు ప్రాజెక్టుల మంజూ రులో సీఎం రేవంత్ రెడ్డి అవగాహన రాహిత్యం తో మాట్లాడుతున్నారన్న వ్యాఖ్యలు పూర్తి బాధ్యతా రాహిత్యమని, తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. కేంద్ర మంత్రిగా తెలంగాణకు కిషన్ రెడ్డి ఏం చేశారో చెప్పాలన్నారు. తెలంగాణ అభివృద్ధికి హైదరాబాద్ మెట్రో ఫేజ్, ప్రాంతీయ రింగు రోడ్డు (ఆర్‌ఆర్‌ఆర్), మూసీ పునరుజ్జీవనం, రీజినల్ రింగ్ రైలు, డ్రైపోర్ట్ ఏపీలోని బందరు సీ పోర్టుకు గ్రీన్ ఫీల్డ్ రహదారి కీలకమని అన్నారు.

## బిజెపి జాతీయ అధ్యక్షుడి ఎంపిక కసరత్తు

**రేసులో ముందున్న శివరాజ్ సింగ్ చౌహాన్**

న్యూఢిల్లీ : భారతీయ జనతా పార్టీకి త్వరలో కొత్త అధ్యక్షుడు రాబోతున్నాడన్న వార్తల నేపథ్యం లో..తదుపరి అధ్యక్షపీఠం ఎవరిని వరిస్తుందో అన్న చర్చ సాగుతోంది. పార్టీకి విధేయకంగా ఉండడంతో పాటు సంఘ్, పరిషత్ అనుభవం ఉంటే అదనపు ఆకర్షణ కాగలదు. మరోవైపు పార్టీని నడిపించే సత్తా కూడా ముఖ్యం. వివిధ రాష్ట్రాలతో పరిచయం, అందరినీ కలుపుకుపోవడం 2



# రూ.3.22 లక్షల కోట్లతో ఏపీ వార్షిక బడ్జెట్

**రెవెన్యూ వ్యయం రూ.2,51,162 కోట్లు**

**మూలధన వ్యయం అంచనా రూ.40,635 కోట్లు**

**రెవెన్యూ లోటు రూ. 33,185 కోట్లు**

**ద్రవ్య లోటు రూ.79,926 కోట్లుగా అంచనా**

**నైపుణ్యాభివృద్ధి శిక్షణశాఖకు రూ.1,228 కోట్లు**

**పాఠశాల విద్యాశాఖకు రూ.31,805 కోట్లు**

**తొలిసారిగా బడ్జెట్ ప్రవేశ పెట్టిన ఆర్థికమంత్రి పయ్యావుల**

**రూ.3.22 లక్షల కోట్లతో ఏపీ శాసనసభలో 2025-26 వార్షిక బడ్జెట్‌ను ఆర్థికమంత్రి పయ్యావుల కేశవ్ ప్రవేశపెట్టారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత తొలిసారి గా పూర్తిస్థాయి బడ్జెట్‌ను ప్రవేశపెట్టారు. ఇందులో వ్యవసాయానికి రూ.48వేల కోట్లు కేటాయించారు. రెవెన్యూ వ్యయం రూ.2,51,162 కోట్లు, మూలధన వ్యయం అంచనా రూ.40,635 కోట్లు, రెవెన్యూ లోటు రూ. 33,185 కోట్లు, ద్రవ్య లోటు రూ.79,926 కోట్లుగా అంచనా వేశారు. అన్నదాత సుఖీభవ కోసం రూ.6,300 కోట్లు,పోలవరం ప్రాజెక్టు కోసం రూ.6,705 కోట్లు కేటాయించారు.**



అమరావతి : బడ్జెట్ ప్రవేశపెట్టిన సందర్భంగా మంత్రి పయ్యావుల మాట్లాడుతూ.. రాష్ట్ర రుణ సామర్థ్యం సున్నాకు చేరుకుందని.. అప్పు తీసుకొనే శక్తి లేని ఏకైక రాష్ట్రంగా ఏపీ మిగిలిందని అన్నారు. అయినప్పటికీ సీఎం చంద్రబాబు స్ఫూర్తితో బడ్జెట్ రూపొందించినట్లు చెప్పారు. 2014-19 మధ్య రాష్ట్రం రెండంకెల వృద్ధి సాధించిందన్నారు. సవాళ్లను ఎదుర్కోవడంలో చంద్రబాబు.. ఆయనకు ఆయనే సాటి అని అన్నారు. మిగతా 2లో



## గత పదేళ్లలో టన్నెల్ ఎందుకు పూర్తి చేయలేదు

**హరీష్ రావు అసలు విషయాలు మాట్లాడాలి**

**మండిపడ్డ మంత్రి జూపల్లి కృష్ణారావు**

హైదరాబాద్ : ఎస్ఎల్‌బీసీ టన్నెల్‌ను గత ప్రభుత్వం ఎందుకు పూర్తి చేయలేదని మంత్రి జూపల్లి కృష్ణారావు ప్రశ్నించారు. 2014 నుండి 2023 వరకు 200 కిలోమీటర్ల టన్నెల్ పనులు చేశాం అని హరీశ్ రావు అంటున్నారు, పదేళ్లలో మిగిలిన 2లో

# మామునూరు ఎయిర్‌పోర్టుకు రెక్కలు



**విమానాశ్రయ విస్తరణకు కేంద్రం ఆమోదం**

**ఉత్తర్వులు జారీ చేసిన కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు**

న్యూఢిల్లీ : వరంగల్ నగర ప్రజలకు కేంద్రం శుభవార్త అందించింది. ఎన్నో ఏళ్లుగా ఎదురు చూస్తున్న ఎయిర్‌పోర్ట్ కలనిం రవేర్చింది. వరంగల్ జిల్లాలోని మామూనూర్‌లో విమానాశ్రయ అభివృద్ధికి కేంద్రం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఈ మేరకు కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు ఉత్తర్వులు జారీ చేశారు. మామునూరు ఎయిర్‌పోర్టుకు కేంద్రం అనుమతి ఇవ్వడంపై సిఎం రేవంత్ రెడ్డి, మంత్రి కొండ సురేఖ, మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. శంషాబాద్ నుంచి 150 కిలోమీటర్ల దూరంలో మరో ఎయిర్‌పోర్టు ఉండరాదని జిఎంఆర్ సంస్థ గతంలో ఒప్పందం చేసుకుంది. అయితే రాష్ట్ర ప్రభుత్వం, రామ్మోహన నాయుడు జరిగిన చర్చల తర్వాత జిఎంఆర్ సంస్థ కూడా ఎలాంటి అభ్యంతరం లేదని తెలిపింది. దీంతో విమానాశ్రయ పనులు చేపట్టేందుకు పౌరవిమానయాన శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. మిగతా 2లో

# పనిచేసిన వారికి పదవులు ఇస్తాం

మొదటి విడతలో కార్పొరేషన్ చైర్మన్లు రెండేళ్లు అవకాశం ఇచ్చాం.. పని తీరు సరిగ్గా లేని వారిని కొనసాగించామని పేర్కొన్నారు. ఇప్పుడు ఏం అనను.. రెన్యువల్ కోసం వస్తారు కదా అప్పుడు చెప్తానని తెలిపారు. పదవి వచ్చింది కదా అని కూర్చున్న వాళ్లకు కొనసాగింపు ఉండదని సీఎం రేవంత్ తేల్చి చెప్పారు. ఇక, మార్చి 10వ తేదీ లోపు ఇంఛార్జ్ మంత్రులు జిల్లాకు వెళ్ళండి అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచించారు. దేవాదాయ కమిటీలు, మార్కెట్ కమిటి డైరెక్టర్ పోస్టులు ఖాళీలు ఉన్నాయి.. వాటికి సంబంధించిన జాబితా సిద్ధం చేయండి.. అందరికీ పదవులు ఇచ్చేద్దాం.. అలాగే, పదవులు వచ్చిన వాళ్ళు.. పదవి వచ్చింది నేను ఎందుకు పని చేయడం అనుకుంటున్నారు.. పదవి రాని వారు, పదవి రాలేదు కదా నేననేందుకు పని చేయడం అని అనుకుంటున్నారు.. మంచిని మైక్ లో చెప్పండి.. ఇక, పార్టీ నాయకులకు నా విజ్ఞప్తి.. ఏదైనా సమస్య అంటే చెవిలో చెప్పండి అన్నారు. గుజరాత్ మోడల్ సక్సెస్ మోడల్ కాదు.. ఆయన ప్రమోట్ చేసుకున్నారు.. టాక్స్ కలెక్షన్ లో తెలంగాణ నే టాప్.. ఆరో ప్లేస్ లో గుజరాత్ ఉంది.. విదేశీ పెట్టుబడులు తెచ్చింది తెలంగాణ.. వరి ధాన్యం పండించిన మొదటి రాష్ట్రం తెలంగాణ.. కాళేశ్వరం లేకుండానే కోటి 56 లక్షల టన్నులు పండించామని సీఎం రేవంత్ చెప్పుకొచ్చారు. అలాగే, రాహుల్ గాంధీని ప్రధాన మంత్రిని చేసే వరకు కసి తగ్గొద్దు అని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. మేము కష్ట పడుతున్నాం.. మీరంతా కష్ట పడాలన్నారు. అనుకూల వాతావరణం కోసం కాంగ్రెస్ కార్యకర్తలు కష్టపడండి అని చెప్పుకొచ్చారు. మంత్రులు భట్టి విక్రమార్క, ఉత్తమ్ కుమార్ రెడ్డి, జూపల్లి కృష్ణారావు అందరు అక్కడికి వెళ్లారు.. రెస్క్యూ ఆపరేషన్ ను మంత్రులు దగ్గరుండి మరి పరిశీలించారు అని చెప్పారు. ఇక, కాస్మటిక్ చార్జీలు కేసీఆర్ పెంచలేదు.. మనం పెంచాము అని రేవంత్ రెడ్డి తెలిపారు.

## 6న తెలంగాణ కేబినేట్ భేటీ

అలాగే బిసిలకు రిజర్వేషన్లు, ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలని ప్రభుత్వం భావిస్తోంది. ఈ మేరకు మార్చిలో ప్రత్యేకంగా అసెంబ్లీని సమావేశపరుస్తామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇప్పటికే ప్రకటించారు. ఈ నేపథ్యంలోనే ఈ అంశాలపై కూడా మంత్రి మండలి చర్చించే అవకాశం ఉన్నట్టుగా తెలిసింది. అలాగే రాష్ట్రంలో ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న వారికి కొత్త రేషన్ కార్డుల పంపిణీ చేపట్టాలని సిఎం అధికారులను ఆదేశించారు. ఎన్నికల కోడ్ కారణంగా పలు జిల్లాల్లో ఈ విషయంలో తర్జనభర్జన జరుగుతోంది. మార్చి 3వ తేదీతో ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ ముగియనుంది. దీంతో కొత్త రేషన్ కార్డుల పంపిణీపై కేబినెట్‌లో చర్చించే అవకాశం ఉందని సమాచారం. అలాగే స్థానిక సంస్థల ఎన్నికలతో పాటు పలు అంశాలపై కేబినెట్ నిర్ణయం తీసుకోనున్నట్లుగా తెలిసింది.

## మహిళల కోసం మినీ ఇండస్ట్రియల్ పార్క్

ప్రత్యేక బృందం ఇచ్చే నివేదిక ఆధారంగా దళిత పారిశ్రామికవేత్తలకు మరింత ప్రయోజనం కలిగేలా చర్యలు తీసుకుంటామని శ్రీధర్‌బాబు తెలిపారు. ఫిక్కిలో నిర్వహించిన తెలంగాణ అసోసియేషన్ ఆఫ్ ఎస్సీ, ఎస్టీ ఎంటర్‌ప్రైజెస్ సదస్సుకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఇండస్ట్రియల్ పార్కుల్లో ఎస్సీ, ఎస్టీ మహిళా పారిశ్రామికవేత్తలకు 10 శాతం ప్రత్యేకంగా కేటాయిస్తామన్నారు. ఎస్సీ, ఎస్టీలు ఎదిగితేనే సమాజం అభివృద్ధి చెందుతుంది. చేవెళ్ల డిక్లరేషన్‌లో దళితులకు ఇచ్చిన ప్రతి హామీని ప్రభుత్వం కచ్చితంగా నెరవేరుస్తుంది. దళితుల అభివృద్ధికి చిత్తశుద్ధితో కృషి చేసే పార్టీ కాంగ్రెస్ మాత్రమే. ఓవైపు రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని గాడిలో పెడుతూనే.. మరోవైపు సంక్షేమం, అభివృద్ధిపై దృష్టి సారించాం. పారిశ్రామికవేత్తలకు రాయితీగా అందాల్సిన బకాయిలు రూ.4500 కోట్లకు పైనే ఉన్నాయి. వీటిలో రూ.2,200 కోట్లు ఎస్సీ, ఎస్టీ పారిశ్రామికవేత్తలకే రావాల్సి ఉంది. మేం అధికారంలోకి రాగానే ఈ బకాయిల చెల్లింపుపై దృష్టి సారించాం. వచ్చే నెలలో రూ.300 కోట్లు చెల్లిస్తాం. ఎక్కువ మంది కార్మికులకు ఉపాధి అందించే ఎంఎస్ఎంఈ ప్రత్యేక పాలసీ తీసుకొచ్చాం. స్కిల్ సెంటర్లను ఏర్పాటు చేసి పరిశ్రమలకు అవసరమైన నైపుణ్యమున్న మానవ వనరులను అందిస్తాం. కొత్త ఆలోచనలతో ముందుకొచ్చే వారికి ప్రభుత్వం అండగా ఉంటుంది. రుణాలు పొందటంలో ఔత్సాహిక ఎస్సీ, ఎస్టీ పారిశ్రామికవేత్తలకు ఎదురవుతున్న ఇబ్బందులను పరిష్కరిస్తాం. తమిళనాడు, కర్ణాటకలో పారిశ్రామిక విధానాలపై అధ్యయనం చేయడానికి కమిటీని ఏర్పాటు చేస్తామన్నారు.

## బిజెపి జాతీయ అధ్యక్షుడి ఎంపిక కసరత్తు

వంటివికూడా మరీ ముఖ్యం. దీనికితోడు ఛరిష్మా కూడా అసవరం ఉంటుంది. ప్రస్తుతం పార్టీలో సంస్థాగత ఎన్నికలు జరుగుతుండగా త్వరలోనే జాతీయ అధ్యక్షుడిని ఎన్నుకునే పక్రియ చేపట్టనున్నట్లు తెలుస్తోంది. మార్చి 15లోగా దీనిపై పార్టీ నూతన అధినేత పేరును ప్రకటించే అవకాశాలున్నట్లు తెలుస్తోంది. ఈమేరకు విశ్వసనీయ వర్గాలను ఉటంకిస్తూ పలు ఆంగ్ల మీడియా కథనాలు వెల్లడించాయి. దీంతో నడ్డా వారసుడెవరు అనేది ఆసక్తికరంగా మారింది. భాజపా రాజ్యాంగం ప్రకారం.. జాతీయ అధ్యక్షుడిని ఎన్నుకునే పక్రియను ప్రారంభించే ముందు కనీసం సగం రాష్ట్ర యూనిట్లలో సంస్థాగత ఎన్నికలు పూర్తి చేయాలి. ఇప్పటివరకు 12 రాష్ట్రాల్లో ఆ పక్రియ పూర్తయ్యింది. జాతీయ అధ్యక్షుడి ఎన్నిక కోసం కనీసం మరో ఆరు రాష్ట్రాల్లో యూనిట్ చీఫ్‌లను ఎన్నుకోవాల్సి ఉంటుంది. దీంతో భాజపా తమ కార్యాచరణను ముమ్మరం చేసింది. వచ్చే ఏడాది అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న తమిళనాడు, పశ్చిమ బెంగాల్, ఉత్తరప్రదేశ్, అస్సాం, గుజరాత్ రాష్ట్రాల్లో పార్టీ సంస్థాగత ఎన్నికల ప్రణాళికలు చేపట్టింది. మరోవైపు.. జాతీయఅధ్యక్షుడి పదవికి ప్రతిపాదిత పేర్లను సూచించాలని రాష్ట్ర ఇన్‌ఛార్జ్‌లను అధిష్ఠానం కోరింది. 2019లో భాజపా అధికారంలోకి వచ్చిన తర్వాత 2020లో జేపీ నడ్డా జాతీయ అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గతేడాది లోక్‌సభ ఎన్నికల దృష్ట్యా ఆయన పదవీకాలాన్ని పొడిగించారు. నడ్డా నాయకత్వంలో వివిధ రాష్ట్రాలకు జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లోనూ భాజపా సత్తా చాటింది. దీంతో మూడోసారి అధికారంలోకి వచ్చిన కాషాయ పార్టీ.. నడ్డాను కేంద్ర మంత్రివర్గంలోకి తీసుకొని ఆరోగ్యశాఖ బాధ్యతలు అప్పగించింది. ఈక్రమంలోనే పార్టీ అధ్యక్ష బాధ్యతలను మరో నాయకుడికి అప్పగించేందుకు సిద్ధమైంది. అయితే, ఈ పదవికి ఎవరిని తీసుకోనున్నారనేది ఇప్పుడు ఉత్కంఠగా మారింది. రేసులో పలువురి పేర్లు తెర పైకి వస్తున్నాయి. మధ్యప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి, కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్, రాజస్థాన్ మాజీ సీఎం వసుంధర రాజే, పార్టీ జనరల్ సెక్రటరీ సునీల్ బన్సల్, మహారాష్ట్ర భాజపా అగ్రనేత వినోద్ తావడే పేర్లు ప్రముఖంగా వినిపిస్తున్నాయి. అయితే బిజెపిలో పేర్లు ప్రచారంలో ఉన్నా...అప్పటికప్పుడు మళ్లీ కొత్త పేర్లు వస్తుంటాయి. అయితే శివరాజ్ సింగ్ చౌహాన్ పేరు ప్రముఖంగా వినపడుతోంది.

## మామునూరు ఎయిర్‌పోర్టుకు రెక్కలు

ఇప్పటికే ఎయిర్‌పోర్ట్ పరిధిలో 696 ఎకరాల స్థలం ఉంది. ఆ భూమికి అదనంగా మరో 253 ఎకరాల భూమి కొంత రన్‌వే విస్తరణ, టెర్మినల్ బిల్డింగ్, ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్ (ఏటీసీ), నేవిగేషన్ ఇన్‌స్టుమెంట్ ఇన్‌స్టలేషన్ నిర్మాణాలు చేపట్టనున్నారు. ఈ మేరకు భూసేకర జరిపేందుకు రాష్ట్ర ప్రభుత్వం రూ.205 కోట్లను విడుదల చేసింది. రాష్ట్ర ప్రభుత్వం విజ్ఞప్తి మేరకు మామూనూరు ఎయిర్ పోర్ట్ ఆపరేషన్స్‌కి కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు ఉత్తర్వులు ఇచ్చారు. జీఎంఆర్ అంగీకారం తెలపడంతో విమానాశ్రయం పనులు చేపట్టేందుకు పౌరవిమానయాన శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. త్వరితగతిన నిర్మాణ పనులు చేపట్టాలని ఎయిర్ పోర్ట్ అథారిటీని రామ్మోహన్ నాయుడు ఆదేశించారు. మామునూరు ఎయిర్‌పోర్టు నిర్మాణానికి అడ్డంకిగా ఉన్న 150 కి.మీ. ఒప్పందాన్ని జీఎంఆర్ సంస్థ విరమించుకుంది. నిజాం కాలంలో మామునూరు నుంచి వాయుదూత్ విమానాలు నడిచేవి. భారత్, చైనా యుద్ధ సమయంలో కీలక సేవలందించాయి. దాదాపు 32 ఏళ్ల కిందట మూతపడిన మామునూరు విమానాశ్రయానికి మళ్లీ 'రెక్కలు' రానున్నాయి. అప్పుడప్పుడు శిక్షణ ఎయిర్‌క్రాఫ్ట్‌లు నడుస్తున్న ఈ విమానాశ్రయం నుంచి మళ్లీ విమానం ఎగరనుంది. రాష్ట్ర ప్రభుత్వం చొరవతో మామునూరు ఎయిర్‌పోర్టు కల సాకారమైందని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. కేంద్ర ప్రభుత్వం నుంచి అనుమతి రావడంతో ఎయిర్‌పోర్టు పనులు వేగవంతం అవుతాయన్నారు. మామునూరు ఎయిర్‌పోర్టుకు కేంద్రం అనుమతి తెలపడం పట్ల మంత్రి కొండా సురేఖ హర్షం వ్యక్తం చేశారు. సీఎం రేవంత్‌రెడ్డితో పాటు కేంద్ర పెద్దలకు ధన్యవాదాలు తెలిపారు.



## కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డికి సీఎం రేవంత్‌రెడ్డి 9 పేజీల లేఖ


వాటి నిర్మాణాలకు సంబంధించి అనుమతుల కోసం కేంద్ర ప్రభుత్వ విధివిధానాలను పూర్తిగా పాటిస్తున్నామని తెలిపారు. ఆయా ప్రాజెక్టుల సాధన కోసం ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర మంత్రులతో పాటు మిమ్మల్ని (కిషన్ రెడ్డి) కలిసిన విషయాన్ని గుర్తు చేస్తున్నానని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. మెట్రో ఫేజ్ -1 69 కి.మీ. నిర్మాణాన్ని ఉమ్మడి రాష్ట్రంలోనే కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిందని ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి గుర్తు చేశారు. మెట్రో రాకతో హైదరాబాద్ నగరంలో అభివృద్ధి పరుగులు పెట్టిందని, గత పదేళ్లలో రాష్ట్రంలో అధికారంలో ఉన్న బీఆర్ఎస్ ప్రభుత్వం హైదరాబాద్ మెట్రో ఫేజ్-1 ప్రాజెక్టును పూర్తిగా నిర్లక్ష్యం చేసిందని, సీఎంగా తాను బాధ్యతలు స్వీకరించిన తర్వాత హైదరాబాద్ మెట్రో ఫేజ్-11 ప్రాజెక్టుపై పూర్తి స్థాయిలో దృష్టి సారించామని తెలిపారు. మెట్రో సేవలను విస్తరించడమే లక్ష్యంగా అయిదు కారిడార్లను ప్రతిపాదించామన్నారు. నాగోల్- రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం (36.8 కి.మీ.), రాయదుర్గం-కోకాపేట నియోపోలిస్ (11.6 3.2.), ఎంజీబీఎస్- చాంద్రాయణగుట్ట (7.5 కి.మీ.), మియాపూర్-పటాన్ చెరు (13.4 కి.మీ.), ఎల్‌బీనగర్- హయత్ నగర్ (7.1 కి.మీ.). ఈ ఐదు కారిడార్ల నిర్మాణానికి రూ. 24,269 కోట్లతో ప్రతిపాదనలు ఆమోదించాలని నాటి కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ మంత్రి హర్దీప్ సింగ్ పురీకి (2024, జనవరి 4వ తేదీ) వినతిపత్రం అందజేశామని చెప్పారు. 2024, అక్టోబరు ఏడో తేదీన ప్రస్తుత కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ మంత్రి మనోహర్‌లాల్ ఖట్టర్కు ప్రతిపాదనలు అందజేశామని తెలిపారు. 2024, నవంబరు నాలుగో తేదీన రాష్ట్ర ప్రభుత్వం నుంచి కేంద్ర పట్టణాభివృద్ధి శాఖకు మెట్రో ఫేజ్- 11 డిటైయిల్డ్ రిపోర్ట్ సమర్పించామని సీఎం రేవంత్ రెడ్డి వ్యాఖ్యానించారు. 2024, డిసెంబరు 12వ తేదీన ఢిల్లీలో తాను మీతో (కిషన్ రెడ్డి) సమావేశమై హైదరాబాద్ మెట్రో ప్రాజెక్టుకు సంబంధించిన వివరాల లేఖను అందజేశానని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. తాజాగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీని కలిసినప్పుడు 2025, ఫిబ్రవరి 26వ తేదీన ఇదే అంశంపై లేఖ అందజేశానన్నారు. మెట్రో ఫేజ్-కు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా చేపట్టాలని అన్ని లేఖల్లో స్పష్టంగా వివరించినట్లు ఆయన తెలిపారు. మూసీ పునరుజ్జీవ ప్రాజెక్టుకు సహకరించాలని కేంద్ర జలశక్తి మంత్రి సీఆర్ పాటిల్‌ను 2024, జులై 22న కలిసి వివరాలతో కూడిన లేఖను అందజేశామన్నారు. మీతో (కిషన్ రెడ్డి) సమావేశమైన రోజు మూసీ పునరుజ్జీవన ప్రాధాన్యాన్ని వివరించడంతో పాటు సమగ్ర వివరాలతో లేఖను అందజేశానని ఈ సందర్భంగా గుర్తు చేశారు. ఈ నెల 21వ తేదీన రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ, హెచ్ఎండీఏ, జీహెచ్ఎంసీ, హెచ్ఎండబ్ల్యూఎస్ఎస్బీ అధికారుల బృందం మిమ్మల్ని కలిసి మూసీ పునరుజ్జీవన ప్రాజెక్టు ప్రాధాన్యాన్ని వివరించారన్నారు. తాజాగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి మూసీ పునరుజ్జీవంపై లేఖను అందజేశానని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వ్యాఖ్యానించారు.

## రూ.3.22 లక్షల కోట్లతో ఏపీ వార్షిక బడ్జెట్

రాష్ట్ర విభజన కారణంగా రాజధానిని కోల్పోయిన ఏపీకి అమరావతిని ప్రజా రాజధానిగా చేసుకున్నామన్నారు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణం గా అమరావతి పనులు పెద్దఎత్తున చేపడతామని చెప్పారు. మహారాష్ట్రకు ముంబయి, తెలంగాణకు హైదరాబాద్ ఎంత ముఖ్యమో.. మనకూ అమరావతి అంతే ముఖ్యమన్నారు. ప్రధాని మోదీ సహకారంతో ముంబయి, హైదరాబాద్ నగరాలకు సరితూగేలా అమరావతిని అభివృద్ధి చేస్తామని పయ్యావుల వెల్లడించారు. తన ప్రసంగంలో మొదట గత పాలనలో జరిగిన ఆర్థిక విధ్వంసాన్ని వివరించిన మంత్రి పయ్యావుల కేశవ్ ,ఆ తరువాత రాష్ట్ర అభివృద్ధి కోసం కూటమి ప్రభుత్వం చేపట్టిన అనేక కార్యక్రమాలను వెల్లడించారు. గత ప్రభుత్వం నిర్ణయాల వల్ల రాష్ట్రం ఏ మేరకు నష్టపోయిందో, అభివృద్ధిలో ఎలా తిరోగమనం చెందిందో తెలిపారు. ఇదిలా ఉండగా.. తన బడ్జెట్‌ప్రసంగంలో డ్రాప్ అవుట్స్ కాన్సెప్ట్‌తో ఆకట్టుకున్నారు మంత్రి. గత ప్రభుత్వంలో స్కూళ్లల్లో విద్యార్థుల డ్రాప్ అవుట్సే కాదు.. చాలా రంగాల్లో డ్రాప్ అవుట్స్ జరిగాయన్నారు. పరిశ్రమలు డ్రాప్ అవుట్ అయ్యాయని.. రాష్ట్రం నుంచి ఉద్యోగాలు డ్రాప్ అవుటయ్యాయని... పేదలకు ఉపాధి డ్రాప్ అవుట్ అయిందని వెల్లడించారు. గత ప్రభుత్వ పాలకులు ఇప్పుడు ఓటమితో.. సభకు రాకుండా.. అసెంబ్లీ నుంచి కూడా డ్రాప్ అవుట్ అయ్యారని సెటైర్ విసిరారు. వైసీపీ ఎమ్మెల్యేలు, నేతలు ప్రజా జీవితం నుంచి శాశత్వంగా డ్రాప్ అవుట్ అయ్యే రోజులు అతి త్వరలోనే ఉన్నాయంటూ పయ్యావుల కేశవ్ ఛలోక్తులు విసిరారు. అలాగే బడ్జెట్ ప్రసంగంలో ప్రధాని నరేంద్ర మోడీ, స్పీకర్ అయ్యన్నపాత్రుడు, సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్ పేర్లను మంత్రి ప్రస్తావించారు. ఆయా సందర్భాల్లో వారు మాట్లాడిన కామెంట్లను.. తీసుకుంటున్న చర్యలను ప్రసంగంలో తెలిపారు. చెత్త పన్నుపై అయ్యన్న కామెంట్లు గుర్తు చేయడంతో అప్పటి అయ్యన్న కామెంట్లను సభ్యులు చర్చించుకున్నారు.స్పీకర్ అయ్యన్నపాత్రుడు ప్రతిపక్షంలో ఉండగా చెత్త పన్ను వేసిన గత పాలకులపై చేసిన కామెంట్లు సంచలనం సృష్టించాయని మంత్రి తెలిపారు. అప్పులనే కాదు.. చెత్తను వారసత్వంగా ఇచ్చింది గత ప్రభుత్వం అంటూ మండిపడ్డారు. చెత్త పన్ను వేయడమే కాకుండా.. 83 లక్షల మెట్రిక్ టన్నుల చెత్తను ఎత్తకుండానే వైసీపీ ప్రభుత్వం వెళ్లిపోయిందంటూ మంత్రి వ్యాఖ్యలు చేశారు. అలాగే స్వర్గీయ ఎన్టీఆర్ ప్రవేశపెట్టిన రూ. 2కే కిలో బియ్యం పథకం గురించి కూడా పయ్యావుల బడ్జెట్‌లో ప్రస్తావించారు. కాలే కడుపునకు పట్టెడన్నం పెట్టేందుకు ఎన్టీఆర్ రూ. 2కే కిలో బియ్యం పథకం ప్రారంభిం చారని గుర్తుచేశారు. ఆ సంక్షేమ పథకమే జాతీయ స్థాయిలో చట్టంగా మారిందని... అదే ఆహార భద్రత చట్టమని మంత్రి పయ్యావుల కేశవ్ వెల్లడించారు. ఇకపోతే బడ్జెట్‌లో కేటాయింపులు ఇలా ఉన్నాయి. నైపుణ్యాభివృద్ధి శిక్షణశాఖకు రూ.1,228 కోట్లు, పాఠశాల విద్యాశాఖకు రూ.31,805 కోట్లు, ఉన్నత విద్యకు రూ.2,506 కోట్లు,ఎస్సీల సంక్షేమానికి రూ.20,281 కోట్లు,ఎస్టీల సంక్షేమానికి రూ.8,159 కోట్లు, బీసీల సంక్షేమానికి రూ.47,456 కోట్లు, అల్పసంఖ్యాక వర్గాల కోసం రూ.5,434 కోట్లు, మహిళా శిశు సంక్షేమం, దివ్యాంగులు, వృద్ధుల సంక్షేమం కోసం రూ.4,332 కోట్లు, వైద్య ఆరోగ్య, కుటుంబ సంక్షేమానికి రూ.19,264 కోట్లు, పంచాయతీ రాజ్ శాఖకు రూ.18,847 కోట్లు పురపాలక, పట్టణాభివృద్ధి శాఖకు రూ.13,862 కోట్లు, గృహ నిర్మాణ శాఖకు రూ.6,318 కోట్లు, జలవనరుల శాఖకు రూ.18,019 కోట్లు, పరిశ్రమలు, వాణిజ్య శాఖకు రూ.3,156 కోట్లు,ఇంధన శాఖకు రూ.13,600 కోట్లు, ఆర్అండ్‌బీకి రూ.8,785 కోట్లు,యువజన, పర్యటక, సాంస్కృతిక శాఖకు రూ.469 కోట్లు, గృహ మంత్రిత్వ శాఖకు రూ.8,570 కోట్లు, తెలుగు భాష అభివృద్ధి, ప్రచారం కోసం రూ.10 కోట్లు, మద్యం, మాదక ద్రవ్యాల రహిత రాష్ట్రం కోసం నవోదయ 2.0 కార్యక్రమానికి రూ.10 కోట్లు, జల్ జీవన్ మిషన్ కోసం రూ.2,800 కోట్లు, వ్యవసాయ అనుబంధ రంగాలకు రూ.13,487 కోట్లు, పౌరసరఫరాల శాఖకు రూ.3,806 కోట్లు, తల్లికి వందనం కోసం రూ.9,407 కోట్లు, ఎన్టీఆర్ భరోసా పింఛన్ల కోసం రూ.27,518 కోట్లు,ఆర్టీజీఎస్ కోసం రూ.101 కోట్లు, దీపం 2.0 పథకానికి రూ.2,601 కోట్లు, మత్స్యకార భరోసాకు రూ.450 కోట్లు, స్వచ్ఛాంధ్ర కోసం రూ.820 కోట్లు,డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకానికి రూ.3,486 కోట్లు, ఆదరణ పథకానికి రూ.1000 కోట్లు కేటాయింపులు చేశారు.

## గత పదేళ్లలో టన్నెల్ ఎందుకు పూర్తి చేయలేదు

19 కిమీ ఎందుకు తవ్వలేక పోయారన్నారు. హరీశ్ రావు సొల్లు పురాణం మాటలు మస్తు చెప్తాడని ఎద్దేవా చేశారు.



అడిగిన దానికి తప్ప.. అన్నిటికి హరీశ్ రావు స్పందిస్తారని విమర్శించారు. ప్రమాదం జరగగానే హరీష్ రావు ఎందుకు రాలేదని మంత్రి జూపల్లి ప్రశ్నించారు. గాంధీ భవన్‌లో మంత్రి జూపల్లి మీడియాతో మాట్లాడారు. 'ఎస్ఎల్‌బీసీ టన్నెల్‌కి హరీష్ రావు వంద వాహనాల్లో యుద్దానికి వెళ్లినట్టు వచ్చారు. అడిగిన దానికి తప్ప.. అన్నింటికీ ఆయన స్పందిస్తారు. 2014 నుండి 2023 వరకు 200 కిలోమీటర్ల టన్నెల్ పనులు చేశాం అంటున్నారు, పదేళ్లలో మిగిలిన 19 కిమీ ఎందుకు తవ్వలేకపోయారు. డబ్బులు లేక తవ్వలేదా ఎస్ఎల్‌బీసీ లేదా.. కాంగ్రెస్ పార్టీకి పేరు వస్తుందని తవ్వలేదా?. హరీష్ సొల్లు పురాణం మాటలు మస్తు చెప్తాడు. ప్రమాదం జరగగానే హరీష్ ఎందుకు రాలేదు. నేను ఒక్కడినే టన్నెల్ లోపలికి వెళ్ళాను. టన్నెల్‌లోకి వాటర్, బురద వచ్చి ముసుకుని పోయింది. అది తీస్తే మరలా వరద వస్తది కదా. 8 మందిని తీయడానికి 100 మంది లోపలికి పోయారు. బురద, నీళ్లు వస్తున్నప్పుడు మళ్ళీ ప్రమాదం జరిగితే.. ఇంకో ఘటన జరుగుతుంది కదా?. జాగ్రత్తగా చేయాల్సి ఉంటుంది. జాతీయ సంస్థలు అన్నీ వచ్చాయి, ఆ సంస్థలు చెప్పినట్టు చేస్తున్నాం' అని మంత్రి జూపల్లి తెలిపారు. 'జిల్లా మంత్రిగా నేనే టన్నెల్‌లోకి వెళ్లి వచ్చా. మమ్మల్ని రానివ్వలేదు అని కొందరు డ్రామా చేశారు. రావడానికి అనుమతి ఇచ్చింది మేమే, రాజకీయ లబ్ది కోసం డ్రామా చేస్తున్నారు. మీరేమైనా అధికారంలో ఉన్నప్పుడు అనుమతి ఇచ్చారా?. వచ్చి చూడాలి అనుకుంటే.. 100 వాహనాల్లో వస్తారా?. పాలమూరు రంగారెడ్డిలో ప్రమాదం జరిగితే కేసీఆర్ వచ్చాడా?.. పవర్ హౌస్ మునిగితే కేసీఆర్ వచ్చాడా?, మంత్రి వచ్చాడా?.. కొండగట్టు ప్రమాదంలో 65 మంది చనిపోతే కేసీఆర్ వెళ్ళాడా?.. కాళేశ్వరం టన్నెల్‌లో ఏడుగురు చనిపోయినపుడు కేసీఆర్, హరీష్ పోయాడని మంత్రి జూపల్లి కృష్ణారావు మండిపడ్డారు.

## మూడు రాష్ట్రాల్లో హిమపాతం

పేరుకుపోవడంతో అధికారులు పలు రహదారుల్ని మూసివేశారు. జమ్ముకశ్మీర్‌లో ఎడతెరిపిలేకుండా మంచు కురుస్తోంది. దీంతో చాలా ప్రాంతాల్లో కొండచరియలు విరిగిపడుతున్నాయి. అప్రమత్తమైన అధికారులు జమ్ము-శ్రీనగర్ జాతీయ రహదారిని మూసివేశారు. దీంతో ఉదంపూర్ వద్ద రహదారిపై భారీ సంఖ్యలో వాహనాలు నిలిచిపోయాయి. బార్డర్ రోడ్స్ ఆర్గనైజేషన్ అధికారులు రోడ్డుపై పేరుకుపోయిన మంచును తొలగిస్తున్నారు.హిమాచల్ ప్రదేశ్‌లోనూ విపరీతంగా మంచు పడుతోంది. లెహ్, స్పితి సహా పలు ప్రాంతాల్లో నిరంతరంగా మంచు వర్షం కురుస్తోంది. దీంతో ఇళ్లు, వాహనాలు, రోడ్లు, చెట్లపై దట్టంగా మంచు పేరుకుపోయింది. ఇక ఉత్తరాఖండ్ రాజధాని డెహ్రాడూన్‌లో తాజాగా వర్షం కురిసింది. ఇందుకు సంబంధించిన వీడియోలు ప్రస్తుతం వైరల్ అవుతున్నాయి. ఉత్తరాఖండ్‌లోని చమోలీ జిల్లాలో పెనుప్రమాదం చోటుచేసుకుంది. శుక్రవారం ఉదయం మంచు చరియలు విరిగిపడి బోర్డర్ రోడ్ ఆర్గనైజేషన్ కు చెందిన సుమారు 57 మంది కార్మికులు చిక్కుకుపోయారు. ఇండియా-చైనా సరిహద్దు ప్రాంతంలోని ఎత్తైన పర్వత ప్రాంతం వద్ద రోడ్డు నిర్మాణం పనిలో కార్మికులు ఉండగా హిమపాతం విరుచుకుపడింది. సమాచారం తెలియగానే పోలీసులు, బీఆర్ఓ సిబ్బంది ఘటనా స్థలికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. మనా గ్రామానికి సమీపంలో మంచు చరియలు విరిగిపడి కార్మికులు చిక్కుకున్నప్పుడు సమాచారం అందిందని, వెంటనే ఐడీబీపీ, బీఆర్ఓ సిబ్బంది రంగంలోకి దిగి సహాయక చర్యలు ప్రారంభించినట్టు ఉత్తరాఖండ్ ముఖ్యమంత్రి పుష్కర్ సింగ్ ధామి తెలిపారు. ఘటనపై ఆందోళన వ్యక్తం చేశారు. కార్మికులందరూ సురక్షితంగా బయపడాలని లార్డ్ బద్రి విశాల్‌ను ప్రార్థిస్తు÷-న్నట్టు చెప్పారు. బీఆర్ఓ వర్క్ సైట్‌ను హిమ చరియలు విరుచుకుపడటంతో ప్రమాదం జరిగినట్టు ఉత్తరాఖండ్ పోలీస్ హెడ్‌క్వార్టర్స్ ప్రతినిధి, ఐజీ నీలేష్ ఆనంద్ భర్నే తెలిపారు. నాలుగు అంబులెన్స్‌లను ప్రమాదస్థలికి పంపామని, విపరీతమైన మంచుకారణంగా సహాయక చర్యలకు అంతరాయం కలుగుతున్నట్టు బీఆర్ఓ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సీఆర్ మీనా చెప్పారు. ప్రతికూల వాతావరణ పరిస్థితులను కూడా అధిగమించి బాధితులను రక్షించేందుకు ఆర్మీ, ఎస్‌డీఆర్ఎఫ్, స్థానిక అధికారులు ఆపరేషన్ సాగిస్తున్నట్టు తెలిపారు. మరోవైపు,మంచు చరియలు విరిగిపడుతుండటంతో అధికారులు హైఅలర్ట్ ప్రకటించారు. మరిన్ని మంచు చరియలు విరిగిపడే అవకాశం ఉన్నందున అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు.

## ఈషా ఫౌండేషన్‌కు సుప్రీంలో ఊరట

### కాలుష్య నియంత్రణ బోర్డు ఆదేశాలు పాటిస్తుందని వెల్లడి

న్యూఢిల్లీ : ఈశా ఫౌండేషన్‌కు సుప్రీంలో ఊరట దక్కింది. కోయంబత్తూరు వెల్లియన్‌గిరి కొండలో నిర్మించిన ఈశా ఫౌండేషన యోగా, ధ్యాన కేంద్రంపై నిర్బంధ చర్య ఏదీ ఉండరాదని సుప్రీం కోర్టు న్యాయమూర్తులు సూర్య కాంత్; ఎన్ కోటీశ్వర్ సింగ్‌తో కూడిన ధర్మాసనం ఆదేశించింది. కాలుష్య నియంత్రణ బోర్డు జారీ చేసిన పర్యావరణ నిబంధనలు, ఆదేశాలు అన్నిటినీ యోగ, ధ్యాన కేంద్రం పాటిస్తుందని బెంచ్ తెలియజేసింది.వెల్లియన్‌గిరి కొండ దిగువన సరైన పర్యావరణ అనుమతి లేకుండా భవనాల నిర్మాణంపై జగ్గీ వాసుదేవ్ సారథ్యంలోని ఈశా ఫౌండేషన్‌కు తమిళనాడు కాలుష్య నివారణ బోర్డు (టిఎన్‌పిసిబి) జారీ చేసింది. ఈ నోటీసులను రద్దు చేసిన మద్రాసు హైకోర్టు ఉత్తర్వులపై జోక్యానికి సుప్రీం కోర్టు శుక్రవారం నిరాకరించింది. యోగ, ధ్యాన కేంద్రాన్ని విస్తరించే పక్షంలో సముచిత ప్రాధికార సంస్థ ముందస్తు అనుమతి తీసుకోనున్నట్లు బెంచ్ తెలిపింది. అయితే, ఈ ఉత్తర్వు అక్రమ నిర్మాణం క్రమబద్ధీకరణకు ఆనవాయితీని సృష్టించబోదని, కేసు విలక్షణ వాస్తవాలు, పరిస్థితుల దృష్ట్యా ఈ ఉత్తర్వు జారీ చేయడమైందని సర్వోన్నత న్యాయస్థానం స్పష్టం చేసింది. కోయంబత్తూరులో ఈశా ఫౌండేషన్ ఏర్పాటు చేసినవి విద్య కేటగరీ కిందకు వస్తాయని పేర్కొంటూ హైకోర్టు 2022 డిసెంబర్ 14న టిఎన్‌పిసిబి నోటీసును కొట్టివేసింది. 2021 నవంబర్ 19న బోర్డు జారీ చేసిన నోటీసును హైకోర్టు కొట్టివేసి, ఈశా ఫౌండేషన్ పిటిషన్‌ను అనుమతించింది. ముందస్తు పర్యావరణ అనుమతి లేకుండా వెల్లియన్‌గిరి కొండ దిగువన భవనాల నిర్మాణంపై బోర్డు సంజాయిషీ నోటీస్ జారీ చేసింది.

## నేటినుంచి టిజి ఎప్‌సెట్ ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణ

హైదరాబాద్ : రాష్ట్రంలో ఇంజినీరింగ్, ఫార్మా, అగ్రికల్చర్ విభాగాల్లో ప్రవేశాల కోసం నిర్వహించే టిజి ఎప్‌సెట్(ఇఎపిసెట్) ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణ పక్రియ శనివారం నుంచి ప్రారంభం కానుంది. గతంలో ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం ఫిబ్రవరి 25 నుంచి ప్రారంభం కావాల్సిన ఎప్‌సెట్ దరఖాస్తుల స్వీకరణ పక్రియ వాయిదా పడింది. ఒక పేపర్‌కు హాజరయ్యే విద్యార్థులు రూ.900 ఫీజు ఉండగా, ఎస్‌సి ఎస్‌టి వికలాంగులకు రూ.500, రెండు పేపర్లకు హాజరయ్యే విద్యార్థులు రూ.వెయ్యి, ఎస్‌సి ఎస్‌టి వికలాంగులకు రూ.1800 చెల్లించాలి. ఏప్రిల్ ఏప్రిల్ 29, 30 తేదీల్లో అగ్రికల్చర్, ఫార్మసీ విభాగాలకు, మే 2వ తేదీ నుంచి 5వ తేదీ వరకు ఇంజినీరింగ్ ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నారు. పిజి ఎప్‌సెట్(ఇఎపిసెట్) దరఖాస్తులు ఈసారి దరఖాస్తులు తగ్గే అవకాశాలు ఉన్నాయి. వృత్తి విద్యా కోర్సులలో రాష్ట్రంలో 15 శాతం సీట్లకు ఆంధ్రప్రదేశ్ విద్యార్థులు పోటీ పడే అవకాశాన్ని ప్రభుత్వం తొలగించిన నేపథ్యంలో కేవలం తెలంగాణ రాష్ట్రానికి చెందిన విద్యార్థులు మాత్రమే దరఖాస్తు చేసుకోనున్నారు. గత కొన్నేళ్లుగా రెండు తెలుగు రాష్ట్రాలకు చెందిన విద్యార్థులు భారీ సంఖ్యలో దరఖాస్తు చేసుకుంటున్నారు.గత ఏడాది ఎప్‌సెట్ పరీక్షకు 3,54,803 మందికి దరఖాస్తు చేసుకోగా, ఇంజినీరింగ్ విభాగానికి 2,54,543 మంది, అగ్రికల్చర్, ఫార్మా విభాగానికి 1,00,260 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నారు.

# పార్టీ ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ స్థానాన్ని కేటాయించాలి

## మాదిగ హక్కుల దండోరా



జమ్మికుంట ఫిబ్రవరి 28 (ది క్రైమ్ న్యూస్) : నాగార్జునసాగర్ హరిత విజయ విహార్ హోటల్లో నిర్వహించిన దండోరా రాష్ట్ర మహాసభల లో భాగంగా నిర్వహించిన 2వ రోజు మహాసభలో మాదిగ హక్కుల దండోరా జాతీయ అధ్యక్షులు దండు సురేందర్ మాదిగ మరియు రాష్ట్ర అధ్యక్షులు కొంగరి శంకర్ మాదిగ మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణ ఉద్యమంలో ప్రాణ త్యాగం చేసిన అమరుల కుటుంబాలకు కోటి పరిహారం ఇవ్వాలి. వారిలో ఒక కుటుంబానికి ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ స్థానాన్ని కేటాయించి మాదిగలపై ప్రేమను చాటుకోవాలి. గత ప్రభుత్వంలో కూడా మాదిగలకు రాజకీయపరమైన న్యాయం జరగలేదు. ప్రస్తుత ప్రజాపాలన కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి 17 నెలలు గడుస్తున్న మంత్రివర్గంలో మాదిగలకు స్థానం లేకపోవడం బాధాకరమైన విషయం. ఏ పార్టీ అధికారంలో ఉన్నా కూడా మాదిగలకు పూర్తిస్థాయిలో దక్కాల్సిన రాజకీయ స్థానం, రిజర్వేషన్ శాతాలు దక్కలేదు. జనాభా దామాషా ప్రకారం కానీ ఎస్సీ రిజర్వుడు పార్లమెంట్ టికెట్ల లో కానీ కాంగ్రెస్ పార్టీ మాదిగలకు అన్యాయం చేసిందని స్పష్టంగా కనిపిస్తుంది. కాంగ్రెస్ ప్రభుత్వం మాదిగల అభివృద్ధిపై చిత్తశుద్ధి చాటుకోవాలనుకుంటే మాదిగలకు మంత్రివర్గ విస్తరణలో రెండు స్థానాలు కేటాయించాలి అవసరమైతే విద్యాశాఖ మంత్రి పదవిని, సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి పదవిని మాదిగలకు కేటాయించాలని ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వానికి సూచించారు. గత పది సంవత్సరాలు అధికారంలో ఉన్న టిఆర్ఎస్ పార్టీ మాదిగలను ఓటు బ్యాంకుగా వాడుకొని మాదిగల అభివృద్ధికి దోహదం చేయలేదు అందుకే గత ప్రభుత్వాన్ని మాదిగలు రాజకీయంగా బుద్ధి చెప్పి కాంగ్రెస్ పార్టీకి వెన్నుముకగా నిలబడ్డారు. ఇది దృష్టిలో ఉంచుకొని కాంగ్రెస్ ప్రభుత్వం మాదిగ అమరవీరుల స్మారక స్థూపాన్ని ఐదు ఎకరాలలో నిర్మించాలి .మాదిగలకు ఎస్సీ ఎస్టీ సబ్ ప్లాన్ ద్వారా అత్యధిక నిధులు కేటాయించాలి. అదేవిధంగా మాదిగ విద్యార్థుల కోసం విదేశీ విద్య ద్వారా అధిక నిధులు ఇవ్వాలి. అని తెలిపారు కార్యక్రమంలో రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ చిలుక రాజనర్సిమాదిగా రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ చింతల శ్యామ్ మాదిగ రాష్ట్ర అధికార ప్రతినిధి సగ్గి సామ్రాట్ ప్రకాష్ మాదిగ, కరీంనగర్ జిల్లా అధ్యక్షులు రేణికుంట్ల కుమార్ మాదిగ, దొడ్డే రాజేంద్రప్రసాద్ మాదిగ, వర్కిళ్ల రాజయ్య మాదిగ రాజ్ కుమార్ మాదిగ , శివాజీ మాదిగ, రాష్ట్ర, జిల్లా నాయకులు తదితరులు పాల్గొన్నారు

## రాష్ట్రంలో అస్తవ్యస్తంగా కాంగ్రెస్ పాలన : కేటీఆర్

హైదరాబాద్ : రాష్ట్రంలో పాలన అస్తవ్యస్తంగా మారిందని, ఏరంగం సంతోషంగా లేదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ విమర్శించారు. రాష్ట్రంలో ప్రజాపాలన పరాకాష్టకు చేరిందని అన్నారు. విషాదంలోనూ మంత్రులు వినోదం పొందుతున్నారని కేటీఆర్ నిప్పులు చెరిగారు. హెలికాప్టర్ యాత్రలు చేస్తూ.. చేపకూర విందులతో ఎంజాయ్ చేస్తున్నారంటూ కాంగ్రెస్ మంత్రులపై కేటీఆర్ విరుచుకుపడ్డారు. హాస్టల్ విద్యార్థులకు మాత్రం అన్నం పెట్టకుండా పస్తులు ఉంచుతున్నారని కేటీఆర్ మండిపడ్డారు. విద్యార్థులకు కనీసం తిండి పెట్టలేని దుస్థితిలో రేవంత్ ప్రజా ప్రభుత్వం ఉందన్నారు. "అన్నం వండలేదు గుడిలో తినండి" అని నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేట నియోజకవర్గం బల్మూరు మండలం కొండనాగుల ఎస్టీ బాలుర హాస్టల్ సిబ్బంది విద్యార్థులకు ఆదేశాలు ఇవ్వడం దారుణమన్నారు. కొండనాగులలోని ఎస్టీ బాలుర హాస్టల్‌లో శివరాత్రి పండుగ రోజు 380 మందికి గాను 200 మంది విద్యార్థులు ఉన్నారు. అయితే మధ్యాహ్న భోజనం గుడిబండ శివాలయంలో చేసే అన్నదానానికి వెళ్ళి తినాలని, రాత్రి భోజనం కోసం వీరం రామాజిపల్లిలోని గంగమ్మ దేవాలయంలో అన్నదానానికి వెళ్లి తినమని విద్యార్థులకు చెప్పి హాస్టల్ సిబ్బంది వంట చేయడం మానేశారని కేటీఆర్ తెలిపారు. భోజనం కోసం అంత దూరం నడిచి వెళ్ళే ఓపిక లేక విద్యార్థులు పస్తులు ఉన్నారని కేటీఆర్ పేర్కొన్నారు. పండగ పూట విద్యార్థులకు కనీసం భోజనం పెట్టకుండా, అన్ని కిలోమీటర్లు నడుచుకుంటూ వెళ్ళి తినమని చెప్పడం ఏంటి అని విద్యార్థుల తల్లిదండ్రులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. పండగపూట విద్యార్థులను పస్తులుంచడమే ప్రజాపాలనా అని కేటీఆర్ ప్రశ్నించారు.

## పనిఒత్తిడితో మనస్తాపంతో ఆర్‌టీసీ కండక్టర్ ఆత్మహత్య

యాచారం : పని ఒత్తిడి కారణంగా మనస్థాపానికి గురై ఓ ఆర్టీసీ కండక్టర్ ఆత్మహత్య చేసుకున్న ఘటన యాచారం పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకున్నది.సీఐ నందీశ్వర్ రెడ్డి, స్థానికులు తెలిపిన కథనం ప్రకారం.. యాచారం మండల పరిధిలోని గాండ్లగూడ గ్రామానికి చెందిన కోరే అంజయ్య (40) ఇబ్రహీంపట్నం ఆర్టీసీ డిపోలో కండక్టర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. గత కొంతకాలంగా ఒత్తిడికి గురవుతున్నాడు. దీంతో ఆయన 15 రోజుల క్రితం పురుగుల మందు తాగి ఆత్మహత్యయత్నానికి పాల్పడ్డారు. గమనించిన కుటుంబ సభ్యులు దవాఖానకు తరలించారు. చికిత్స పొందుతూ మామూలు స్థితికి చేరుకున్నారు. అయితే గురువారం సాయంత్రం మళ్లీ పురుగుల మందు తాగి ఆత్మహత్య యత్నానికి పాల్పడ్డాడు. దీంతో అతడిని హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ దవాఖానకు తరలించారు. పరిస్థితి విషమించడంతో శుక్రవారం ఉదయం తుదిశ్వాస విడిచారు. ఆర్టీసీ అధికారుల ఒత్తిడితోనే అంజయ్య పలుమార్లు మానసికంగా ఇబ్బందులకు గురైనట్లు స్థానికులు పేర్కొంటున్నారు. కేసు దర్యాప్తు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

## జక్కని సంజయ్ ఆమరణదీక్షతోనే బిసి ఉద్యమం మలుపు తిరిగింది

### మాజీ ఐఏఎస్ చిరంజీవులు



శంకరపట్నం (ది క్రైమ్ న్యూస్): కరీంనగర్ జిల్లా శంకరపట్నం మండలానికి చెందిన బిసి ఆజాద్ ఫెడరేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు జక్కని సంజయ్ కుమార్ ను హైదరాబాద్ సోమాజిగూడ ప్రెస్ క్లబ్లో శుక్రవారం తెలంగాణ రాష్ట్ర పద్మశాలి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వల్లకాటి రాజ్ కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన సమ్మేళనంలో సంఘ నాయకులు ఘనంగా సన్మానించారు.కార్యక్రమానికి మాజీ ఐఏఎస్ అధికారి చిరంజీవులు, బిసి రాజ్యాధికార సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు దాసు సురేష్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ..... బీసీల ఐక్యతా, అభివృద్ధి కోసం సంజయ్ కుమార్ చేస్తున్న కృషి ఎంతో ప్రాముఖ్యమైందని కొనియాడుతూ సమాజ శ్రేయస్సు కోసం ఎన్నో కష్టనష్టాలకోర్చి ప్రతి ఉద్యమంలో ముందుండి కొట్లాడే పద్మశాలీలు అన్ని రంగాల్లో వెనుకబడి ఉన్నారని వారి అభివృద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వం పనిచేయాలని కోరారు. 12 రోజుల ఆమరణదీక్షతో బీసి ఉద్యమాన్ని తట్టిలేపిన జక్కని సంజయ్ కృషి వల్లే తెలంగాణలో బీసీ ఉద్యమం ఉవ్వెత్తున ఎగిసిందని బీసీల పోరాటంలో సంజయ్ మరింత ముందుకు సాగాలని కోరారు. కార్యక్రమంలో సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గంజి శ్రీనివాస్, నాయకులు గోనె ఏల్లప్ప, నగేష్ నేత, అప్పం శ్రీనివాస్, వేముల బాలరాజు తదితరులు పాల్గొన్నారు.




## ఉపాధ్యాయునికి పదవీ విరమణ సన్మానం

రామగిరి(ది క్రైమ్ న్యూస్)ఫిబ్రవరి 28:- రామగిరి మండలం కల్వచర్ల గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల స్కూల్ అసిస్టెంట్ (సాంఘిక శాస్త్రం) ఉపాధ్యాయులు జక్కు సత్యనారాయణమూర్తి ని పాఠశాల ఆవరణలో పదవి విరమణ శుభాకాంక్షలు తెలుపుతూ ఘనంగా సన్మానించడం జరిగింది. పదవి విరమణ పొందిన నేపథ్యంలో వారికీ శుక్రవారం పాఠశాలలో వీడ్కోలు సమావేశం ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు టీ శోభన్ రావు, సహ ఉపాధ్యాయులు, పాఠశాల సిబ్బందితో పాటు, పుర ప్రముఖులు తెలంగాణ పద్మశాలి ఉద్యోగ సంఘం జిల్లా అధ్యక్షులు కొలిపాక సారయ్య, గ్రామపంచాయతీ కార్యదర్శి చిలగాని శ్రీధర్ చేనేత కండువా కప్పి మార్కండేయ దైవం ఫోటోను జ్ఞాపికగా అందించి విద్యార్థులు, తోటి ఉపాధ్యాయులు ఘనంగా శాలువాతో సత్కరించారు. అనంతరం ఉపాధ్యాయులు మాట్లాడుతూ ఉపాధ్యాయ వృత్తి పవిత్రమైనదని, విద్యార్థులను తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల కృషి మరవలేనిదని తెలిపారు. పదవీ విరమణ పొందిన ఉపాధ్యాయుని ఈ పాఠశాలలో చాలాకాలం పనిచేసి విద్యార్థులకు సేవలందించారని అన్నారు. అంకితభావంతో పనిచేసి విద్యార్థుల, పాఠశాల ప్రగతికి కృషి చేసిన ఉపాధ్యాయుని సన్మానించడం ఆనందంగా ఉందని అన్నారు. గత కొన్ని సంవత్సరాలుగా పాఠశాలలో పనిచేసిన ఉపాధ్యాయులు పదవీ విరమణ పొంది వెళ్లడం బాధగా ఉన్నప్పటికీ ఉద్యోగ నిర్వహణలో తప్పదని అన్నారు. నాలుబై ఒక్క సంవత్సరాల రెండు నెలల సర్వీస్ పూర్తి చేసుకుని ఆరువై ఒక్క సంవత్సరాల వయస్సు పూర్తితో పదవి విరమణ పొందుతున్న సందర్భంగా వారి శేష జీవితం ఆయురారోగ్యాలతో గడపాలని కోరుకుంటూ వారు చేసిన సేవలను కొనియాడారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ భూముల సర్వేను సాగదీసుడు ఎందుకు

- శివారు మొత్తం భూ అక్రమదారులే
- పట్టకు ఉన్నది కొంత సాగు పదింతలు
- జిల్లా కలెక్టర్ ఆదేశించిన నత్త నడక సర్వేలు..?
- మర్మం ఎరిగిన నాయకుడు ఎవరు..!!



ధర్మారం ఫిబ్రవరి 28 (ది క్రైమ్ న్యూస్): ప్రభుత్వ భూమిలో మొత్తం భూ అక్రమ దారులే పట్టకు ఉన్నది కొంత పదింతలు సాగు చేయటం పేదోని పేరు మీద భూదోపిడి జరుగుతుంది, వివరాల్లోకి వెళితే పెద్దపెల్లి జిల్లా ధర్మారం మండలంలోని కిలవనపర్తి బొమ్మరెడ్డిపల్లి ధర్మారం పట్టణం తో పాటు నర్సింగాపూర్ గల గ్రామాలలో శివారు ప్రభుత్వ భూములను పూర్తి స్థాయిలో సర్వే నిర్వహించాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష ఆదేశించి ఆరు మాసాలు గడుస్తున్న అధికారులు సర్వేలను సాగదీస్తూ నత్త నడక సర్వేలు నిర్వహిస్తున్నారని గ్రామస్తుల వాదనలు లేకపోలేదు. నర్సింగాపూర్ గ్రామ శివారులో ఉన్న ప్రభుత్వ భూములను అక్రమంగా ఆక్రమించి సాగు చేసుకుంటూ దొడ్డిదారిలో పట్టాలు పొందింది కొంత అయితే సాగు చేసేది పదింతలు, శివారు మొత్తం భూ అక్రమ దారులే ఉన్నారనీ గతంలో ఎన్నోసార్లు అధికారులకు గ్రామస్తులు ఫిర్యాదులు చేసిన నిమ్మకు నీరు ఎత్తినట్టు రెవెన్యూ అధికారుల తీరు మారడం లేదని గతంలో పేదలకు భూ పంపిణీ చేసింది కొంత అయితే భూ అక్రమ దారులు దర్జాగా పేదోని పేరు మీద భూ దోపిడీ చేస్తున్నారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు.ఎన్నో సార్లు సర్వే నిర్వహించిన రెవెన్యూ అధికారులు నేటికీ అక్రమ దారులను తొలగించకుండా మళ్ళీ వాళ్లకే పట్టాలు అందించేవిధంగా ఉన్నట్టు పలు అనుమానాలు వ్యక్తమౌతున్నాయి అంటున్నారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు సర్వే నిర్వహిస్తున్నామని తెలిపిన అధికారులు ఆరు మాసాలుగా సర్వే కొనసాగిస్తూ... ఎక్కడ వేసిన గొంగడి అక్కడే ఉంటుంది తెర వెనక మర్మం ఎరిగిన నాయకుడు ఎవరు ఉన్నారు అని ప్రజలు అనుకుంటున్నారు..

## యువత శాస్త్రవేత్తలను ఆదర్శంగా తీసుకోవాలి : రాజ్‌నాథ్‌సింగ్

హైదరాబాద్ : శాస్త్రవేత్తలను ఆదర్శంగా తీసుకోవాలని యువతకు కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ పిలుపు నిచ్చారు. గ్లోబల్ లీడర్ షిప్‌లో యువతదే కీలక పాత్ర అని ఆయన స్పష్టం చేశారు. నేషనల్ సైన్స్ డే సందర్భంగా హైదరాబాద్‌లోని విజ్ఞాన్ వైభవ్-2025ను సీఎం రేవంత్ రెడ్డితో కలిసి కేంద్ర మంత్రి రాజ్‌నాథ్ సింగ్ ప్రారంభించారు. అనంతరం కేంద్ర మంత్రి రాజ్‌నాథ్ సింగ్ మాట్లాడుతూ.. సైన్స్ అండ్ టెక్నాలజీలో వచ్చే మార్పుల పట్ల విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలన్నారు. రక్షణ శాఖ చారిత్రాత్మక విజయాల్లో కేంద్రం విశేష పాత్ర పోషిస్తుందని ఈ సందర్భంగా ఆయన స్పష్టం చేశారు. అయితే గత కొద్ది సంవత్సరాలుగా ఈ శాఖకు తాను మంత్రిగా ఉండడం తన అదృష్టంగా భావిస్తున్నాన్నారు. మానవుని మేధ సంపత్తు చాలా గొప్పదని చెప్పారు. సైన్స్ అండ్ టెక్నాలజీలో వస్తున్న మార్పులకు అనుగుణంగా రక్షణ శాఖలో మార్పులు చోటు చేసుకుంటున్నాయని కేంద్ర మంత్రి రాజ్‌నాథ్ సింగ్ తెలిపారు. సైన్స్ అండ్ టెక్నాలజీలో దేశం కొత్త ఒరవడిని సృష్టిస్తోందని పేర్కొన్నారు. దేశంలో పరిశ్రమలు ఏర్పాటు చేయడం ద్వారా ఆర్థిక వ్యవస్థ బలోపేతమవుతోందన్నారు. అన్ని రంగాల్లో భారత్ అగ్రగామిగా మారుతోందని చెప్పారు. రక్షణ శాఖ చారిత్రాత్మక విజయాల్లో కేంద్రం విశేష పాత్ర పోషిస్తుందని ఈ సందర్భంగా ఆయన స్పష్టం చేశారు. అయితే గత కొద్ది సంవత్సరాలుగా ఈ శాఖకు తాను మంత్రిగా ఉండడం తన అదృష్టంగా భావిస్తున్నాన్నారు.

## దేశం కోసం..పేదల కోసం పోరాడింది కాంగ్రెస్సే

### పిసిసి సమావేశంలో ఇన్‌ఛార్జ్ మీనాక్షి నటరాజన్

హైదరాబాద్ : టీపీసీసీ సమావేశంలో పాల్గొన్న రాష్ట్ర వ్యవహారాల ఇంచార్జ్ మీనాక్షి నటరాజన్ కీలక వ్యాఖ్యలు చేశారు. వంద సంవత్సరాల క్రితం గాంధీ కాంగ్రెస్ అధ్యక్ష పదవి సవీకరించిన రోజు అని అన్నారు. స్వాతంత్ర్యం కోసం పోరాడింది కాంగ్రెస్సే.. దేశాన్ని కాపాడేది కాంగ్రెస్సే అని అన్నారు. రాజ్యాంగ పరిరక్షణ కోసమే రాహుల్ గాంధీ భారత్ జోడో యాత్ర చేశారని అన్నారు. ఈ ప్రభుత్వం కాంగ్రెస్ కార్యకర్తల త్యాగంతో ఏర్పడిందని.. సామాజిక న్యాయం కోసం, మార్పు కోసం పార్టీ కార్యకర్తలు కష్టపడ్డారని అన్నారు. మార్పు కోసం కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిందని అన్నారు. గ్రామ గ్రామన పార్టీ కార్యక్రమాలను విస్తృతంగా చేపట్టాలని..ఈ విషయంలో పీసీసీ పకడ్బందీగా కాలెండర్ సిద్ధం చేయాలని మీనాక్షి నటరాజన్ అన్నారు. ప్రతి కార్యకర్త పేద వాడి కోసం పని చేయాలని.. పేదల మొఖంలో నవ్వులు చూడాలని.. అప్పుడే మనం పని చేసినట్టని అన్నారు మీనాక్షి. రాహుల్ గాంధీ రాజ్యాంగ రక్షణ కోసం భారత్ జొడో యాత్ర నిర్వహించి ఒక మైదానాన్ని తయారు చేశారని.. మనం దాని కోసం పోరాటం చేయాలని అన్నారు. బీజేపీ, బిఆర్ఎస్ పార్టీలతో మనం పోరాటం చేయాల్సి ఉందని అన్నారు. కాంగ్రెస్ పార్టీ దేశం కోసం పోరాటం చేసి స్వాతంత్రాన్ని తెచ్చిందని.. కాంగ్రెస్ ఎలాంటి పోరాటానికి అయిన సిద్ధంగా ఉందని అన్నారు. రాష్ట్రంలో సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం అనేక కార్యక్రమాలు చేపట్టిందని.. ఇవన్నీ ప్రజలకు సక్రమంగా అందాలని అన్నారు. పదేళ్లుగా కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు ఎంతో కష్టపడి పని చేసారని.. వారికి న్యాయం జరగాలని అన్నారు.పదవులు పొందినవారు ప్రజల కోసం పని చేయాలని అన్నారు. దేశంలో ఎక్కడా లేని విదంగా తెలంగాణలో కులగణన చేపట్టామని.. ఇది చాలా గొప్ప విషయమని అన్నారు.గ్రామ గ్రామానికి వెళ్లి జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ కార్యక్రమాలను పెద్ద ఎత్తున చేపట్టాలని అన్నారు.

## 2న నగరంలో ఉపరాష్ట్రపతి పర్యటన

### భద్రతా ఏర్పాట్లపై అధికారులతో సిఎస్ సమీక్ష



హైదరాబాద్ : మార్చి 2వ తేదీన రాష్ట్రంలో ఉపరాష్ట్రపతి జగ్‌దీప్ ధన్‌కడ్ పర్యటిచనున్నారు. ఈ సందర్భంగా తగిన ఏర్పాట్లపై ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి ఉన్నతాధికారులతో శుక్రవారం సచివాలయంలో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అన్ని శాఖలు సమన్వయంతో పని చేస్తూ తగిన ఏర్పాట్లు చేయాలని అధికారులకు ఆమె సూచించారు. కాగా ఉపరాష్ట్రపతి హైదరాబాద్ లోని ఐఐటిని సందర్శించి అక్కడి అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులతో ముచ్చటిస్తారని సిఎస్ తెలియజేశారు. అనంతరం నగరంలోని ఓ ప్రైవేట్ కార్యక్రమంలో కూడా పాల్గొని అదే రోజు తిరిగి న్యూఢిల్లీకి బయలుదేరి వెళ్లనున్నారు.ఉపరాష్ట్రపతి పర్యటన సందర్భంగా భద్రతా ఏర్పాట్లు చేయాలని పోలీసు శాఖకు సి.ఎస్ సూచించారు. ఆర్ అండ్ బి శాఖ, పోలీసు శాఖతో సమన్వయం చేసుకుని అవసరమైన ఏర్పాట్లు చేయాలని తెలిపారు. వైద్యారోగ్య శాఖకు అర్హులైన వైద్యులు, ఇతర సామాగ్రి అందుబాటులో ఉంచాలని సూచించారు. అదేవిధంగా, నిరంతరాయంగా విద్యుత్ సరఫరా చేయాలని ఇంధన శాఖకు చెప్పారు. ఈ సమావేశంలో హోం స్పెషల్ చీఫ్ సెక్రటరీ రవిగుప్తా, ఆర్ అండ్ బి స్పెషల్ చీఫ్ సెక్రటరీ వికాస్ రాజ్, పొలిటికల్ సెక్రటరీ రఘునందన్ రావు, సమాచార శాఖ స్పెషల్ కమిషనర్ డాక్టర్ ఎస్ హరీష్, హైదరాబాద్, సంగారెడ్డి కలెక్టర్లు, ఇతర పోలీసు అధికారులు పాల్గొన్నారు. ఉపరాష్ట్రపతి పర్యటన సందర్బంగా ఆయా ప్రాంతాల్లో ట్రాఫిక్ ఆంక్షలు ఉంటాయి.

## ఐఎఎస్ శివశంకర్‌కు ఎపిలోనే పోస్టింగ్

### ఆదేవాలు జారీ చేసిన క్యాట్

అమరావతి : ఐఏఎస్ అధికారి ఎల్.శివశంకర్ భారీ ఊరట కలిగింది. ఆయన్ను ఏపీకి కేటాయించాలంటూ తాజాగా క్యాట్ ఆదేశాలు ఇచ్చింది. ఈ మేరకు, శివశంకర్ ను నాలుగు వారాల్లోగా ఏపీ క్యాడర్‌కు కేటాయిస్తూ ఉత్తర్వులు ఇవ్వాలంటూ డీవోపీటీని ఆదేశించింది. విభజన సమయంలో తనను తెలంగాణకు కేటాయించడం పట్ల ఐఏఎస్ అధికారి ఎల్.శివశంకర్ న్యాయపోరాటం చేస్తున్నారు. ఈ క్రమంలో కొన్నాళ్ల కిందట ఐఏఎస్ అధికారి శివశంకర్ సీఎం చంద్రబాబును కలిశారు. తన సొంత రాష్ట్రం ఏపీ అని, కానీ పోస్టింగ్ సమయంలో తాత్కాలిక చిరునామా కింద హైదరాబాద్ అని పేర్కొన్నానని చంద్రబాబుకు వివరించారు. స్థానికతను పరిగణనలోకి తీసుకుని తనను ఏపీలో కొనసాగేలా చూడాలని కోరారు. శివశంకర్ విజ్ఞప్తి పట్ల సానుకూలంగా స్పందించిన చంద్రబాబు కేంద్రంతో మాట్లాడారు. ఈ క్రమంలోనే, శివశంకర్ ను ఏపీకి కేటాయించేలా చర్యలు తీసుకోవాలంటూ క్యాట్ తాజాగా డీవోపీటీకి ఆదేశాలు జారీ చేసింది.

# సంపాదకీయం

## ఎంతకాలమీ అప్పుల బాగోతం !

కేంద్రంలోని మోడీ ప్రభుత్వాన్ని విమర్శిస్తున్న ఆయా రాష్ట్రాల ప్రభుత్వాలు ఆర్థిక క్రమశిక్షణ పాటించడం లేదు. ప్రతిదానికి కేంద్రం సాయాం చేయాలని దేబురిస్తున్నాయి. అదేపనిగా అప్పులు చేస్తూ ప్రజలపై భారం మోపుతున్నాయి. సంక్షేమ పథకాల పేరుతో అప్పులు చేసి వడ్డీలు కడుతున్నాయి. ఉమ్మడి తెలుగు రాష్ట్రాల్లో గత కెసిఆర్, జగన్ ఏలుబడిలో చేసిన లక్షల కోట్లు అభివృద్ధి పేరుతో దుబారా చేశారు. ఇప్పుడు వాటికి వడ్డీలకే వేలకోట్లు చెల్లించాల్సి వస్తోంది. ఇదంతా దుబారా కాక మరోటి కాదు. పథకాలపై సమీక్షించ కుండా ఆయా రాష్ట్రాల ప్రభుత్వాలు పోటీపడి ఉచిత పథకాలు అమలు చేస్తున్నాయి. పెన్షన్లు కూడా భారంగా మారాయి. కిలో రూపాయి బియ్యం పథకం కూడా భారంగా మారింది. వీటిపై సమీక్షించి, ధరలు పెంచాలన్న ఆలోచన చేయడం లేదు. ఇవన్నీ సమీక్షిస్తూ నెలకు కనీసం ఐదారువేల కోట్ల రూపాయలు మిగులుతాయి. తెలంగాణనే తీసుకుంటే వేల కోట్లు వడ్డీలు కట్టాల్సి వస్తోందని సిఎం రేవంత్ రెడ్డి తాజాగా చేసిన వ్యాఖ్యలు చూస్తే గత కెసిఆర్ ప్రభుత్వం చేసిన అప్పులు ఎంతగా పెరిగాయో గమనించవచ్చు. అలాగే జగన్ చేసిన అప్పులకు కూటమి ప్రభుత్వం కూడా కోలుకోలేకుండా పోయింది. అప్పులు చెల్లించేం దుకు మరిన్ని అప్పులు చేసే బదులు ఖర్చులు తగ్గించుకోవచ్చు. దుబారాను అరికట్ట వచ్చు. కానీ ప్రభుత్వాలు అలా చేయడం లేదు. ప్రభుత్వ నిర్వహణ అంటే కేవలం అప్పులు చేసి, ప్రజలకు నగదు బదిలీ చేయడం అని జగన్ నిరూపించారు. రాష్ట్రాలన్ని ఇలా దివాళా దిశగా ఉన్నాయి. ఎక్కడా అభివృద్ధి కన్నా ఓట్లు రాబట్టే పథకాలే సాగుతున్నాయి. ఇందుకు ఏ రాష్ట్రం కూడా మినహాయింపు కాదు. అభివృద్ధి పక్కకు పోయింది. తెలంగాణలో కాళేశ్వరంపై తప్పులు ఒప్పుకోకుండా బిఆర్ఎస్ ఎదురుదాడికి దిగుతోంది. ఏ పథకం తీసుకున్నా అవినీతి కనిపిస్తోంది. నోరుంది కదాని బిఆర్ఎస్ నేతలు చేస్తున్న విపరీత వ్యాఖ్యలు,ఆరోపణలు జుగుప్స కలిగిస్తున్నాయి. ప్రతిపనికీ కేంద్రంపై ఆధారపడాల్సి వస్తోంది. రాష్ట్రాలు స్వయం సమృద్ధి సాధించకపోవడం వల్ల ఇలా దివాళా తీయాల్సి వస్తోంది. అయితే మోడీని ప్రశ్నించే ముందు తమ రాష్ట్రాల్లో తాము ఎంత సచ్ఛీలంగా పాలన చేస్తున్నామో ఆయా రాష్ట్రాల్లో అధికారంలో ఉన్న పార్టీలు గమనించాలి. ప్రజలు చేస్తున్నవిమర్శలకు సమాధానం చెప్పాలి. అలాగని కేంద్రం చేస్తున్న ఆర్థిక దుర్వినియోగాన్ని తప్పు పట్టకుండా ఉండలేం. కేంద్రం చేస్తున్న దుర్వినియోగాన్ని, దుర్మార్గాలను ఎండగట్టాల్సిందే. అవినీతి నేతలకు త్వరగా శిక్షలు పడాలి. అప్పుడే దేశంలో జవాబుదారీతనం వస్తుంది. ఎంతమంది అవినీతికి పాల్పడ్డారో వారందరినీ ఒకే గాటన కట్టివుంటే బాగుండేది. రాజకీయ అవినీతిని, కార్పోరేట్ మోసాలను అరికట్టే విషయంలో ఎవరికీ అభ్యంతరం లేదు. కానీ మోడీ మాత్రం విమర్శలను పట్టించుకోవడం లేదు. ప్రజాస్వామ్యాన్ని పట్టించుకోవడం లేదు. రాజ్యాంగ వ్యవస్థలను గుప్పిట్లో పెట్టుకుని ఎంతకాలం ఇలా ముందుకు వెళతారన్నది చూడాలి. సిబిఐ, ఐటి, ఇడి దాడులపై వస్తున్న ఆరోపణలను పట్టించుకోవడం లేదు. ఆయా రాష్ట్రాల్లో చిచ్చు పెట్టి అధికారాన్ని చేజిక్కించు కుంటున్న తీరు కాంగ్రెస్ పాలనకన్నా దారుణంగా ఉంది. వ్యవస్థలను భ్రష్టు పట్టించిన ఘనత కాంగ్రెస్ దయితే..అంతకుమించిన దారుణాలను ఇప్పుడు మోడీ అనుసరిస్తున్నారు. ప్రజల సమస్యలను పక్కన పెట్టే ఇలాంటి చర్యలు సమర్థనీయం కాదు. ప్రజల సమస్యలను ప్రధానంగా పరిష్కరిస్తూనే...అవినీతి నేతలను బొక్కలో వేయాల్సిందే. రాజ్యాంగ సంస్థలు అందరి విషయంలో సమన్యాయంతో వ్యవహరించాల్సిన బాధ్యత వుంది. భారత ప్రజాస్వామ్యం పదికాలాలపాటు పటిష్టంగా నిలదొక్కుకోవాలంటే రాజ్యాంగ వ్యవస్థలు పటిష్టంగా పనిచేయాలి. నిష్పాక్షి కంగా నిర్ణయాలు తీసుకోవాలి. అధికారంలో ఉన్న సమయంలో అధికార పార్టీకి కొమ్ముకాసే విధంగా ఉండరాదు. ఇది ఒక్క కేంద్రం విషయంలో మాత్రమే జరగడం లేదు. రాష్ట్రాల్లో నూ ఇలాగే వ్యవస్థలను భ్రష్టు పట్టిస్తున్నారు. కేంద్రాన్ని విమర్శిస్తున్న ప్రాంతీయ పార్టీల నేతలు తాము అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో కూడా అధికార దుర్వినియోగానికి పాల్పడుతున్నారు. కేంద్రంలో అధికారంలో ఏ పార్టీ ప్రభుత్వం ఉంటే అవి రాజకీయ జోక్యంతో రాజ్యాంగ సంస్థలను తమ గుప్పిట్లో పెట్టుకుంటు న్నాయి. అందుకే రాజ్యాంగ సంస్కరణలు రావాలని మేధావులు కోరుకుంటున్నారు. ప్రధానంగా వివిధ దర్యాప్తు సంస్థలు, ఎన్నికల సంఘం,ప్రణాళికా సంఘం అంటే నీతి ఆయోగ్, యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్, కంప్ట్రోలర్ అండ్ ఆడిట్జనరల్ వంటి అనేక సంస్థలు జవాబు దారీగా ఉండేలా పటిష్ట రాజ్యాంగం అవసరం. దేశ సమాఖ్య విధానంలో సహకార స్ఫూర్తిని పెంపొందించాల్సిన కేంద్రం అందుకు భిన్నంగా వ్యవహరిస్తోంది. భారత రాజ్యాంగ సంస్థల పట్ల విశ్వసనీయత పెరగాలి. అవి తీసుకునే నిర్ణయాలు ఏకపక్షంగా ఉండకుండా చూసుకోవాలి. అందుకు దేశవ్యాప్తంగా చర్చచేయాలి. రాజ్యాంగాన్ని అడ్డం పెట్టుకుని స్వారీ చేసే పాలకుల తీరు మారాలి. ఇలాంటి పాలకులు వస్తారని బహుశా రాజ్యాంగ రచన చేసిన వారు ఊహించ ఉండరు. అందువల్ల వ్యవస్థలను బలోపేతం చేస్తూ..రాజకీయజోక్యం లేని పాలనా సంస్థలను రూపొందించుకోవాలి. కేంద్రంలో లేదా రాష్ట్రంలో అధికరాంలో ఉన్న పార్టీలు తమ అవసరాలకు వాటిని దుర్వినియోగం చేసే విధానాలకు చెక్ పెట్టాల్సిన అసవరం ఏర్పడింది. ప్రజలు అప్రమత్తంగా లేకుంటే పాలకులు స్వారీ చేస్తారని ప్రజలు గుర్తించాలి. ఇలా ప్రజలు నిద్రలో ఉన్నంత కాలం పాలకుల తమ విధానాలనే రుద్దుతారు. తాము చేసిందే కరెక్ట్ అని చెబుతారు. దీనిని అడ్డుకోవడం అన్నది ప్రజలు తమ కర్తవ్యంగా గుర్తించాలి.తాము అప్పగించిన అధికారం దుర్వినియోగం కాకుండా చూసుకోవాలి. నిరంతరంగా ఇలాంటి అనర్థాలపై ప్రజలు చర్చించాలి. రాజ్యాంగ వ్యవస్థల పనితీరు, పాలకుల పనితీరు, అవినీతి పాలనలపై చర్చించాలి. ఎవరు అవినీతికి పాల్పడినా తోణ శిక్షలు పడేలా చేయాలి. రాజకీయ అవినీతకి లోక్‌పాల్ లాంటి సంస్థలు రావాలి. రాజ్యాంగ పరిరక్షణతో పాలకుల అవినీతి, అక్రమాలపై మేధావులు గొంతెత్తాలి. నిరంతరం ప్రజలను జాగరూకత పర్చాలి. రాష్ట్రాలు ఆర్థిక జవాబుదారీతనంతోముందుకు సాగేలా చూడాలి. ఇష్టం వచ్చినట్లు అప్పులు చేసి, అభివృద్ధి కోసమే అంటే బోనెక్కించాల్సి రావాలి.

# ప్రజల నమ్మకాన్ని కోల్పోతున్న మోడీ



### బిజెపికి ఇక నూకలు చెల్లినట్లే కాంగ్రెస్ నేత మల్లు రవి

హైదరాబాద్ : కేంద్రంలో మోడీకి వ్యతిరేకంగా మిషన్ మొదల య్యిందని...ఇక బిజెపి ఆటలు సాగవని కాంగ్రెస్ సీనియన్ నేత మల్లు రవి అన్నారు. రాజ్యాంగ వ్యవస్థలను గుప్పిట్లో పెట్టుకుని అధికార దుర్వినియోగానికి పాల్పడుతున్న మోడీకి ప్రజలు గుణపాఠం చెప్పడం ఎంతో దూరం లేదన్నారు. బిజెపి దేశానికే కాదు... రాష్ట్రాలకు కూడా ఏమీ చేయలేదని ప్రజలు కూడా గుర్తించారని అన్నారు. అలాంటి బిజెపిని ఎంత త్వరగా సాగనంపితే అంతమంచిదని అన్నారు. జమిలి ఎన్నికల గురించి పలవరిస్తున్న మోడీకి ..అలా చేస్తే గుణపాఠం తప్పదన్నారు. దర్యాప్తు సంస్థలను దుర్వినియోగం చేయడం గతంలో ఎప్పుడూ ఇంతగా జరగలేదన్నారు. తమ స్వార్థం కోసం బిజెపి ఎంతటి చర్యలకైనా దిగుతోందన్నారు. విపక్షాలు లక్ష్యంగా చేస్తున్న ఈ చర్యలను ప్రజలు గమనించారని అన్నారు. ప్రజలు అంత అమాయకులు కాదుకదా అని అన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం దళారీలను బాగు చేయడం మినహా ప్రజలకు చేసింది శూన్యమని విమర్శించారు. ప్రజల కోసం చేసిన ఒక్క మంచి పథకం ఏదో చెప్పాలని బీజేపీకి సవాల్ విసిరారు. ఆదానీ, అంబానీలకు దోచిపెడుతున్న తీరు వల్ల దేశ అర్థిక వ్యవస్థ దిగజారిందన్నారు. ఢిల్లీలోని బీజేపీ సర్కారును గద్దె దింపే కార్యక్రమం మొదలైందని మల్లురవి వ్యాఖ్యానించారు. ఇండియా కూటమికి వస్తున్న ఆదరణను చూసి ఓర్వలేక బీజేపీ కుట్రలు పన్నుతున్నదని మండిపడ్డారు. మొన్నటి ఎన్నికల్లో కూటమి మంచి ఫలితాలు సాధించిందని, విపక్షహోదాను పొందిందని అన్నారు. అన్ని పార్టీలు కలసి ముందుకు వస్తున్నాయని, విభేదాల సృష్టించి పబ్బం గడుపుకోవాలని బిజెపి ప్రయత్నాలు చేస్తోందని అన్నారు. బిజెపి పునాదులు కదులుతున్నాయని అన్నారు.అభివృద్ధికి సహకారం అందించవలసిందిగా కేంద్రంలోని బీజేపీని రాష్ట్రాలు అభ్యర్థిస్తున్నా పట్టింపు లేదు. జిఎస్టీ భారాలను పట్టించుకోవడం లేదు. అలాగే బిజెపికి రాష్ట్రాలను అభివృద్ధి చేయాలన్న కాంక్ష లేదన్నారు. ఈ నేపథ్యంలో తాము మొదలెట్టిన ప్రత్యామ్నాయ ప్రయత్నం విజయవంతం అవుతుందన్నారు. రాహుల్ నాయకత్వంలో ప్రత్యామ్నాయ వేదిక అయిన ఇండియా కూటమి మున్ముందు మరింత విజయం సాధిస్తుందని అన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి వ్యతిరేకంగా గొంతు కలుపుతున్న అన్ని రాష్ట్రాలు కూడా ఇప్పుడు ఏకం కాలవాల్సి ఉందని అన్నారు. నరేంద్ర మోదీ వ్యతిరేక ఉద్యమానికి నాయకత్వం వహించడానికి అందరూ అర్హులేనని ఇతరులకు అభ్యంతరాలు లేవని అన్నారు. అభివృద్ధి ఫలాలు అన్ని వర్గాలకు అందాలన్నది తమ ఆకాంక్ష అని తెలిపారు.అది కాంగ్రెస్ ద్వారానే సాధ్యమని అన్నారు.

## అధికారం ఇస్తే.. అభివృద్ధిపై కాక కక్షలపైనే కాంగ్రెస్ పాలన

### ఆలయాలకు కేటాయించిన నిధులు రద్దు చేయడం దుర్మార్గం

### విలేకరుల సమావేశంలో ఎమ్మెల్సీ కవిత

కొల్లాపూర్ : ప్రజలు కాంగ్రెస్‌కు అధికారం ఇస్తే అభివృద్ధి చేయడం మానేసి బీఆర్ఎస్ నాయకులపై తప్పుడు కేసులు పెట్టడానికి కక్షపూరితంగా పాలన సాగిస్తుందని ఎమ్మెల్సీ కవిత ఆరోపించారు. బీఆర్ఎస్ కార్యకర్తలు, నాయకులపై దాడులు చేసిన వారి చిట్టా పింకు బుక్‌లో రాస్తామని టైం వచ్చిన రోజున వారి సంగతి తేలస్తామని ప్రతిపక్షాలపై దాడులు మాని అభివృద్ధిపై దృష్టి పెట్టాలని సూచించారు. శుక్రవారం కొల్లాపూర్ మండలం సింగోటం గ్రామంలో మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్ రెడ్డి, ఎమ్మెల్సీ నవీన్ కుమార్ రెడ్డితో కలిసి ఎమ్మెల్సీ కవిత మీడియాతో మాట్లాడారు. సింగోటంలో లింగాకారంలో లక్ష్మీనరసింహస్వామి వారు ఉండడం అన్నది చాలా ప్రత్యేకమైనటువంటి క్షేత్రంగా గమనిస్తూ ఉన్నామని తెలిపారు. తెలంగాణ రాష్ట్రంతో పాటు ఇతర రాష్ట్రాల నుంచి భక్తులు స్వామివారి దగ్గరికి దర్శనం చేసుకోవడానికి వస్తూ ఉంటారని మహబూబ్‌నగర్ జిల్లాలో ప్రత్యేకమైన క్షేత్రం కోసం కేసీఆర్ రూ. 17 కోట్లు మంజూరు చేస్తే మరి ఆ దేవుడికి ఇచ్చిన డబ్బులు కూడా జూపల్లి కృష్ణారావు క్యాన్సిల్ చేయడం అన్నది దౌర్భాగ్యం అన్నారు. ఒక ప్రభుత్వంలో ఇచ్చినటువంటి పథకాలు ఇంకొక ప్రభుత్వంలో కొనసాగాలని పేర్కొన్నారు. కానీ ఏదో ప్రజల మీద కక్ష కట్టినట్లు దేవుడిపై కక్ష కట్టి కేసీఆర్ ఇచ్చినటువంటి రూ. 17 కోట్లను క్యాన్సిల్ చేయించడం చాలా దారుణమన్నారు. తక్షణమే క్యాన్సిల్ చేసినటువంటి డబ్బుల్ని తీసుకొని వచ్చి ఆలయ అభివృద్ధి కోసం జూపల్లి కృష్ణారావు కృషి చేయవలసిందిగా డిమాండ్ చేశారు. కొల్లాపూర్ నియోజకవర్గంలో బీఆర్ఎస్ పార్టీ తరఫున నిలబడ్డటువంటి ఏ నాయకుడైనా సరే ఒక ఫేస్‌బుక్‌లో చిన్న పోస్టులు పెట్టిన లేకపోతే ఏదైనా నిలబడి ప్రశ్నించిన కూడా కేసులు పెట్టి ఇబ్బంది పెడుతున్నటువంటి ఘటనలు ఉన్నాయన్నారు. ప్రభుత్వం ఏర్పడిన నాటి నుంచి బీఆర్ఎస్ నాయకులపై దాడులు జరుగుతున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ కార్యకర్త శ్రీధర్ రెడ్డిని చంపడం కూడా జరిగిందని గుర్తుచేశారు. అయినప్పటికీ ముఖ్యమంత్రి సొంత జిల్లా అయినా జూపల్లి కృష్ణారావు మంత్రివర్గంలో ఉన్నప్పటికీ కూడా పోలీస్ వాళ్ళ కేసు మీద పురోగతి లేకపోవడం అన్నది చాలా దారుణమని కేవలం ప్రభుత్వానికి హంతకులకు కొమ్ముగాస్తున్నారు తప్పితే ప్రజల పక్షాన మీరు నిలబడలేదని విమర్శించారు. జూపల్లి కృష్ణారావు టూరిజం మంత్రిగా కాకుండా కొల్లాపూర్ నియోజక వర్గానికి అప్పుడప్పుడు వస్తూ టూరిస్ట్ మంత్రిగా వ్యవహారం చేస్తున్నారని ఎద్దేవా చేశారు. నియోజకవర్గంలో పండే మామిడికాయలను దేశంలోని నలుమూలాలతోపాటు ఇతర దేశాలకు కూడా ఎగుమతి జరుగుతుంటాయన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హాయాంలో కొల్లాపూర్ ప్రాంతంలో మామిడి మార్కెట్ మంజూరు చేస్తే ఈ ప్రభుత్వం పట్టించుకోలేదన్నారు. అభివృద్ధి ఎక్కడ కూడా కనబడడం లేదు.. పదేపదే ప్రభుత్వం ఊదరగొడుతూ రైతుబంధు రుణమాఫీ అని చెప్పారు. కానీ ఇంతవరకు పూర్తిస్థాయిలో ఎక్కడ అమలు జరగలేదు. జనవరి 26 తేదీలోపు టకీటకీ మని రైతు భరోసా డబ్బులు పడతాయన్నారు. ఇప్పుడు మళ్లీ మార్చి 30 అని చెప్తున్నారు. కనీసం ఆ తేదీలోపైన రైతులందరికీ రైతు భరోసా ఇవ్వాలన్నారు. ప్రభుత్వము రైతులను, విద్యార్థులను ఆదుకుంటలేదన్నారు. ఇతర పార్టీ నాయకులపై కక్ష కట్టి వారిపై ఆగడాలకు పడుతున్నారన్నారు. కొల్లాపూర్ నియోజకవర్గంలో అభివృద్ధి చేయకుండా బీఆర్ఎస్ నాయకులపై కేసులు పెట్టడమే పనిగా పెట్టుకున్నారని విమర్శించారు. నిన్న రాత్రి సాతపూర్ గ్రామంలో ఇవాళ మీటింగ్ కోసం ఫ్లెక్సీ కడుతుంటే బీఆర్ఎస్ కార్యకర్త పరమేష్‌పై దారుణంగా 50 మంది కాంగ్రెస్ కార్యకర్తలు కలసి దాడి చేశారన్నారు. నీతి నిజాయితీగా పనిచేసి కొట్లాడి తెలంగాణను తీసుకొచ్చామన్నారు. ప్రతిపక్షాల మీద దాడి చేస్తే ఏమొస్తుందన్నారు. ముఖ్యమంత్రి మీ మహబూబ్‌నగర్ జిల్లా గడ్డ మీద నుంచి చెప్తున్నాను. మేము కూడా పింకు బుక్ మెయింటెన్ చేస్తాము. కార్యకర్తలపై నాయకులపై దాడి చేసిన వారి చిట్టా రాస్తాం మా టైం వచ్చినప్పుడు చెప్తామని ఆమె హెచ్చరించారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు రంగినేని అభిలాష్, దూ రెడ్డి రఘువర్ధన్ రెడ్డి తదితరులు ఉన్నారు.

## నేడు జాతీయ విజ్ఞాన దినోత్సవం

### రామన్ ఎఫెక్ట్‌కు గుర్తుగా నిర్వహణ


న్యూఢిల్లీ : ఏటా ఫిబ్రవరి 28ను జాతీయ విజ్ఞాన దినోత్సవంగా జరుపుకుంటున్నాం. భారతదేశం 1986లో ఈ రోజును జాతీయ విజ్ఞాన దినంగా అంగీకరించింది. చంద్రశేఖర్ వెంకటరామన్ 'రామన్ ఎఫెక్ట్' కనుగొన్న రోజైన ఫిబ్రవరి 28 (1928) జ్ఞాపకార్థం జాతీయ విజ్ఞాన దినోత్సవంగా ప్రభుత్వం ప్రకటించింది. రామన్ ప్రభావం ఏంటంటే.. సముద్రపు నీటిపై సూర్యకాంతి పడినప్పుడు ఆ కాంతిలోని నీలం రంగు ఎక్కువగా పరిక్షేపం చెంది మన కంటికి చేరడం వల్లనే సముద్రం నీలంగా కనిపిస్తుందని సి.వి.రామన్ సిద్ధాంతీకరించాడు. ద్రవాలపై పడిన కాంతి కిరణాలు ఎలా పరిక్షేపం చెందుతాయో తెలిపే పరిశోధన ఫలితాన్నే రామన్ ప్రభావం అంటారు. కాంతి కిరణాలు ఒక ద్రవ పదార్థంపై పడినప్పుడు ఆ కాంతి పరిక్షేపం చెందుతుంది. అంటే కాంతి కిరణాల్లోని ఫోటాన్ కణాలు, ద్రవ పదార్థాల పరమాణువులపై పడి పరిక్షేపం చెందుతాయి. చాలా ఫోటాన్లు పడేటప్పటి పౌనఃపున్యంలోనే చెదిరిపోతే, కొన్ని ఫోటాన్లు మాత్రం అంతకు తక్కువ పౌనఃపున్యంతో పరిక్షేపం చెందుతాయి. అంటే పడిన కాంతిలో కొంత భాగం మాత్రం వేరే పౌనఃపున్యంతో చెదురుతుంది. ఇదే రామన్ ఎఫెక్ట్. దీన్ని కనుగొన్నందుకు ఆయన 1930లో నోబెల్ బహుమతిని అందుకున్నారు. అందుకు జ్ఞాపకంగా, గౌరవంగా ఉండేందుకు జాతీన విజ్ఞాన దినోత్సవాన్ని జరుపుకుంటాం.

### అధికారులను నిర్బంధించిన రైతులు

బోధన్ రూరల్ : రైతుల ఫిర్యాదుతో గ్రామానికి పరిశీలనకు వచ్చిన అధికారులను రైతులు నిర్బంధించిన సంఘటన శుక్రవారం చోటుచేసుకుంది. నిజాంసాగర్ డి 28 కెనాల్‌లో నీళ్లు రావడం లేదని ఫిర్యాదు చేయడంతో ఇరిగేషన్ అధికారులు కెనాల్‌ను పరిశీలించడానికి శుక్రవారం గ్రామానికి వచ్చారు. దీంతో ఆగ్రహించిన రైతులు నిజాంసాగర్ కెనాల్ నీటిని విడుదల చేసి వారం రోజులు కావస్తున్న కింది ఆయకట్టుకు నీళ్లు రాకపోవడంతో రైతులు ఇరిగేషన్ అధికారులను గ్రామ పంచాయతీ కార్యాలయంలో నిర్బంధించి తాళం వేశారు. నిజాంసాగర్ కెనాల్ నీరు చివరి ఆయకట్టు వరకు అందకపోవడంతో పంటలు ఎండుతున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇరిగేషన్ అధికారులకు ఎన్ని సార్లు చెప్పినా పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. పంచాయతీ కార్యాలయంలో తాళం వేశామని రైతులు చెప్పారు. విషయం తెలుసుకున్న బోధన్ రూరల్ సీఐ విజయబాబు, బోధన్ రూరల్ ఎస్సై మచ్చేందర్‌రెడ్డి, సంఘటన స్థలాన్ని చేరుకొని రైతులతో మాట్లాడి సముదాయించారు.

## బ్రాహ్మీ ముహూర్తం శుభదాయకం!

బ్రహ్మ ముహూర్తం లేదా బ్రాహ్మీ ముహూర్తం అన్నది మన సంస్కృతిలో బాగా ప్రాచర్యం కలిగిన అంశం. దీనికి ఎన్నో ప్రత్యేకతలు ఉన్నాయి. కశ్యప బ్రహ్మ, వినతల తనయుడు అనూరుడు. సూర్యుని సారధిగా తన పుత్రున్ని చూడాలన్న కోరికతో వినత తన అండం ముందుగా పగులగొట్టి సగం శరీరం ఉన్న అనూరుడిని బయటకు తెచ్చింది. బ్రహ్మ దేవుడు అనూరుడిని ,సూర్యునికి సారధిగా నియమించి , నీవు భూలోకంలో మొదటగా కనిపించిన కాలాన్నే బ్రహ్మ ముహూర్తం అంటారు. ఈ సమయంలో గ్రహాలు,నక్షత్రాలు ఎటువంటి చెడు చేయలేవని వరమిచ్చాడు. ఒక పనిని ప్రారంభించడానికి ఒక సమయాన్ని అనుకొంటూ ఉంటాం. అలా నిర్ణయించుకున్న సమయాన్ని ముహుర్తం అంటారు. ఏదైనా ఒక పని చేయాలనుకోన్నప్పుడు ఎలాంటి ఆటంకాలు కలుగకుండా ఒక మంచి సమయాన్ని చూసుకొని దానిని మంచి ముహుర్తంగా నిర్ణఇస్తారు. తెల్లవారుజామును సూర్యోదయానికి ముందు ఉన్న కాలం మంచి ముహుర్తం అంటారు. తెల్లవారుజామును రెండు భాగాలుగా విభజించారు. తెల్లవారుజామున రెండు ఘడియల ముందు కాలాన్ని 48 నిమిషముల ముందు కాలాన్ని ఆసురీ ముహూర్తం అని ఆసురీ ముహుర్తానికి ముందు 48 నిమిషముల ముందు కాలాన్ని బ్రహ్మ ముహూర్తం అంటారు. ప్రతి దినం బ్రహ్మ ముహుర్తమున ప్రారంభించిన పనులు నిర్విరామంగా, ఎటువంటి ఆటంకము లేకుండా జరుగుతాయంటారు. ఎక్కువమంది నూతన గృహప్రవేశంనకు ఈ సమయాన్ని ఎన్నుకుంటారు. ఈ సమయంలో పనులో చేస్తే మన మేధస్సుకు, భగవంతుని ఆశీస్సులు తోడవుతాయని అంటారు. ఆ సమయం ప్రశాంతంగా ఉంటుంది. సత్వగుణ ఆవిర్భావానికి అనుకూలంగా ఉంటుంది. రోజూ ఆ సమయంలో నిద్ర లేవడం ఉత్తమం. ధ్యానానికి, చదువుకోవడానికి ఆ రోజు చేయవలసిన సత్కార్యాలను నిర్ణయించుకోవడానికి అది ఉత్తమ కాలం. బ్రహ్మ ముహూర్తంలో ప్రారంబించాబోయే పనికి తిథి, వార, నక్షత్ర, దుర్ముహూర్త ములను చూసుకోవలసిన పని లేదు. మంచి పని చేయాల్సివచ్చినా , లేదా కొత్త గా ఏదైనా కొనిగోలు చేసి ఉపయోగించాల్సి వచ్చినా , ఆటంకాలు కలుగుతాయేమో అన్న సందేహం లేకుండా ప్రారంభించవచ్చు.



ఆధ్యాత్మికం

# ఇంటర్ పరీక్షలను సజావుగా నిర్వహించాలి

**• మార్చి 5 నుంచి మార్చి 25 వరకు ఇంటర్ పరీక్షల నిర్వహణ • ఇంటర్ పరీక్షల కోసం 23 పరీక్షా కేంద్రాల ఏర్పాటు • ఇంటర్ పరీక్షల నిర్వహణ పై సంబంధిత అధికారులతో జూమ్ మీటింగ్ ద్వారా సమీక్షించిన జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష**

**పెద్దపల్లి ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్):** జిల్లాలో ఇంటర్ పబ్లిక్ పరీక్షలు సజావుగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష అన్నారు. శుక్రవారం జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష సమీకృత జిల్లా కలెక్టరేట్ లో ఇంటర్ పరీక్షల నిర్వహణ పై సంబంధిత అధికారులతో జూమ్ మీటింగ్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ మార్చి 5 నుంచి మార్చి 25 వరకు ఇంటర్ పరీక్షల ఉదయం 9 గంటల నుంచి 12 గంటల వరకు నిర్వహణకు జిల్లాలో కట్టు దిట్టమైన ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ అధికారులను ఆదేశించారు. పరీక్షల నిర్వహణకు వివిధ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి పకడ్బందీగా పరీక్షలు నిర్వహించాలని అన్నారు. ఇంటర్ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థుల కోసం 23 పరీక్ష కేంద్రాలను సిద్ధం చేశామని అధికారులు తెలిపారు.పరీక్ష కేంద్రాల వద్ద నిరంతర విద్యుత్ సరఫరా ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని, ఎట్టి పరిస్థితుల్లో అంతరాయం ఉండవద్దని అన్నారు . విద్యార్థులకు పరీక్ష హాల్స్ లో త్రాగు నీరు అందించాలని, పరీక్ష కేంద్రాలకు త్రాగునీటి సరఫరా ఉండే విధంగా మున్సిపల్, పంచాయతీ అధికారులు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు.పరీక్షల నేపథ్యంలో విద్యార్థుల సౌకర్యార్థం రవాణా కోసం పరీక్షకు సకాలంలో హాజరయ్యే విధంగా అనుకూలంగా ఆర్టీసీ బస్సులు నడపాలని, ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో అధిక శ్రద్ధ వహించాలని, ఉదయం పూట ప్రత్యేక బస్సులను నడపాలని తెలిపారు. ప్రతి పరీక్ష కేంద్రం వద్ద ఓఆర్ఎస్ ప్యాకెట్లు, కనీస మందులతో పారా మెడికల్ సిబ్బంది , ఆశా కార్యకర్తలు అందుబాటులో ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని ఆయన వైద్య శాఖ అధికారులను ఆదేశించారు. పరీక్షా కేంద్రాల్లో పారిశుద్ధ్య నిర్వహణ స్థానిక సంస్థలు పర్యవేక్షించాలని ఆయన సూచించారు. ఈ సమావేశంలో జిల్లా ఇంటర్మీడియట్ అధికారి కల్పన, ఆర్టిసి, విద్యుత్, పంచాయతీ, మునిసిపల్, పోస్టల్, సంబంధిత ఇతర శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.




# సింగరేణి ప్రభావిత గ్రామంలో ఉచిత వైద్య శిబిరం

**యైటింక్లయిన్ కాలని. (ది క్రైమ్ న్యూస్):** సింగరేణి ప్రభావిత గ్రామమైన చందనాపూర్‌లో యాజమాన్యం శుక్రవారం ఉచిత వైద్య శిభిరం నిర్వహించింది. రామగుండం రెండవ ఏరియా వకిల్ పల్లి గనికి సంబంధించి జరిగిన ప్రజాభిప్రాయ సేకరణలో వచ్చిన అభిప్రాయాలను పరిగణలోకి తీసుకుని, రేమేడియేషన్ ద మేషర్స్ క్రింద వైద్య శిభిరాలను ఏర్పాటు చేయడంలో బాగంగా, ఉదయం గ్రామములోని అంగన్వాడీ కేంద్రం (పోస్ట్ ఆఫీస్) వద్ద ఏరియా జనరల్ మేనేజర్ బి.వెంకటయ్య ఆదేనుసారం యాజమాన్యం ఉచిత వైద్య శిభిరం ఏర్పాటు చేసింది. కార్యక్రమంలో ఏరియా రక్షణ అధికారి ఎస్.సంతోష్ కుమార్ ముఖ్య అతిదిగా పాల్గొని వైద్య శిభిరాన్ని ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. సింగరేణి సంస్థ యాజమాన్యం కేవలం ఉత్పత్తి ఉత్పాదకతలే కాకుండా, పరిసర ప్రభావిత గ్రామాల మౌలిక వసతుల కోరకు ఎల్లప్పుడు సామాజిక భాద్యతగా ముందుంటుందని అన్నారు. ఇందులో బాగంగానే ఉచిత వైద్య శిభిరాలను ఏర్పాటు చేయడం జరుగుతుందని, చందనపూర్ గ్రామ ప్రజలు ఈ ఉచిత వైద్య శిభిరాన్ని వినియోగించుకోవాలని ఆయన కోరారు. ఇంకా ఈ కార్యక్రమంలో ఏఐటియుసి జి. రవీందర్, కాలనీ డిస్పెన్సరి మెడికల్ సూపరింటెండెంట్ డా.. మహిపాల్,



పర్యావరణ అధికారి సురేష్ బాబు, ఏరియా సెక్యూరిటి అధికారి షరీఫ్ మహమ్మద్, డివైపిఎం వేణుగోపాల్, ప్యారా మెడికల్ సిబ్బంది, పాల్గొన్నారు.

# పదవీ విరమణానంతరం శేష జీవితం ఆనందంగా గడపాలి

**• రామగుండం పోలీస్ కమీషనర్ ఎం.శ్రీనివాస్ • ఉద్యోగ విరమణ పొందిన అధికారికి సన్మానం**

**గోదావరిఖని క్రైమ్ (ది క్రైమ్ న్యూస్):** పదవీ విరమణానంతరం పోలీసులు కుటుంబ సభ్యులతో తమ శేష జీవితాన్ని ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో ఆనందంగా గడపాలని రామగుండం పోలీస్ కమిషనర్ ఎం.శ్రీనివాస్ అన్నారు. పోలీస్ శాఖలో సుదీర్ఘ కాలం పాటు విధులు నిర్వర్తించిన రామగుండం ట్రాఫిక్ ఎఎస్ఐగా ఉద్యోగ విరమణ పొందిన వి.వెంకటేశ్వర్లు పదవీ విరమణ కార్యక్రమాన్ని రామగుండం పోలీస్ కమిషనరేట్‌లో శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పోలీస్ కమిషనర్ ఎం.శ్రీనివాస్ హాజరై ఉద్యోగ విరమణ పొందిన ఎఎస్ఐ వి.వెంకటేశ్వర్లుకి, ఆయన కుటుంబ సభ్యులకు సిపి శాలువా కప్పి, పూల మాలలు వేసి, జ్ఞాపిక అందజేసి ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా సిపి ఎం.శ్రీనివాస్ మాట్లాడుతూ సుదీర్ఘ కాలం పాటు పోలీసు వ్యవస్థను సేవలందించి ఉద్యోగ విరమణ పొందు తున్నందుకు శుభాకాంక్షలు తెలియజేశారు. ప్రజలకు సేవా చేయడానికి పోలీస్ విధులను సక్రమంగా నిర్వర్తించడానికి కుటుంబ సభ్యుల ప్రోత్సాహం ఎంతగానో ఉంటుందని, వారి తోడ్పాటు వల్లనే విధులను నిర్వర్తించి ఉన్నత స్థానాలకు ఎదగగలరని తెలిపారు. ఉద్యోగ విరమణ పొందిన తర్వాత వచ్చే ప్రయోజనాలను త్వరగా అందించాలని సిబ్బందికి సూచించారు. ఉద్యోగ విరమణ పొందిన పోలీసులు తమ ఆరోగ్యాల పట్ల తగు జాగ్రత్తలను తీసుకోవాలని కోరారు. ఎటువంటి అవసరం ఉన్న కమీషనరేట్ పోలీసు వ్యవస్థ ఎల్లవేళలా అందుబాటులో ఉంటుందని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా పదవీ విరమణ పొందిన అధికారిని ప్రభుత్వ వాహనంలో ఇంటి వరకు సాగనంపారు. ఈ కార్యక్రమంలో అదనపు డిసిపి అడ్మిన్ సి.రాజు, స్పెషల్ బ్రాంచ్ ఎసిపి రాఘవేంద్ర రావు, ఎఆర్ ఎసిపి ప్రతాప్, ఎఓ శ్రీనివాస్, సూపరింటెండెంట్ సంధ్య, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్లు దామోదర్, మల్లేశం, సంపత్, రామగుండం పోలీస్ కమీషనరేట్ పోలీస్ అధికారుల సంఘం అధ్యక్షులు బోర్లకుంట పోచలింగం, స్వామి తదితరులున్నారు.



# ఎస్ ఎస్ సి పరీక్షా నిర్వహణ కేంద్రాలను తనిఖీ చేసిన ఎంఇఓ సీతాలక్ష్మి



**ధర్మపురి, ఫిబ్రవరి 28, (ది క్రైమ్ న్యూస్):** ఎస్ ఎస్ సి పరీక్షా నిర్వహణ కేంద్రాలను శుక్రవారం సందర్శించి వసతులు పరిశీలించినట్లు ధర్మపురి ఎంఇఓ సీతాలక్ష్మి తెలిపారు. 2025 మార్చ్ నెలలో ప్రారంభం కానున్న ఎస్ ఎస్ సి పబ్లిక్ పరీక్షల నిర్వహణ ఏర్పాట్లలో భాగంగా శుక్రవారం ధర్మపురి మండలవిద్యాశాఖాధికారిణి ఎస్. సీతాలక్ష్మీ మరియు ఏసిజిఈ గంగాధర్ లు ధర్మపురి మండల ఎస్ ఎస్ సి పరీక్షా కేంద్రాలను సందర్శించి తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు తరగతి గదులను పరిశీలిస్తూ విద్యార్థులకు కావాల్సిన మౌలిక వసతుల ఏర్పాట్లలో భాగంగా త్రాగునీరు, తరగతులలో గాలి, వెలుతురు, ఫర్నిచర్ మొదలగు అంశాలపై పరిశీలించి ఎస్ ఎస్ సి బోర్డ్ కి నివేదిక అందజేసినట్లు ఎంఈఓ సీతాలక్ష్మీ పేర్కొన్నారు.

# వైరాలో ఘనంగా టైలర్స్ డే..

**ఖమ్మం ఉమ్మడి జిల్లా, ప్రతినిధి, (ది క్రైమ్ న్యూస్):** వైరాలో శుక్రవారం టైలర్స్ డే ను వైరా టైలర్స్ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.. ఈ సందర్భంగా కార్ సెంటర్ గాంధీ చౌక్ వద్ద విలియం హువే చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు..టైలర్స్ జీవితాలకు అధ్యుడైన విలియం హువేకు అందరూ రుణపడి ఉండాలని వారు ఆకాంక్షించారు.. ఈ కార్యక్రమంలో పలువురు టైలర్స్ పాల్గొన్నారు



# గాయత్రి సేవా సమితి ఆధ్వర్యంలో అన్నదానం



**పెద్దపల్లి ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్):** పెద్దపల్లి పట్టణంలోని జెండా చౌరస్తా వద్ద గాయత్రి సేవా సమితి ఆధ్వర్యంలో శుక్రవారం అన్న ప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించారు. అమావాస్య అన్న ప్రసాదం కార్యక్రమంలో భాగంగా 21వ మాసం సందర్భంగా దాతలు రేణికుంట భాస్కర్- స్రవంతి అమ్మ- నాన్న జ్ఞాపకార్థం వారి కుటుంబ సభ్యుల కోరిక మేరకు నిర్వహించినట్లు తెలిపారు. గత 20 నెలల నుండి దాతల సహకారంతో విజయవంతంగా అన్నప్రసాద వితరణ కార్యక్రమం కొనసాగుతోందని చెప్పారు. ఈ కార్యక్రమంలో గాయత్రి సేవా సమితి సభ్యులు కాసనగొట్టు వినయ్, రావికంటి రాజు, చిట్టిమల్ల రవి, పైడ నరేందర్, ముస్త్యాల ప్రదీప్, బొల్లం శ్రీనివాస్, కటకం సత్యనారాయణ, నాగమల్ల శ్రీనివాస్ పాల్గొన్నారు.

# సహాయక చర్యలు పరిశీలిస్తున్న సింగరేణి సిఎండి





**యైటింక్లయిన్ కాలని. (ది క్రైమ్ న్యూస్):** సింగరేణి సంస్థ నుండి శ్రీ శైలం (ఎస్.ఎల్.బి.సి) కి తరలివెళ్లి టన్నెల్ వద్ద సంస్థ రెస్క్యూ సిబ్బంది చేపట్టిన సహాయక చర్యలను సంస్థ చైర్మన్ మేనేజింగ్ డైరెక్టర్ ఎన్. బలరాం గురువారం పరిశీలించారు. రాత్రి రెస్క్యూ సిబ్బంది చేపట్టిన సహాయక పనులను పరిశీలిస్తూ.. సిబ్బందికి తగిన సూచనలు ఇచ్చారు. ఇంకా సిఎండి వెంట రెస్క్యూ జనరల్ మేనేజర్ శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

# ధర్మపురిలో ఘనంగా టైలర్స్ డే వేడుకలు



**ధర్మపురి, ఫిబ్రవరి 28, (ది క్రైమ్ న్యూస్):** ధర్మపురి మేరుసంఘం ఆధ్వర్యంలో టైలర్స్ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఫిబ్రవరి 28న టైలర్స్ డే సందర్భంగా ధర్మపురి మేరుసంఘంలో ఘనంగా వేడుకలు నిర్వహించడం జరిగిందని మేరు సంఘకార్యవర్గ సభ్యులైన రాపర్తి మహేంధర్ తెలిపారు. ఈ కార్యక్రమం లో భాగంగా మేరుకులవృత్తిని చేస్తున్న సినియర్ సిటిజన్లు అయినా కొత్తకొండ రాములు, కొత్తకొండ నర్సయ్య, రాపర్తి రాములు గార్లను మేరు సంఘకార్యవర్గ సభ్యులైన రాపర్తి మహేంధర్, కొత్తకొండ రాజు, రాపర్తిరాజ్ కిరణ్, రామగిరినరేష్, గట్ల శ్రీనివాస్, కర్నె అఖిల్ సన్మానించడం జరిగిందని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో మేరు కులసంఘం సభ్యులు పాల్గొన్నారు.

# అంత్యక్రియలకు ఆర్థికసాయం



**కూకట్ పల్లి, ఫిబ్రవరి 28 (ది క్రైమ్ న్యూస్):** కూకట్ పల్లి సర్కిల్ ఆల్విన్ కాలనీ డివిజన్ పరిధిలోని ఎల్లమ్మబండ పీజేఆర్ నగర్ బ్లాక్ నెంబర్ (30)లో నివసించే సత్యనారాయణ(89) అనారోగ్యంతో బాధపడుతూ మరణించిన విషయం తెలుసుకున్న డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి డివిజి ట్రస్ట్ ద్వారా 5,000/- రూపాయలు ఆర్థిక సహాయం అందించారు. సి.హెచ్ భాస్కర్, సంగమేష్, రవీందర్ కాలనీ వాసులు తదితరులు మృతుని కుటుంబ సభ్యులను పరామర్శించారు.

# రంజాన్ మాసం నిర్వహించుటకు ఏర్పాట్లు చేయాలి

- ప్రతి మసీదు వద్ద పారిశుధ్య నిర్వహణకు ప్రత్యేక కార్యాచరణ
- రంజాన్ మాసం ఏర్పాట్ల పై రివ్యూ నిర్వహించిన జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష



**పెద్దపల్లి ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్):** ప్రశాంతంగా రంజాన్ మాసం నిర్వహించుటకు ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష అన్నారు. శుక్రవారం జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష సమీకృత జిల్లా కలెక్టరేట్ లో రంజాన్ మాసం ఏర్పాట్ల పై అదనపు కలెక్టర్లు డి వేణు, జె.అరుణ శ్రీ లతో కలిసి సంబంధిత అధికారులతో రివ్యూ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ పవిత్ర రంజాన్ మాసం ప్రశాంతంగా జరుపుకునేందుకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని అన్నారు. రామగుండం మున్సిపల్ కార్పొరేషన్, జిల్లాలోని ఇతర మున్సిపాలిటీలలో సైతం అవసరమైన ఏర్పాట్లు కోసం అధికారులకు సూచనలు జారీ చేశామని అన్నారు. షాపులను 24 గంటలు నడిపేందుకు గల అవకాశాలను పరిశీలించి పోలీసు శాఖ సూచనలు అందిస్తుందని అన్నారు. గత సంవత్సరంతో పోలిస్తే ఈ సంవత్సరం విద్యుత్ సరఫరా మరింత మెరుగ్గా ఉంటుందని అన్నారు. మసీదులకు అవసరమైన మేర త్రాగునీటి సరఫరాను అందిస్తామని అన్నారు.ప్రతి మసీదు దగ్గర పారిశుధ్య నిర్వహణ కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నామని, ఏదైనా మసీదు దగ్గర త్రాగు నీటి సరఫరా, విద్యుత్ సరఫరా సంబంధించి ఏదైనా పనులు ఉంటే వెంటనే తెలియజేయాలని కలెక్టర్ కోరారు.గ్రామ పంచాయతీలలో ఉన్న మసీదుల జాబితా తయారు చేసి రెగ్యులర్ గా అక్కడ పారిశుధ్య పనులు జరిగేలా పంచాయతీ అధికారి చర్యలు తీసుకోవాలని అన్నారు. ప్రతి మసీదు వద్ద ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ వైద్య ఆరోగ్యశాఖ అధికారికి సూచించారు.పండగ సందర్భంగా షాపింగ్ కోసం మార్కెట్ వద్ద పెద్ద ఎత్తున మహిళలు వచ్చే అవకాశం ఉన్నందున అవసరమైన భద్రత ఏర్పాట్లు చేస్తామని, ప్రతి



మసీదు వద్ద పార్కింగ్ కోసం ఏర్పాట్లు చేయాలని సూచించారు. ప్రతి మసీదు పరిసరాలలో సిసి కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని అన్నారు. మసీదు సమీపంలో ఎక్కడైనా దేవాలయాలు ఉంటే అక్కడ ఎటువంటి ఘర్షణలకు తావు లేకుండా సామరస్యంగా ఉండేలా పటిష్ట భద్రత ఏర్పాటు చేయాలని కలెక్టర్ సూచించారు. ఈ సమావేశంలో జిల్లా మైనార్టీ సంక్షేమ అధికారి రంగారెడ్డి, డి సి ఎస్ ఓ రాజేందర్, డిపిఓ వీర బుచ్చయ్య, ఏసీపి కృష్ణ, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# వైరాలో మాదిగ అమరవీరుల సంస్కరణ సభను జయప్రదం చేయండి..



**ఖమ్మం ఉమ్మడి జిల్లా, ప్రతినిధి, (ది క్రైమ్ న్యూస్):** మాదిగ జాతి హక్కుల సాధన కోసం మాదిగ జాతికి రావాల్సిన న్యాయమైన వాటా దక్కాలని, 30 ఏళ్లుగా కొనసాగిన పోరాటంలో అసువులు బాసిన మాదిగ అమరవీరుల సంస్కరణ సభను విజయవంతం చేయాలని వైరా ఎమ్మార్పీఎస్, అనుబంధ సంఘాలు పిలుపునిచ్చాయి.. వైరాలో శుక్రవారం జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ నేడు వైరా రింగ్ రోడ్ లో ఉదయం 11 గంటలకు మాదిగ అమరవీరుల సంస్మరణ సభ నిర్వహిస్తున్నామని వారు తెలిపారు . గాంధీభవన్ ముట్టడిలో మాదిగ బిడ్డలు మంటల్లో ఆహుతి అయ్యారని, వర్గీకరణ ఆశయంతో ప్రాణాలు అర్పించిన వారి త్యాగాలను స్మరించుకుంటూ సంస్కరణ సభను విజయవంతం చేయాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని వారు తెలిపారు.. మాదిగ సమాజం వారి త్యాగాలు గుర్తించి వారికి నిజమైన నివాళులర్పించాలని ఆశ బావం వ్యక్తం చేశారు. ఎమ్మార్పీఎస్ నాయకులు కోట కోటేశ్వరరావు మాదిగ, కంచర్ల వెంకటేశ్వర్లు మాదిగ, మాగంటి బాబు మాదిగ, మోదుగు రమేష్ మాదిగ, కారుమంచి వెంకన్న మాదిగ, కర్ష రమేష్ మాదిగ, ఇండ్ల వెంకట్ మాదిగ, తేల్లూరి పుల్లారావు మాదిగ, వేల్పుల ఆనందరావు మాదిగ, వేల్పుల రాజేష్ మాదిగ తదితరులు సమావేశంలో పాల్గొన్నారు..

## ఉద్యోగ విరమణ సన్మాన కార్యక్రమము



**రామగిరి(ది క్రైమ్ న్యూస్)ఫిబ్రవరి 28:** సింగరేణి సంస్థ ఆర్.జి-టు ఏరియాలో జూనియర్ ఇంజినీర్ గా విధులు నిర్వహించిన యశ్వంత్ రావ్, డిప్యూటీ సూపరింటెండెంట్ గా విధులు నిర్వహించిన ఏం.సీతాపతి శుక్రవారం ఉద్యోగ విరమణ పొందుతున్న సంధర్భంగా జిఎం కార్యాలయం నందు వీడ్కోలు కార్యక్రమము నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఏరియా జనరల్ మేనేజర్ బి.వెంకటయ్య ముఖ్య అతిధిగా హాజరై ఉద్యోగ విరమణ పొందిన ఉద్యోగులను శాలువాలతో ఘనంగా సన్మానించి జ్ఞాపిక అందజేశారు. ఇద్దరు ఉద్యోగులు కూడా సింగరేణిలో వివిధ హొదాలలో పని చేసి అందరి మన్ననలను పొంది సంస్థకు సేవలు అందించి పదవి విరమణ పొందడం గొప్ప విషయమని ఏరియా జనరల్ మేనేజర్ బి.వెంకటయ్య అన్నారు. వారి పదవి విరమణ అనంతరం వారి యొక్క శేషజీవితం అష్టఐశ్వర్యాలతో, ఆయురారోగ్యాలతో సుఖ సంతోషాలతో గడపాలని కోరుకున్నారు. ఈ కార్యక్రమములో ఏఐటియుసి బ్రాంచ్ సెక్రెటరీ జిగురు రవీందర్,ఏరియా రక్షణ అధికారి ఎస్.సంతోష్ కుమార్, డీజిఎం పర్సనల్ అధికార ప్రతినిధి ఎస్.అనిల్ కుమార్, డీజీఎం సివిల్ ధనుంజయ, డీజీఎం ఐఈ మురళీకృష్ణ, డీజీఎం ఫైనాన్స్ వెంకట రామచంద్ర, సీనియర్ ఎస్టేట్స్ సునీతా, పర్చేస్ ఎస్ ఈ పండరీనాథ్, ఏరియా సెక్యూరిటి అధికారి షరీఫ్ మహమ్మద్, ఏంవిటిసి మేనేజర్ మురళీకృష్ణ, ఫారెస్ట్ అధికారి నవీవ్ కుమార్, డివైపిఎం వేణుగోపాల్ జీఎం ఆఫీస్ ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

## కమాన్ పూర్‌లో సైన్స్ డే


**రామగిరి(ది క్రైమ్ న్యూస్)ఫిబ్రవరి 28:** కమాన్ పూర్ జిల్లా పరిషత్ పాఠశాలలో సైన్స్ డే శుక్రవారం ఘనంగా నిర్వహించడం జరిగింది. దీనిలో భాగంగా సివి రామన్ చిత్ర పటానికి పూలమాలలతో అంకరిచడం జరిగింది. సైన్స్ డే సందర్భంగా విద్యార్థులకు వివిధ పోటీలు నిర్వహించి బహుమతులు అందించడం జరిగింది.విద్యార్థులు రంగవల్లులతో పాఠశాలను సుందరంగా అలంకరించారు. క్విజ్‌లో ఉత్సాహంగా పాల్గొన్నారు. సైన్స్ ఎగ్జిబిషన్ లో పాల్గొని సైన్స్ డే ని ఘనంగా నిర్వహించుటలో భాగస్వామ్యులు అయ్యారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, మండల విద్యాధికారి ఇల్లందుల విజయ్ కుమార్ మరియు ఇంచార్జి ప్రధానోపాధ్యాయులు రాజేశ్వర్ రావు,ఉపాధ్యాయులు సతీష్,రజిత కుమారి, శంకర్, స్రవంతి, రమేష్, ఈశ్వర్, నంబయ్య విద్యార్థులు పాల్గొని జయప్రదం చేయడం జరిగింది.



## శ్రీ నలంద పాఠశాలలో ఘనంగా సైన్స్ ఫేయిర్

**తొర్రూరు, (ది క్రైమ్ న్యూస్):** పట్టణంలో బీరప్ప నగర్‌లో గల శ్రీ నలంద పాఠశాలలో జాతీయ సైన్స్ దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ప్రభుత్వ జూనియర్ కాలేజ్ ఫిజిక్స్ లెక్చరర్ కే సతీష్ మరియు ఏజీఎం పద్మాకర్ విచ్చేశారు. విద్యార్థిని విద్యార్థులు వివిధ రకాల సైన్స్ నమూనాలు వర్కింగ్ మోడల్స్, చార్టులను ప్రదర్శించిన వారికి ముఖ్య అతిథులు మోడల్స్ సంబంధించిన ప్రాముఖ్యతను తెలియపరిచారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన కే సతీష్ మాట్లాడుతూ రామన్ ఎఫెక్ట్ గురించి సైన్స్ లో సివి రామన్ కు ప్రథమ నోబుల్ బహుమతి సాధించిన ఘనతగా కీర్తి చెందారని, కోవిడ్ పరిస్థితిలలో వ్యాక్సిన్ కనుగొనుటలో రామన్ ఎఫెక్ట్ ఎంతగానో దోహదపడిందని, సైన్స్ అభివృద్ధిలో ఎంతగానో ఉపయోగపడిందని తెలిపారు. పాఠశాల ప్రిన్సిపాల్ పాలడుగుల రవీందర్ మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితులలో ప్రతి ఒక్క విద్యార్థి నూతన ఆవిష్కరణలు చేయుటలో ముందుండాలని, సర్ సివి రామన్ ను ఆదర్శంగా తీసుకొని సృజనాత్మకతను కలిగి ఉండాలని, మన భారతదేశానికి మంచి గుర్తింపు తెచ్చుకోవాలని ఉత్తమ పౌరుడుగా ఎదగాలని కొనియాడారు. వర్కింగ్ మోడల్స్ నమూనాలను ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు మెమొంటోలను మెడల్స్ లను ముఖ్య అతిథుల చేతిమీదులుగా బహుమతి ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ మల్లంపాటి శ్రీధర్, డైరెక్టర్ మల్లంపాటి శ్రీవిద్య, డీజీఎం చేతన్, ఏజీఎం పద్మాకర్, జెడిఎసి శివ కోటేశ్వరరావు, అకాడమిక్ డీన్ యాకన్న, ప్రైమరీ కోఆర్డినేటర్ అశ్విని, ప్రైమరీ ఇంచార్జ్ పుష్ప, ప్రీ ప్రైమరీ ఇంచార్జ్ శ్వేతా రెడ్డి, సైన్స్ ఉపాధ్యాయులు శ్రీధర్, రాజేష్, స్వాతి ఉపాధ్యాయులు తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.





## రిటైర్డ్ ఉద్యోగులు అభినందనీయులు


- ఆర్జీ.2 జీఎం బి.వెంకటయ్య



**యైటింక్లయిన్ కాలని. (ది క్రైమ్ న్యూస్):** సింగరేణి రామగుండం రెండవ డివిజన్ లో శుక్రవారం వీడ్కోలు సమావేశం జరిగింది. జీఎం కార్యాలయంలో జూనియర్ ఇంజినీర్ గా యశ్వంత్ రావ్, డిప్యూటీ సూపరింటెండెంట్ గా ఎం.సీతాపతి సర్వీస్ కాలం పూర్తి చేసి ఉద్యోగ విరమణ పొందుతున్న సంధర్భంగా వీడ్కోలు కార్యక్రమము జరిగింది. ఈ కార్యక్రమానికి ఏరియా జనరల్ మేనేజర్ బి.వెంకటయ్య ముఖ్య అతిథిగా హాజరై ఉద్యోగ విరమణ పొందిన ఉద్యోగులను శాలువాలతో సన్మానించి జ్ఞాపికలు అందజేసి వీడ్కోలు తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, ఇద్దరు ఉద్యోగులు కూడా సింగరేణిలో వివిధ హొదాలలో పని చేసి, అందరి మన్ననలను పొంది సంస్థకు సేవలు అందించి పదవి విరమణ పొందారని అన్నారు. పదవి విరమణ అనంతరం వీరి శేషజీవితం అష్టఐశ్వర్యాలతో, ఆయురారోగ్యాలతో, సుఖ సంతోషాలతో గడవాలని ఆయన కోరుకున్నారు. ఈ కార్యక్రమంలో ఏఐటియుసి నాయకులు జి.రవీందర్, ఏరియా రక్షణ అధికారి ఎస్.సంతోష్ కుమార్, డీజీఎం (పర్సనల్) అధికార ప్రతినిధి ఎస్.అనిల్ కుమార్, డీజీఎం (సివిల్) ధనుంజయ, డీజీఎం (ఐఈ) మురళీకృష్ణ, డీజీఎం (ఫైనాన్స్) వెంకట రామచంద్ర, సీనియర్ (ఎస్టేట్స్) సునీతా, (పర్చేస్) ఎస్ఇ పండరీనాథ్, ఏరియా (సెక్యూరిటి) అధికారి షరీఫ్ మహమ్మద్, (ఎంవిటిసి) మేనేజర్ మురళీకృష్ణ, (ఫారెస్ట్) అధికారి నవీవ్ కుమార్మరియు డివైపిఎం వేణుగోపాల్, ఉద్యోగులు పాల్గొన్నారు.

## గీతాంజలి పాఠశాలలో వైజ్ఞానిక ప్రదర్శన





**గోదావరి ఖని టౌన్ (ది క్రైమ్ న్యూస్):** జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా గీతాంజలి పాఠశాలలో వైజ్ఞానిక ప్రదర్శన నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా విద్యార్థులు తరగతి గదిలో నేర్చుకున్న పలు అంశాలను ప్రాక్టికల్ గా వివిధ ప్రాజెక్టుల ద్వారా చూపించారు. విద్యార్థులు తయారుచేసిన వర్కింగ్ మోడల్స్ పలువురు విద్యార్థులను చాలా చక్కగా ఆకట్టుకున్నాయి. విద్యార్థులలో దాగి ఉన్న ప్రతిభను వెలికితీస్తూ ఎన్నో ప్రాజెక్టులను తయారుచేసి అవి పని చేసే విధానాన్ని తెలియజేయడం అభినందనీయం. ఈ సైన్స్ ఫెయిర్‌లో పాల్గొన్న విద్యార్థులను అభినందిస్తూ వారికి గైడ్స్‌గా సహకరించిన ఉపాధ్యాయులు గొడుగు శ్రీనివాస్, గుడిసె ప్రసాదులను అభినందించిన పాఠశాల యాజమాన్యం. ఈ కార్యక్రమం పాఠశాల ప్రధానోపాధ్యాయులు మరియు కరస్పాండెంట్ కంది రవీందర్ రెడ్డి ఆధ్వర్యంలో జరిగింది. ఈ కార్యక్రమంలో ఎంతో మంది విద్యార్థులు, ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు మరియు పోషకులు పాల్గొన్నారు.

## ఏకశిలలో ఘనంగా జాతీయ సైన్స్ దినోత్సవం





**హుజురాబాద్ ఫిబ్రవరి 28 (ది క్రైమ్ న్యూస్):** తుమ్మనపల్లి గ్రామ శివారులోని " ఏకశిల సిబిఎస్ఈ పాఠశాలలో " జాతీయ సైన్స్ దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు.సి వి రామన్ " రామన్ ఎఫెక్ట్ " ఆవిష్కరించిన సందర్భాన్ని పురస్కరించుకొని " జాతీయ సైన్స్ దినోత్సవాన్ని జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో ఏకశిల విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ గౌరు తిరుపతి రెడ్డి మాట్లాడుతూ సైన్స్ అంటే పరిశీలన, ప్రయోగం, నిర్ణయం అని,శాస్త్ర సాంకేతిక రంగాలలో గణనీయమైన అభివృద్ధిని సాధించడంలో శాస్త్రవేత్తల కృషి అనిర్వచనీయం అన్నారు. శాస్త్రవేత్తలు ఎన్నో నూతన ఆవిష్కరణలు చేశారని గుర్తు చేశారు. ఆహారం, వైద్యం, రవాణా రంగాలలో శాస్త్రవేత్తల త్యాగం వెలకట్టలేనిదని కొనియాడారు. విద్యార్థులు శాస్త్రవేత్తలను ఆదర్శంగా తీసుకొని భవిష్యత్తులో శాస్త్రవేత్తలుగా ఎదగాలని ఆకాంక్షించారు. పాఠశాల విద్యార్థులు సుమారు 250 వరకు ఎగ్జిబిట్లను ప్రదర్శించారు. విద్యార్థులు ప్రదర్శించిన ఎగ్జిబిట్లు అన్ని చూపరులను ఆకట్టుకుని, ఆలోచించే విధంగా ఉన్నాయి. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ " చిదురాల దినేష్ రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ దూడల నరేష్, అడ్మినిస్ట్రేటివ్ ఇంచార్జ్ శ్రీమతి చిదురాల శ్రావణి రెడ్డి, స్టాఫ్ ఇంచార్జ్ శరత్ బాబు, సైన్స్ ఉపాధ్యాయ బృందం మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

# మహిళల కోసం ఇండస్ట్రియల్ పార్క్ ఏర్పాటు చేస్తాం

## • రాష్ట్ర ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు




**రామగిరి(ది క్రైమ్ న్యూస్) ఫిబ్రవరి 28:** ప్రతి నియోజకవర్గంలో మహిళల కోసం ఇండస్ట్రియల్ పార్క్ ఏర్పాటు చేస్తామని రాష్ట్ర ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అన్నారు. లక్డీకాపూల్ రెడ్ హిల్స్ లోని ఫెడరేషన్ ఆఫ్ తెలంగాణ ఛాంబర్స్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ(ఎఫ్ టీసీసీఐ) భవన్ లో శుక్రవారం ఎస్సీ, ఎస్టీ శాసనసభ్యులు, తెలంగాణ అసోసియేషన్ ఆఫ్ ఎస్సీ, ఎస్టీ ఎంటర్ ప్రైజెస్ సంయుక్తాధ్వర్యంలో నిర్వహించిన "రౌండ్ టేబుల్ కాన్ఫరెన్స్ ఆన్ ఎంఎస్ఎంఈ (ఎంఎస్ఎంఈ) 2024: ఎ టోకెన్ ఆఫ్ గ్రాటిట్యూడ్ టూ గవర్నమెంట్ ఆఫ్ తెలంగాణ" కు రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో 'మినీ ఇండస్ట్రియల్ పార్క్'ను మహిళల కోసం అభివృద్ధి చేస్తాం. ఈ పార్కుల్లో ఎస్సీ, ఎస్టీ మహిళా పారిశ్రామికవేత్తలకు 10 శాతం ప్రత్యేకంగా కేటాయిస్తాం అన్నారలి ఎస్సీ, ఎస్టీలు ఎదిగితేనే ఈ సమాజం అభివృద్ధి చెందుతుంది. చేవెళ్ల డిక్లరేషన్ లో దళితులకిచ్చిన ప్రతి హామీని సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వం కచ్చితంగా నెరవేరుస్తుంది. కాంగ్రెస్ అంటేనే దళితులు.. దళితులు అంటేనే కాంగ్రెస్. దళితుల అభివృద్ధికి చిత్తశుద్ధితో కృషి చేసే పార్టీ కాంగ్రెస్ పార్టీ మాత్రమే అన్నారు. ఓవైపు రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని గాడిలో పెడుతూనే.. మరోవైపు సంక్షేమం, అభివృద్ధిపై దృష్టి సారించాం. 2017 నుంచి సబ్సిడీల కింద పారిశ్రామికవేత్తలకు అందాల్సిన బకాయిలు రూ.4500 కోట్లకు పైగా ఉన్నాయి. వీటిలో రూ.2200 కోట్లు ఎస్సీ, ఎస్టీ పారిశ్రామిక వేత్తలకే రావాలి మేం అధికారంలోకి రాగానే ఈ బకాయిల చెల్లింపుపై దృష్టి సారించాం. వచ్చే నెల(మార్చి) చివరి నాటికి రూ.300 కోట్లు చెల్లిస్తాం అన్నారు.లి దేశంలో ఎక్కువ మంది కార్మికులు ఎంఎస్ఎంఈ రంగంలోనే ఉపాధి పొందుతున్నారు. కానీ.. దురదృష్టవశాత్తు ఇప్పటీ వరకూ ఎంఎస్ఎంఈలకు ప్రత్యేకంగా పాలసీ అంటూ ఏదీ లేదు. రాహుల్ గాంధీ సూచనల మేరకు మేం ప్రత్యేకంగా పాలసీని తీసుకొచ్చాం. క్షేత్రస్థాయిలో శాస్త్రీయంగా అధ్యయనం చేసి.. నిపుణులను భాగస్వామ్యం చేసి అత్యంత ప్రతిష్ఠాత్మకంగా ఈ పాలసీని రూపొందించాం అని స్పష్టం చేశారు. ఎస్సీ, ఎస్టీ పారిశ్రామికవేత్తల కోరిక మేరకు.. వారికి మరింత ప్రయోజనం చేకూరేలా ఈ పాలసీ ఆపరేషనల్ గైడ్ లైన్స్ ను తయారు చేస్తాం అన్నారు. ప్రొక్యూర్ మెంట్, కాంట్రాక్టుల్లో ఎస్సీ, ఎస్టీలకు ప్రాధాన్యం కల్పించేందుకు కృషి చేస్తాం. శాస్త్రీయంగా అధ్యయనం చేసి ప్రత్యేక పాలసీలను తీసుకొస్తాం. ఎస్సీ, ఎస్టీ పారిశ్రామికవేత్తలకు ప్రభుత్వం తరఫున అన్ని రకాలుగా అండగా ఉంటాం. పరిశ్రమల స్థాపనలో వారికి ఎదురవుతున్న ఇబ్బందులను పరిష్కరిస్తాం. స్కిల్ సెంటర్లను ఏర్పాటు చేసి పరిశ్రమలకు అవసరమైన నైపుణ్యమున్న మానవ వనరులను అందిస్తాం. కొత్త ఆలోచనలతో ముందుకొచ్చే వారికి ప్రభుత్వం అండగా ఉంటుంది అన్నారు. బ్యాంక్ ల నుంచి రుణాలు పొందటంలో ఔత్సాహిక ఎస్సీ, ఎస్టీ పారిశ్రామికవేత్తలకు ఎదురవుతున్న ఇబ్బందులను పరిష్కరిస్తాం. కుటీర పరిశ్రమలకు అండగా నిలుస్తాం అన్నారు. వాటిని ప్రోత్సహించేందుకు చర్యలు తీసుకుంటాం స్పష్టం చేశారు ఈ ఏడాది ఏప్రిల్ మొదటి వారంలో ఎస్సీ, ఎస్టీ ఎమ్మెల్యేలు, పారిశ్రామికవేత్తలు, అధికారులతో కూడిన ప్రత్యేక బృందం తమిళనాడు, కర్ణాటకలో క్షేత్రస్థాయిలో పర్యటిస్తుంది. ఆయా ప్రభుత్వాలు దళిత పారిశ్రామిక వేత్తలకు అందిస్తున్న ప్రోత్సాహకాలపై ప్రత్యేకంగా అధ్యయనం చేస్తుంది. ఆ నివేదిక ఆధారంగా రాష్ట్ర ప్రభుత్వం దళిత పారిశ్రామికవేత్తలకు మరింత ప్రయోజనం కలిగేలా చర్యలు తీసుకుంటుంది అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్, ఎమ్మెల్యేలు వివేక్ వెంకటస్వామి, గడ్డం వినోద్, కడియం శ్రీహరి, రాంచందర్ నాయక్, మందుల సామెల్, వెడ్మ భొజ్జు, నాగరాజు, ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

# పార్టీలు వేరైనా పద్మశాలీలమనే నినాదంతో ముందుకు సాగాలి పద్మశాలిల ఆత్మీయ సమ్మేళనం



**పెద్దపల్లి ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్):** జిల్లా కేంద్రంలోని స్థానిక ఆర్ ఆర్ గార్డెన్‌లో శుక్రవారం పద్మశాలిల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సభకు సంయుక్త అధ్యక్షులుగా బూర్ల లక్ష్మీనారాయణ, వాసల నీలయ్యల ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా బూర్ల లక్ష్మి నారాయణ మాట్లాడుతూ కర్ర ఎవరిది చేతులో ఉంటే వారిదే పెత్తనం దిశగా ప్రభుత్వాలు నడుస్తున్నాయని అన్నారు. మేమెంతో మాకు అంత నినాదం తో చట్ట సభలో హక్కుల కోసం పోరాడాలని పిలుపునిచ్చారు. అందరిని సంఘటితం చేయాలని సంఘ నాయకులను కోరారు. గడ్డం జగన్నాథం మాట్లాడుతూ పద్మశాలి సంఘాన్ని 1921 లోనే అఖిలభారత పద్మశాలి సంఘం అనే పేరుతో స్థాపించడం జరిగిందని అన్నారు. మన సంఘం బలోపేతం కోసం వివిధ రకాల యూనిట్లను ఏర్పాటు చేయడం జరిగిందని కులాభాంధవులు ఈ అవకాశం సద్వినియోగం చేసుకోవల్లన్నారు. తెలంగాణ ప్రాంత పద్మశాలి సంఘం రాష్ట్ర అధ్యక్షులు కమర్తపు మురళి మాట్లాడుతూ రాష్ట్రంలో వివిధ క్షేత్రాలలో మన పద్మశాలి సంఘం యొక్క శక్తిని చూపించాల్సిన ఆవశ్యకత ఏర్పడిందని అన్నారు. పార్టీలు వేరైనా మనమంతా పద్మశాలీలమనే నినాదంతో ముందుకు వెళ్లాలని రానున్న స్థానిక సంస్థల్లో బీసీ నినాదంతో అత్యధిక స్థానాలు సంపాదించాలని అన్నారు. ఈ దిశగా స్థానికంగా కుల సంఘాలలో అక్కడక్కడ చిన్న చిన్న వైష్యమ్యాలు ఉన్నప్పటికీ మనమంతా ఒకటే కులం అనే భావనతో ఉండాలన్నారు. సంఘం ఏదైనా పిలుపునిచ్చిన అందరు ఐక్యంగా పనిచేయాలని ఆయన కోరారు. మార్చి 9న సంఘం జరుపు మహాసభలు విజయవంతం చేయాలన్నారు. అఖిల భారత పద్మశాలి సంఘం జాతీయ అధ్యక్షులు కందగట్ల స్వామి మాట్లాడుతూ మార్చి 9వ తేదీన 17వ పద్మశాలి మహాసభ అలాగే 8వ తెలంగాణ ప్రాంత మహాసభలను హైదరాబాద్ లో జరుపు కార్యక్రమానికి కుల బంధువులు అధిక సంఖ్యలో పాల్గొని సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. దేశం మొత్తం సంఘం తన పనులు నిర్వహిస్తుందని అనేక సంక్షేమ కార్యక్రమాలు చేస్తూ కొండా లక్ష్మణ్ బాపూజీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మొట్టమొదటి కుల సంఘంగా ఆయన అభివర్ణించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు ఆడెపు సుధాకర్, దాసరి ఉష, గుండేటి రాజేష్, గ్యాజంగి లక్ష్మణ్, బూర్ల లక్ష్మీనారాయణ, డివిఎస్ మూర్తి, వేముల రాజమౌళి తదితరులు పాల్గొన్నారు.

# కోల్ ఇండియాలో లేని హక్కులు సాధించి పెట్టాం

## - టీబీజీకేఎస్ రాష్ట్ర అధ్యక్షులు ఎం. రాజిరెడ్డి



**యైటింక్లయిన్ కాలనీ. (ది క్రైమ్ న్యూస్):** స్థానిక సింగరేణి బొగ్గు గని కార్మిక సంఘం (టీబీజీకేఎస్) కార్యాలయంలో శుక్రవారం సింగరేణి రామగుండం రెండవ బ్రాంచ్ యూనియన్ సభ్యుల సమావేశం జరిగింది. యూనియన్ రెండవ బ్రాంచ్ ఉపాధ్యక్షులు ఐలి శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో, యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు మిరియాల రాజిరెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని, వివిధ యూనియన్లను వదిలి వచ్చిన పలువురు ఉద్యోగులకు గులాబీ కండువాలు కప్పి యూనియన్ లో చేర్చుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. సింగరేణి ఉద్యోగుల అపరిష్కృత సమస్యల ను పరిష్కరించిన చరిత్ర టీబీజీకేఎస్ దే నన్నారు. గుర్తింపు కార్మిక సంఘంగా ఉన్నప్పుడు 70కి పైగా హక్కులను సింగరేణి ఉద్యోగులకు సాధించి పెట్టడమే కాకుండా, కోలిండియాలో లేని విధంగా 18 అదనపు హక్కులు కారుణ్య నియామకాలు, ప్రమాదవశాత్తు చనిపోతే 20 లక్షల మ్యాచింగ్ గ్రాంట్, విధుల నిర్వహణలో మరణించిన వారి కుటుంబాలకు 15 లక్షల నష్టపరిహారం, 10 లక్షల ఇంటి రుణానికి వడ్డీ చెల్లింపు, సంక్రాంతి, అంబేద్కర్ జయంతి లకు పిహెచ్డీలు, మహిళాలకు, వికలాంగులకు ఉద్యోగ అవకాశం, 1% విద్యుత్ చార్జీల రద్దు, ఏసీలకు ఉచిత విద్యుత్తు, 34 డెసిగ్నేషన్లకు క్యాడర్ స్కీమ్, ఇలా ఎన్నో హక్కులను సాధించి పెట్టడం జరిగిందన్నారు. యూనియన్ చేపడుతున్న కార్యకలాపాల పట్ల ఆకర్షితులై అనేకమంది ఉద్యోగులు టీబీజీకేఎస్ వైపు చూస్తున్నారని అన్నారు. ఎందుకు నిదర్శనంగానే నేడు ఉద్యోగులు ఎస్. రామచంద్ర రెడ్డి, శైలోజు రాకేష్, గడమల్ల సంపత్ కుమార్, జాడి ఫణీంద్ర, బింగి శ్రీకాంత్, సంతోషం అజయ్, చందర్, కే. సుజిత్, బత్తుల మనోజ్ కుమార్, ఎం. ఉదయ్ తదితరులు యూనియన్ లో చేరారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు సిహెచ్. ప్రభాకర్ రెడ్డి, చంద్రయ్య, సురేందర్, రవితేజ, వెంకటేష్, శ్రీనివాస్, రమేష్, తిరుపతి, శ్రీనివాస్, రామ్ చరణ్, లెనిన్, నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

## - డిపో మేనేజర్‌కు వినతి పత్రం అందజేత



**తొర్రూరు, (ది క్రైమ్ న్యూస్):** ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగులు తమ బకాయిలు చెల్లించి సమస్యలు పరిష్కరించాలని కోరుతూ డిపో మేనేజర్ పద్మావతికి పలు బకాయిల వివరాలతో వినతిపత్రంఅందజేశారు. అనంతరంవిశ్రాంతఉద్యోగులుగట్టుప్రభాకర్,గూడెల్లి రాంచంద్రయ్య, సోమన్నలు మాట్లాడుతూ డిపోలో సుమారు 130 మందికి పైగా ఉన్నారని వీరికి 2017 నుండి పిఆర్సి, సవరించిన ఆర్పిసి, ఈఎల్, గ్రట్యూవిటి, టీ. ఎస్.సి ఎరియర్స్ తదితర బకాయిలు ఒక్కొక్కరికి వారి వారి పే స్కేల్‌కు అనుగుణంగా సుమారు లక్ష రూపాయల నుండి రెండు లక్షల వరకు బకాయిలు ఉన్నాయని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి వాటిని వెంటనే చెల్లింపులు జరిగేలా చూడాలని కోరారు. అనంతరం నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా పి. వెంకన్న, కార్యదర్శిగా గూడెల్లి రామచంద్రయ్య, కోశాధికారిగా కె.వి స్వామి, ముఖ్య సలహాదారులుగా సిహెచ్ వెంకన్న, డివి స్వామి లను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ రిటైర్డ్ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా కార్యదర్శి నన్నపనేని రాజు, జి ఆర్ చంద్రయ్య, వెంకన్న, గట్టు ప్రభాకర్, దీకొండ వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాతీయ సైన్స్ దినోత్సవ వేడుకలు






**తొర్రూరు, (ది క్రైమ్ న్యూస్):** తొర్రూరు డివిజన్ కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల భౌతికశాస్త్ర విభాగం, ఐక్యుఏసి, నెహ్రూ యువ కేంద్రం ఆధ్వర్యంలో సంయుక్తంగా శుక్రవారం జాతీయ సైన్స్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ఇన్చార్జి ప్రిన్సిపల్ డాక్టర్ సుజాత సివి రామన్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ విద్యార్థులు సైన్స్‌పై అవగాహన పెంచుకోవాలని సైన్స్ ద్వారానే సమాజ పురోగతి సాధ్యమని తెలిపారు. దైనందిన జీవితంలో సైన్స్ ఎంతో ఉపయోగ పడుతుందన్నారు. కోఆర్డినేటర్, భౌతిక శాస్త్ర విభాగం అధిపతి రవీంద్రారెడ్డి మాట్లాడుతూ కాంతి ధర్మాలు, రామన్ ఫలితాన్ని కూలం కుశంగా వివరించారు. ప్రపంచ వైజ్ఞానిక సమాజానికి భారతీయ శాస్త్రవేత్తల సహకారలని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. సైన్స్ అండ్ టెక్నాలజీపై నిర్వహించిన క్విజ్ పోటీల్లో విజయం సాధించిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో నవయుగ విజన్ యూత్ అసోసియేషన్ అధ్యక్షులు బానోత్ వీరన్న నాయక్, అధ్యాపక బృందం శాంతి కుమార్, పార్వతి, టి. వెంకన్న, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ వాల్య లూనావత్, శారద, అంజుమ్ ఆరా, శ్రీనివాస్, సునీల్, కృష్ణవేణి, రాధిక, రజిత, మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ ప్రభుత్వమంటేనే పేదల ప్రభుత్వం: ఇట్లు తిమ్మాపూర్ మండల కాంగ్రెస్ పార్టీ



**తిమ్మాపూర్ (ది క్రైమ్ న్యూస్):** కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండలం మల్లాపూర్ లోని నిరుపేద కుటుంబానికి చెందిన మడ్డి ఉమా సంపత్ గౌడ్ కు ఇద్దరు కూతుర్లు ఉండగా మొదటి కూతురుకు పెళ్ళి నిశ్చయమై పెళ్ళి చేసేందుకు ఆర్థికంగా ఇబ్బందులు పడుతుడంతో గ్రామానికి చెందిన రావుల పరశురాములు గౌడ్ ద్వారా విషయం తెలుసుకున్న మండల కాంగ్రెస్ నాయకులు కాంగ్రెస్ ప్రభుత్వం పేదల ప్రభుత్వమనే నిదాదంతో ముందుకు వచ్చి మాజీ వైస్ ఎంపీపీ తుమ్మనపల్లి శ్రీనివాస్ రావు 10000, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఎస్ ఎల్ గౌడ్ 5000, మామిడి అనిల్ 5000, బుధవారం శ్రీనివాస్ 5000, మల్లాపూర్ గ్రామానికి చెందిన రావుల పరుశరాములు గౌడ్ 5000, కర్ణ బత్తుల మనోహర్ 5000, గోపు మల్లారెడ్డి 2500, కాల్వ మల్లేశం 2500 మొత్తం 40 వేల రూపాయల ఆర్థిక సహాయాన్ని శుక్రవారం ఆ కుటుంబానికి అందించి వివాహానికి చేయూతనందించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ గ్రామశాఖ అధ్యక్షులు పాశం సమ్మయ్య, పత్రి కనకయ్య, గడ్డం వెంకటేష్, శ్రీధర్, ఆశిక్ పాషా, రావుల కృష్ణ గౌడ్ గుంటి మధుకర్, బుర్ర వెంకటేష్ గౌడ్, గూడా సందీప్, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# స్పెషల్ డ్రైవ్ ద్వారా స్కానింగ్ కేంద్రాల తనిఖీ

- డి.ఎం. అండ్ హెచ్. ఓ. డాక్టర్ అన్న ప్రసన్న కుమారీ
- గర్భస్థ లింగ నిర్ధారణ చట్ట వ్యతిరేకం




**పెద్దపల్లి ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్):** జిల్లాలో ఉన్న అన్ని స్కానింగ్ కేంద్రాలను స్పెషల్ డ్రైవ్ క్రింద తనిఖీ చేయనున్నట్లు జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ అన్న ప్రసన్న కుమారీ అన్నారు. శుక్రవారం సమీకృత జిల్లా కలెక్టరేట్ లోని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి కార్యాలయంలో గర్భస్థ పూర్వ, గర్భస్థ లింగ నిర్ధారణ చట్టం1994 పరిధి జిల్లా అడ్వైజరి కమిటి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ అన్న ప్రసన్న కుమారీ మాట్లాడుతూ కమిషనర్ ఆదేశాల మేరకు జిల్లాలోని స్కానింగ్ కేంద్రాలను స్పెషల్ టీం ద్వారా తనకి చేస్తామని తెలిపారు. స్పెషల్ టీం లో గైనకాలజిస్ట్ ప్రోగ్రాం అధికారి మహిళా తహసిల్దార్ మహిళా పోలీస్ అధికారి సఖి కన్సల్టెంట్ డాటా ఎంట్రీ ఆపరేటర్ ఉంటారని అన్నారు. గర్భస్థ శిశువుగా ఉన్నప్పుడు స్త్రీ, పురుష లింగ నిర్ధారణ పరీక్షలు చేసినట్లయితే పరీక్షలు చేసిన వారికి, చేయించుకున్న వారికి, అందుకు ప్రోత్సహించిన వారికి చట్టప్రకారం మూడు సంవత్సరాల వరకు జైలు శిక్ష, పది వేలు జరిమాన విధించబడు తుందని,అలాగే కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. స్కానింగ్ కేంద్రాలలో కచ్చితంగా రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్, ధరల పట్టిక, సరేనా రికార్డుల నిర్వహణ ఉండాలని, ప్రతి నెల జరిగే స్కానింగ్ వివరాలను జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారికి పంపాలని, లింగ నిర్ధారణ పరీక్షలు చట్టరించే నేరమని, ఇచ్చట పుట్టబోయే బిడ్డ ఆడ మగ అని చెప్పకూడదు అని బోర్డులు స్కానింగ్ కేంద్రాలలో ప్రదర్శించాలని అన్నారు. జిల్లాలోని ఆసుపత్రులలో జరుగుతున్న అబార్షన్ కేసులను సైతం స్టడీ చేసి ఎక్కడైనా లింగ నిర్ధారణ కారణంగా అబార్షన్ జరిగిందో పరిశీలిస్తామని డి.ఎం.హెచ్.ఓ అన్నారు. అధికంగా అబార్షన్ జరిగే ఆసుపత్రిలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించాలని, డ్రగ్ ఇన్స్పెక్టర్ తో సమన్వయం చేసుకుంటూ అబార్షన్ మాత్రల అమ్మకాలపై పర్యవేక్షణ చేయాలని అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో ఐ.ఆర్.సి.ఎస్. జిల్లా కన్వీనర్ కావేటి రాజగోపాల్,జిల్లా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీధర్, జిల్లాస్ మహిళా సమైక్య అధ్యక్షురాలు సరస్వతి, పిల్లల వైద్య నిపుణులు డాక్టర్ రవీందర్, పిఓఎంహెచ్ఎన్ డాక్టర్ బి. వాణిశ్రీ, సంబంధించిన అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# కృష్ణవేణి వికాస్ జూనియర్ కళాశాల ఫేర్వెల్ డే హంగామా

- ఎడ్యుకేషన్ బిల్డ్స్ బ్యూటిఫుల్ లైఫ్ - గురువు చెప్పే పాఠాలు భవిష్యత్తు పునాదులు
- ఫేర్ వెల్ ప్రతి విద్యార్థికి మధుర అనుభూతి - ఇంటర్ సక్సెస్ ఉన్నత చదువులకు ఓపెన్ ఛాలెంజ్
- గోదావరిఖని అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ మడత రమేష్




**గోదావరిఖని ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్):** ఎడ్యుకేషన్ బిల్డ్స్ బ్యూటిఫుల్ లైఫ్ అని కృష్ణవేణి వికాస్ జూనియర్ కళాశాల విద్యార్థినీ విద్యార్థులకు గోదావరిఖని అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ (ఏసీపీ) మడత రమేష్ సూచించారు. ఈ మేరకు శుక్రవారం గోదావరిఖనిలోని ఒక ప్రైవేట్ ఫంక్షన్ హాల్లో కృష్ణవేణి వికాస్ జూనియర్ కళాశాల ఆధ్వర్యంలో "ఫ్లెడ్లింగ్ ఫెస్ట్ 2025" పేరిట చేపట్టిన ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం విద్యార్థుల ఫేర్ వెల్ పార్టీకి ఆ కళాశాల చైర్మన్ అండ్ డైరెక్టర్ నాగండ్ల జమున రవికుమార్ గురువు, ప్రస్తుత గోదావరిఖని ఏసిపి ఎం.రమేష్ ముఖ్యఅతిథిగా హాజరై మొదటి సంవత్సరంలో ఉత్తమ మార్కులు పొందిన విద్యార్థినీ విద్యార్థులకు ప్రజెంటేషన్స్ అందజేసి ఘనంగా సన్మానించారు. అలాగే ఇంటర్మీడియట్ పబ్లిక్ ఎగ్జామ్స్ లో రాష్ట్రస్థాయి మార్కులను సాధించిన విద్యార్థుల తల్లిదండ్రులను సైతం ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఏసీపీ రమేష్ మాట్లాడుతూ గురువు చెప్పే పాఠాలు ప్రతి విద్యార్థి యొక్క భవిష్యత్తుకు పునాదులు అని తెలిపారు. విద్యార్థి జీవితాన్ని ఎంజాయ్ చేస్తూనే ప్రథమ లక్ష్యమైన చదువుపై ఫోకస్ పెట్టి అత్యధిక మార్కులు సంపాదించి ఉన్నతమైన స్థానంలో స్థిరపడాలి అని సూచించారు. ఫేర్ వెల్ ప్రతి విద్యార్థికి ఒక మధుర అనుభూతి అని తెలిపారు. తన స్టూడెంట్ లైఫ్ లో ఇలాంటి పార్టీలలో ఎన్నో సార్లు ఆనంద క్షణాలను పొందినట్లు ఆనాటి జ్ఞాపకాలను సభా సాక్షిగా విద్యార్థినీ విద్యార్థులతో నెమరు వేసుకున్నారు. ఇంటర్ సక్సెస్ ఉన్నత చదువులకు ఓపెన్ ఛాలెంజ్ అని అన్నారు. తల్లిదండ్రుల ఆశలను నెరవేర్చి సమాజంలో వారికి గొప్ప పేరు తీసుకురావాలి అని సూచనలను చేశారు. అనంతరం కళాశాల చైర్మన్ అండ్ డైరెక్టర్ నాగండ్ల జమున రవికుమార్ కార్యక్రమం ముఖ్య అతిథి ఏసీపీని ఘనంగా శాలువాతో సత్కరించి ప్రశంసా పత్రాన్ని అందజేశారు. ప్రశంసా పత్రంలోని అద్భుతమైన వాక్యాలను తన మాటల ద్వారా క్లుప్తంగా ఆనంద నయనాలతో చదివి వినిపించారు. తనకి తన గురువు అయిన ఏసీపీ రమేష్ ఇన్స్పిరేషన్ అని సంతోషం వ్యక్తం చేశారు. అనంతరం తన గురువు ఏసీపీకి సాష్టాంగ నమస్కారం చేశారు. విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తు కోసం తాను ఎలాంటి కష్టనష్టాలకైనా సిద్ధంగా ఉంటానని స్పష్టం చేశారు. ఈ వేడుకలలో విద్యార్థినీ, విద్యార్థులు ఆడి పాడి కేరింతలతో మధుర అనుభూతులను తమ తమ సెల్ ఫోన్లలో సెల్ఫీల ద్వారా చిత్రీకరించుకున్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ వెంకన్న, అకాడమిక్ ప్రిన్సిపల్ ఎస్.తిరుపతి రెడ్డి, లెక్చరర్లు, అధిక సంఖ్యలో విద్యార్థినీ విద్యార్థులు, పోషక మహాశయులు పాల్గొన్నారు.

## కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయం

# సైన్స్ దినోత్సవం

**హైదరాబాద్ (ది క్రైమ్ న్యూస్):** ఐసిఎంఆర్ టాస్క్ ఫోర్స్ ప్రాజెక్టు యొక్క సికిల్ సెల్ వ్యాధి సంబంధిత అవగాహన, సమాచారం మరియు విద్య (ఐఇసి) మెటీరియల్ ను విడుదల చేసింది. 2023 జనవరిలో ప్రారంభమైన ఈ ప్రాజెక్టు అరకు, పాడేరు ప్రాంతాల్లో నడుస్తోంది. కొడవలి కణ వ్యాధి యొక్క సమగ్ర సంరక్షణ మరియు నిర్వహణ కోసం గిరిజనులకు మెరుగైన ప్రాప్యత కోసం ఈ ప్రాంతంలోని నేషనల్ సికిల్ సెల్ మిషన్ మరియు ఐసిఎంఆర్ టాస్క్ ఫోర్స్ ప్రాజెక్టులు కృషి చేస్తున్నప్పటికీ, వ్యాధికి సంబంధించిన కళంకం కారణంగా పెద్ద సవాళ్లు ఉన్నాయి. ఈ ప్రాజెక్ట్ భారతీయ సందర్భానికి సంబంధించిన స్టిగ్మా స్కేల్ ను అభివృద్ధి చేయడంలో విజయవంతంగా పనిచేసింది మరియు ఇప్పుడు ప్రాజెక్ట్ యొక్క మూడవ సంవత్సరంలో కళంకాన్ని తగ్గించడానికి ఇంటర్వెన్షనల్ కార్యకలాపాల అమలును ప్లాన్ చేసింది. కమ్యూనిటీ కరపత్రాలు, కీలక సమాచారం ఇచ్చేవారికి కరపత్రాలు, ఆరోగ్య కార్యకర్తల కోసం ఫోల్డ్ బ్రోచర్లు, రోగుల ఆర్ద్రీకరణ ప్రాముఖ్యతపై కరపత్రాలు, పోస్టర్లు, స్టాండీలు, అవగాహన బ్యానర్లు, పాకెట్ క్యాలెండర్లతో కూడిన సికిల్ సెల్ వ్యాధి సంబంధిత ఐఈసీ మెటీరియల్ను సీటీయూఏపీ గౌరవ ఉపకులపతి ప్రొఫెసర్ టీవీ కత్తిమణి, ఇక్రిశాట్ మాజీ డీడీజీ-రీసెర్చ్ మాజీ డీడీజీ-రీసెర్చ్ డాక్టర్ అరవింద్కుమార్, ప్రొఫెసర్ శరత్ చంద్రబాబు ప్రారంభించారు. డీన్ స్కూల్ ఆఫ్ సైన్సెస్. ప్రాజెక్టు ప్రిన్సిపల్ ఇన్వెస్టిగేటర్ డాక్టర్ పరికిపొండ్ల శ్రీదేవి గిరిజన ప్రాంతాల్లో వ్యాధిపై అవగాహన ఆవశ్యకత గురించి క్లుప్తంగా వివరించారు, ప్రాజెక్టు కో-పిఐ డాక్టర్ అనిరుధ్ కుమార్, ప్రాజెక్ట్ సిబ్బంది డాక్టర్ రవిబాబు బీరుడు శాస్త్రవేత్త సి, డాక్టర్ అనిల్ కుమార్ ఇంతి పాల్గొన్నారు.




## ప్రపంచ అభివృద్ధి సాంకేతికత తోనే సాధ్యం



**రామగిరి(ది క్రైమ్ న్యూస్) ఫిబ్రవరి 28:** సహజ వనరులను వినియోగించుకుంటూ ప్రపంచం అభివృద్ధి మార్గంలో ప్రయాణించాలంటే సాంకేతికత లోనే సాధ్యమని పలువురు వక్తలు వ్యాఖ్యానించారు. జాతీయ సైన్స్ డే సందర్భంగా స్థానిక్ వాణి సెకండరీ పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వారు మాట్లాడారు. ప్రతి విషయాన్ని లోతుగా పరిశీలించి పరిశోధనల దిశగా విద్యార్థులు అడుగు వేయాలని వారు సూచించారు. సైన్స్ దినోత్సవం సందర్భంగా పాఠశాలలో క్విజ్, రంగోళి, ఉపన్యాస పోటీలు వైజ్ఞానిక ప్రదర్శనలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతిభ కనబరచిన విద్యార్థులను పాఠశాల కరస్పాండెంట్ పశాంత్ రెడ్డి, సతీమణి డా మమత రెడ్డి ఎంపిక చేశారు.పాఠశాల ప్రధానోపాధ్యాయులు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో (శ్రావణ్ కుమార్ ఆర్జి-టు జిఎం రఘుపత , రామగిరి ఎస్సై దివ్య, ప్రముఖ పిల్లల వైద్యులు డాఎం ప్రణీత్, పాఠశాల పి ఈ టి తీరుపతి, సైన్స్ విభాగం ఉపాధ్యాయులు కౌండన్య , అనిత మరియు ఇతర ఉపాధ్యాయ బృందం విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

## నేడు మహిళలకు స్వయం ఉపాధి శిక్షణ



**రామగిరి(ది క్రైమ్ న్యూస్)ఫిబ్రవరి 28:** నిరుద్యోగ మహిళలకు స్వయం ఉపాధి శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేయడం జరిగిందని అమ్మ స్వచ్ఛంద సంస్థ అధ్యక్షులు అంకరి కుమార్ తెలిపారు. మార్చి 1న శనివారం మంథని సీయోను చర్చిలో అమ్మ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఐదు రకాల శిక్షణ కార్యక్రమాలు ఇవ్వడం జరుగుతుందని, సర్ఫ్ తయారు చేయడం, ఫినాయిల్, వాజ్లిన్, జండుబాం, సోప్ ఆయిల్ లాంటి ఐదు రకాల వస్తువులు తయారు చేయడం నేర్పించి వాటికి సంబంధించిన రా మెటీరియల్ ఎక్కడ దొరుకుతుంది లాంటి పూర్తి సమాచారం ఇవ్వడం జరుగుతుందని ఆసక్తి కలిగిన నిరుద్యోగ మహిళలు అధికసంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలనీ, వివరాలకు 9440449386 సంప్రదించాలని అయన కోరారు.

## రిటైర్డ్ ఉద్యోగి వీడ్కోలు సన్మానం



**యైటింక్లయిన్ కాలని. (ది క్రైమ్ న్యూస్):** సింగరేణి రామగుండం రెండవ డివిజన్ పరిధిలోని వకీల్ పల్లి గని లో శుక్రవారం ఉద్యోగ విరమణ సన్మాన కార్యక్రమం జరిగింది. సాయంత్రం గని ఆవరణలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో గనిలో హెల్పర్ గా విధులు నిర్వహిస్తూ.. సర్వీస్ కాలం పూర్తి చేసి ఉద్యోగ విరమణ పొందిన పుప్పాల నర్సింగరావు ను గని అఫిషియేటింగ్ మేనేజర్ తిరుపతి, తోటి ఉద్యోగులు శాలువాలతో సన్మానించి జ్ఞాపికను అందజేసే వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా గని అధికారి తిరుపతి మాట్లాడుతూ.. సింగరేణిలో వివిధ హోదాలలో 37 సంవత్సరాలు విధులు నిర్వహిస్తూ.. అందరి మన్ననలను పొందుతూ.. సంస్థకు సేవలు అందించి, నేడు పదవీ విరమణ పొందడం అభినందనీ యమన్నారు. ఉద్యోగ విరమణ తర్వాత శేష జీవితాన్ని సుఖ సంతోషాలతో ఆయురారోగ్యాలతో గడపాలని ఆయన కోరుకున్నారు. ఈ కార్యక్రమంలో కార్మిక నాయకులు బొంత రాజు, రక్షణ అధికారి రామ్ కుమార్, డివైపిఎం శ్యామ్ ప్రసాద్, ఉద్యోగులు పాల్గొన్నారు.

# పాఠశాలల్లో జాతీయ సైన్స్ దినోత్సవ వేడుకలు



**ధర్మపురి, ఫిబ్రవరి 28, (ది క్రైమ్ న్యూస్):** ధర్మపురి మండలంలోని వివిధ పాఠశాలల్లో జాతీయ సైన్స్ దినోత్సవ వేడుకలను పాఠశాలల ఉపాధ్యాయులు ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని శ్రీ వాణి విద్యాలయం పాఠశాలలో ఏర్పాటు చేసిన సైన్స్ దినోత్సవం కార్యక్రమంలో కరస్పాండెంట్ శ్రీనివాస్ మాట్లాడుతూ శాస్త్రీయ సాంకేతిక విద్య పై పిల్లలకు అవగాహన కల్పించడం వలన విద్యార్థులు భవిష్యత్తులో ఉన్నత శిఖరాలకు చేరుకుంటారని శ్రీనివాస్ అన్నారు. పాఠశాలలో నిర్వహించిన సైన్స్ ఫేర్ లో 150కి పైగా విద్యార్థులు తయారుచేసిన వివిధప్రాజెక్టు నమూనాలనుపరిశీలించి విద్యార్థుల నైపుణ్యాన్ని కరస్పాండెంట్ అభినందించారు. తల్లిదండ్రులు సైతం పిల్లల ఇష్టాయిష్టాలను బట్టి శాస్త్ర సాంకేతిక శిక్షణపట్ల ఆసక్తి అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్లు సంగనభట్ల దినేష్, సంతోషి, తోటశంకర్ ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# ఒక్క సీసీ కెమెరా వంద మంది పోలీసులతో సమానం

- ధర్మపురి సర్కిల్ ఇన్స్పెక్టర్ రాంనరసింహా రెడ్డి



**ధర్మపురి, ఫిబ్రవరి 28, (ది క్రైమ్ న్యూస్):** ఒక్క సీసీ కెమెరా వంద మంది పోలీసులతో సమానం అని ధర్మపురి సర్కిల్ ఇన్స్పెక్టర్ రాంనరసింహ రెడ్డి అన్నారు. శుక్రవారం ధర్మపురి పట్టణంలోని జామ మసీద్ లో సిఐ రాంనరసింహారెడ్డి సూచన మేరకు జామ మసీదులో ఆరు కెమెరాలను మసీద్ కమిటీ వారు ఏర్పాటు చేయడం జరిగిందని, అట్టి కెమెరాలను ఈ రోజు సిఐ రాంనరసింహారెడ్డి ప్రారంభించటం జరిగిందని కమిటీ సభ్యులు పేర్కొన్నారు. అనంతరం సీఐ రాంనర్సింహారెడ్డి మాట్లాడుతూ సీసీ కెమెరాలు సమాజంలో నేరాలను అదుపు చేయడానికి, నేరాలను చేదించటానికి ఎంతో ఉపయోగపడతాయని తెలిపారు. ఒక్క సీసీ కెమెరా వందమంది పోలీస్లతో సమానమని సిఐ పేర్కొన్నారు. ప్రతి దేవాలయం, మసీద్, చర్చ్ లలో తప్పనిసరిగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని నిర్వహకులను ఈ సందర్భంగా సీఐ కోరడం జరిగింది. సీసీ కెమెరాలు ఏర్పాటు చేసిన అజ్మత్ అలీ నీ సిఐ అభినందించారు. ఈ కార్యక్రమంలో ధర్మపురి ఎస్సై ఉదయ్ కుమార్ మరియు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## శివాలయంలో భక్తులకు మహా అన్నదానం



**రామగిరి(ది క్రైమ్ న్యూస్)ఫిబ్రవరి 28:** స్థానిక శ్రీ శీలేశ్వర-సిద్దేశ్వర ఆలయంలో భక్తులకు లోకే కుటుంబ సభ్యులు మహా అన్నదాన కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. మహా శివరాత్రి సందర్భంగా ఆలయంలో శ్రీపార్వతి-పరమేశ్వరుల కళ్యాణాన్ని వైభవంగా నిర్వహించిన మూడు రోజుల అనంతరం ఆలయ నిర్వాహకులైన లోకే కుటుంబ సభ్యులు భక్తులకు మహా అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించడం ఇక్కడ ఆనవాయితీగా వస్తుంది. ఈ సందర్భంగా వారు ఆలయంలో స్వామి అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం భక్తులకు అన్నప్రసాదాన్ని వితరణ చేశారు. ఈకార్యక్రమంలో లోకే రాధా కిషన్ రావు, కొమురవెల్లి విజయ్ కుమార్, వొడ్నాల శ్రీనివాస్, రావికంటి మనోహర్, కొమురవెల్లి జయన్న, రాజు, శ్రీనివాస్, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

# ఇల్లంతకుంటలో ఘనంగా జాతీయ సైన్స్ దినోత్సవ వేడుకలు



**ఇల్లంతకుంట (ది క్రైమ్ న్యూస్):** రాజన్న సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండలంకేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం జాతీయ సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని పాఠశాల విద్యార్థులు తయారు చేసిన వివిధ సైన్స్ ప్రాజెక్టులను, సి. వి. రామన్ గొప్పతనం, రామన్ ఎఫెక్ట్ ప్రాముఖ్యతపై ఉపన్యాస పోటీలు, సైన్స్ క్విజ్ పోటీలను పాఠశాల యాజమాన్యం నిర్వహించారు.పాఠశాల ప్రధానో పాధ్యాయురాలు ఎం. ప్రేమలత మాట్లాడుతూ భారతదేశం గర్వించదగ్గ గొప్ప శాస్త్రవేత్త సర్ సి.వి రామన్ ని విద్యార్థులు ఆదర్శంగా తీసుకొని అందుబాటులో ఉన్న వస్తువులతో సృజనాత్మకమైనటువంటి ఆలోచనలతో ప్రయోగాలు చేస్తూ శాస్త్రవేత్తలుగా ఎదిగి దేశానికి సేవలు అందించాలని కోరారు. పాఠశాలలో నేర్చుకున్న సైన్స్ ను నిత్యజీవితంలో కూడా ఉపయోగిస్తూ విద్యార్థులు సైంటిఫిక్ టెంపర్ ను పెంపొందించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయుల ఆర్.రమణారెడ్డి, ఎస్.మధుసూదన్ రావు,ఎం. మంజుల,ఐ. ప్రదీప్ రెడ్డి,ఎం.లత,పి.అనిల్ కుమార్, సి.హెచ్.పుష్పలత, ఏ.కవిత, పి. స్వప్న, ఎన్. సత్తయ్య, ఎస్.సుజాత దేవి విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

# సైన్స్ ఫెయిర్ తో విద్యార్థుల్లో సృజనాత్మకత పెంపొందుతుంది...

**- శ్రీ చైతన్య స్కూల్ సైన్స్ సైన్స్ ఫెయిర్ ప్రోగ్రాంలో బిజెపి జిల్లా అధ్యక్షులు గంగాడి కృష్ణారెడ్డి వ్యాఖ్యలు**



**కరీంనగర్ టౌన్, ఫిబ్రవరి28(ది క్రైమ్ న్యూస్):** సైన్స్ ఫెయిర్ తో విద్యార్థుల్లో సృజనాత్మకత పెంపొందుతుందని, విద్యతోపాటు విద్యార్థుల్లో శాస్త్ర సాంకేతిక అంశాల్లోని నైపుణ్యాలను వారి ప్రతిభను వెలికి తీసేందుకు సైన్స్ ఫెయిర్ ఎంతో దోహదపడుతుందని బిజెపి జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి అన్నారు. కరీంనగర్ పట్టణంలోని శ్రీ చైతన్య స్కూల్ వావిలాలపల్లి, విద్యారణ్య పూరి బ్రాంచ్ ల లో శుక్రవారం రోజున జరిగిన సైన్స్ ఫెయిర్ కార్యక్రమానికి బిజెపి జిల్లా అధ్యక్షులు గంగాడి కృష్ణారెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా సైన్స్ ఫెయిర్ లో విద్యార్థుల వైజ్ఞానిక, ఇతర ప్రదర్శనలను గంగాడి కృష్ణారెడ్డి తిలకించి, పలువురు విద్యార్థులతో మాట్లాడారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి గంగాడి కృష్ణారెడ్డి మాట్లాడుతూ విద్యార్థుల మేదో సంపత్తిని గుర్తించడానికి కొన్ని సైన్స్ ఫెయిర్ కీలకంగా మారాయన్నారు. వైజ్ఞానిక మేలాల్లో సైన్స్ నమూనా ప్రాజెక్టులు విద్యార్థుల ప్రతిభ, సృజనాత్మకతకు దర్పణంగా నిలుస్తున్నాయన్నారు. ముఖ్యంగా పాఠశాల దశ నుంచి సైన్స్, గణితం సబ్జెక్టుల్లో పట్టు సాధించే విధంగా విద్యార్థులను తయారు చేయడంలో ఈ ప్రదర్శనలు ఎంతో దోహదం చేస్తాయన్నారు. దేశానికి శాస్త్ర సాంకేతిక వైజ్ఞానాన్ని అందించిన ఎంతోమంది మహానుభావులు ఉన్నారని , ఆర్యభట్ట మొదలుకొని అబ్దుల్ కలాం వరకు ఎంతోమంది ఆ దిశలో కృషి చేశారని , వారి స్ఫూర్తి గా తీసుకొని విద్యార్థులు ముందు కొనసాగాలని ఆయన ఈ సందర్భంగా విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో తాజా మాజీ కార్పొరేటర్ కొలగానీ శ్రీనివాస్ , నాయకులు పాదం శివరాజ్ , బండారి ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

## జక్కని సంజయ్ ఆమరణదీక్షతోనే బిసి ఉద్యమం మలుపు తిరిగింది: మాజీ ఐఏఎస్ చిరంజీవులు



**శంకరపట్నం (ది క్రైమ్ న్యూస్):** కరీంనగర్ జిల్లా శంకరపట్నం మండలానికి చెందిన బిసి ఆజాద్ ఫెడరేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు జక్కని సంజయ్ కుమార్ ను హైదరాబాద్ సోమాజిగూడ ప్రెస్ క్లబ్లో శుక్రవారం తెలంగాణ రాష్ట్ర పద్మశాలి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వల్లకాటి రాజ్ కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన సమ్మేళనంలో సంఘ నాయకులు ఘనంగా సన్మానించారు.కార్యక్రమానికి మాజీ ఐఏఎస్ అధికారి చిరంజీవులు, బిసి రాజ్యాధికార సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు దాసు సురేష్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ..... బీసీల ఐక్యతా, అభివృద్ధి కోసం సంజయ్ కుమార్ చేస్తున్న కృషి ఎంతో ప్రాముఖ్యమైందని కొనియాడుతూ సమాజ శ్రేయస్సు కోసం ఎన్నో కష్టనష్టాలకోర్చి ప్రతి ఉద్యమంలో ముందుండి కొట్లాడే పద్మశాలీలు అన్ని రంగాల్లో వెనుకబడి ఉన్నారని వారి అభివృద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వం పనిచేయాలని కోరారు. 12 రోజుల ఆమరణదీక్షతో బీసి ఉద్యమాన్ని తట్టిలేపిన జక్కని సంజయ్ కృషి వల్లే తెలంగాణలో బీసీ ఉద్యమం ఉవ్వెత్తున ఎగిసిందని బీసీల పోరాటంలో సంజయ్ మరింత ముందుకు సాగాలని కోరారు. కార్యక్రమంలో సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గంజి శ్రీనివాస్, నాయకులు గోనె ఏల్లప్ప, నగేష్ నేత, అప్పం శ్రీనివాస్, వేముల బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

# పెద్దమ్మతల్లి జాతర మహోత్సవానికి జివిఆర్‌కు ముదిరాజుల ఆహ్వానం



**తిమ్మాపూర్ (ది క్రైమ్ న్యూస్):** కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండలం మన్నెంపల్లిలో మార్చి7నుండి నిర్వహిస్తున్న పెద్దమ్మతల్లి జాతర మహోత్సవానికి రావాల్సిందిగా కోరుతూ గ్రామ ముదిరాజ్ సంఘం నాయకులు బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు జీవీ రామక్రిష్ణ రావును ఆయన నివాసంలో కలిసి ఆహ్వాన పత్రికను అందజేశారు.కార్యక్రమంలో మాజీ ఉప సర్పంచ్ పోన్నం అనీల్ గౌడ్,ముదిరాజ్ కుల సంఘం అధ్యక్షులు గీకూరు మల్లయ్య నాయకులు బీనపల్లి శ్రీనివాస్, సిర్ర సమ్మయ్య, గీకురు రాములు, బీనపల్లి శ్రీనివాస్, కోలకాని వేంకటి, కొలకాని సంపత్, కొలకాని సాయిలు, కొలకాని కొమురయ్య, కొలకాని సాగర్, సిర్ర రాజు, బీనపల్లిపొచమల్లు,బీనపల్లిరాజమల్లు,బీనపల్లిఅనీల్,సంఘం సభ్యులు పాల్గొన్నారు

# నూతన విధానంతో సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలకు ఊతం

**• రాష్ట్ర మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు**



**మానకొండూర్ (ది క్రైమ్ న్యూస్):** హైదరాబాద్ రెడ్ హిల్స్ లోని తెలంగాణ వాణిజ్య, పారిశ్రామిక సంస్థల సమాఖ్య భవనంలో సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలకు నూతన విధానంపై శుక్రవారం నిర్వహించిన సమావేశంలో రాష్ట్ర ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు మాట్లాడుతూ..... సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలు ఎదుర్కొంటున్న సమస్యలను సత్వరం పరిష్కరించాలన్న ఉద్దేశంతో తీసుకువచ్చిన ఈ పాలసీ చిన్నపరిశ్రమలకు ఊతమిస్తాయని తెలంగాణ ఆర్థిక వ్యవస్థలో ఎంఎస్ఎంఈలు ప్రధాన భాగస్వామ్యాన్ని కలిగి ఉన్నాయన్నారు. వీటి పరిధిలో తయారీ, సేవలు, రిటైల్, ట్రేడింగ్ రంగాలున్నాయన్నారు. అన్ని జిల్లాలో పరిశ్రమల పార్కులను అభివృద్ధి చేసి రాష్ట్రంలో సమానమైన పరిశ్రమాభివృద్ధి సాధించేందుకు, ఎంఎస్ఎంఈ, మహిళా వ్యాపారులు, ఆవిష్కరణాత్మక అంకుర సంస్థల కోసం ప్రత్యేక పార్కులను అభివృద్ధి చేస్తామన్నారు. మహిళా వ్యాపారుల కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఫ్లాటెడ్ ఫ్యాక్టరీలను ప్రభుత్వం అభివృద్ధి చేస్తుందని, వీటిని రాష్ట్ర వ్యాప్తంగా 119 నియోజకవర్గాల్లో చేపట్టి చిన్న పరిశ్రమల స్థాపనకు మహిళా స్వయం సహాయక సంఘాల సభ్యులను నూతన విధానం ద్వారా ప్రోత్సహిస్తామని శ్రీధర్ బాబు తెలిపారు. ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ మాట్లాడుతూ...... రాష్ట్రంలో చిన్నపరిశ్రమ స్థాపనకు, వాటి బలోపేతానికి నూతన విధానాన్ని తీసుకురావడం ముదావహమని పేర్కొంటూ ఈ పాలసీతో చిన్న పరిశ్రమలకు మరింత ప్రయోజనం చేకూరి ఆయా పరిశ్రమల సామర్థ్యం పెరుగుందని నిర్ధిష్టమైన విధానం, తగిన మౌలిక సదుపాయలు కల్పిస్తే వాటిద్వారా ఉపాధి కల్పించడమే కాకుండా ఆర్థిక ప్రగతికి దోహదపడతాయని ఎమ్మెల్యే కవ్వంపల్లి పేర్కొన్నారు.కార్యక్రమంలో రాష్ట్ర ప్రభుత్వ విప్ లు డాక్టర్ జాటోత్ రాంచందర్ నాయక్, అడ్లూరి లక్ష్మణ్ కుమార్, ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, గడ్డం వివేక్ వెంకటస్వామి, గడ్డం వినోద్, మందల నాగరాజు, వేముల వీరేశం, మేడిపల్లి సత్యం, మట్ట రాగమయి, కాలే యాదయ్య సంబంధిత శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# లక్ష్యంతో పయనిస్తే లక్ష్య సాధన వెతుకుంటూ వస్తుంది

**- మాజీ ఎమ్మెల్యే ట్రినిటీ విద్యాసంస్థల ఫౌండర్ చైర్మన్ దాసరి మనోహర్ రెడ్డి**



**పెద్దపల్లి ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్):** విద్యార్థులు ఒక లక్ష్యంతో పయనిస్తే లక్ష్యసాధన మిమ్ములను వెతుక్కుంటూ వస్తుందని ట్రినిటీ విద్యాసంస్థల ఫౌండర్ చైర్మన్ దాసరి మనోహర్ రెడ్డి అన్నారు.పెద్దపల్లి జిల్లా కేంద్రంలోని ట్రినిటీ ఇంజనీరింగ్ కళాశాల సెమినార్ హాల్ లో శుక్రవారం జరిగిన ట్రినిటీ ఇంజనీరింగ్ కళాశాల, డిప్లమా పరంపర 2క25 (డిప్లమా ఫేర్వెల్) కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ట్రినిటీ విద్యాసంస్థల ఫౌండర్ చైర్మన్ దాసరి మనోహర్ రెడ్డి హాజరై జ్యోతి ప్రజ్వలన చేసిన అనంతరం విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. విద్యార్థులు క్రమశిక్షణతో పట్టుదలతో చదివితే సాధించలేని అంటూ ఏదీ ఉండదని ఇప్పుడున్న తరుణంలో టెక్నాలజీ చాలా అభివృద్ధి చెందిందని టెక్నాలజీని ఉపయోగించుకుని ఉన్నత విద్యను అభ్యసించి ఉద్యోగాలు పొందే విధంగా ప్రయత్నించాలని తద్వారా తమ యొక్క తల్లిదండ్రుల కలలను నెరవేర్చిన వారు అవుతారని అన్నారు. ఈ సందర్భంగా కళాశాల అకాడమిక్ డైరెక్టర్ డాక్టర్ అశోక్ కుమార్ మాట్లాడుతూ ట్రినిటీ విద్యాసంస్థల్లో చదివిన విద్యార్థులు ఏ ఒక్కరు కూడా ఖాళీగా ఉండరని దానికోసం రానున్న రోజుల్లో కళాశాల చైర్మన్ దాసరి ప్రశాంత్ రెడ్డి మార్గదర్శకంలో కార్యచరణలో మెగా ఉద్యోగ మేళా నిర్వహించి ప్రతి విద్యార్థి ఉద్యోగిగా మారేలా దోహద పడతామని అన్నారు. దీనికోసం గత కొద్ది మాసాలుగా ఇంజనీరింగ్ కళాశాలలో ఫీల్డ్ ట్రిప్ ఇండస్ట్రియల్ విజిట్ కార్యక్రమాలు నిర్వహించి సాంకేతికపరంగా విద్యార్థులను ఎంతో అవగాహన కల్పిస్తున్నామని పేర్కొన్నారు. దీనికి ప్రతి విద్యార్థి పట్టుదలతో చదివే విధంగా కృషి చేయాలని నిరంతర తపనతో ముందుకు సాగాలని పేర్కొన్నారు. ప్రిన్సిపల్ డాక్టర్ గణేషన్ మాట్లాడుతూ విద్యార్థులకు ప్రభుత్వ ఉద్యోగాలు మరియు పరిశ్రమల్లో డిప్లమా చదువుతున్న విద్యార్థుల యొక్క పాత్ర మరియు అవకాశాలు విద్యార్థులకు క్షుణ్ణంగా వివరించారు. ఈ సందర్భంగా డిప్లమా ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను మరియు క్రీడా పోటీలు నిర్వహించి గెలుపొందిన వారికి అతిథుల చేతుల మీదుగా బహుమతులు అందజేసారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు చేసిన పలు సాంస్కృతిక నృత్యాలు ఎంతో ఆకర్షణగా నిలిచాయి.ఈ కార్యక్రమంలో అకాడమిక్ డైరెక్టర్ డాక్టర్ అశోక్ కుమార్, ప్రిన్సిపల్ డాక్టర్ మణి గణేషన్, ఏవో సురేష్,రాజిరెడ్డి, చొప్పరి వంశీ,ఈఈఈ హెచ్ఓడి డాక్టర్ నటరాజన్, ఈసీఈ హెచ్ ఓ డి ప్రభాకర్,సీఎస్ఈ హెచ్ ఓ డి స్వాతి , పద్మిని, చొప్పరి వంశీ , విద్యార్థులు పాల్గొన్నారు..

# భగవతి, ఆర్విన్ ట్రీ పాఠశాలలలో విజ్ఞాన పరిశోధనా ప్రదర్శన





**కరీంనగర్ టౌన్, ఫిబ్రవరి28(ది క్రైమ్ న్యూస్):** సి.వి. రామన్ ఎఫెక్ట్ కనుగొన్న సందర్భంగా జాతీయ సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని భగవతి, ఆర్విన్ ట్రీ పాఠశాలలలో సైన్స్ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమాన్ని పాఠశాల యాజమాన్యం, సైన్స్ సంబంధిత ఉపాధ్యాయుల ఆధ్వర్యంలో పాఠశాల ఛైర్మన్ బి. రమణ రావు కరెస్పాండెంట్ శ్రీమతి బి. విజయలక్ష్మి సి.వి. రామన్ చిత్రపటాన్ని పూలమాలలతో అలంకరించగా విద్యార్థుల బృందం రామన్ ఎఫెక్ట్ కు కృతజ్ఞతగా బృందగానాన్ని ఆలపించారువిద్యార్థులు విజ్ఞాన పరిశోధనా సంబంధిత ప్రాజెక్టులను వేదికపై ప్రదర్శించగా అందులో యాసిడ్ వర్షాలపై అవగాహన, మెటల్ డిటెక్టర్, వాన నీటిని వృధా చేయకుండా వాటితో ఇంటి అవసరాలను తీర్చుకునే విధానం, సులభమైన వ్యవసాయ పద్ధతులు,భవిష్యత్ రవాణా మొదలైన వాటి గురించి ఆకట్టుకునేలా విద్యార్థులు వివరించారు. పలువురు విద్యార్థులు సైన్స్ గురించి, రామన్ ఎఫెక్ట్ గురించి చక్కగా వివరించారు. సైన్స్ సంబంధిత ఉపాధ్యాయులు ప్రదీప్, కే. శిరీష సైన్స్ నేషనల్ థీమ్ ఇన్నోవేషన్ ఫర్ వికసిత్ భారత్ గురించి విద్యార్థులకు అర్థమయ్యేలా వివరించారు. విద్యార్థులు తమ నృత్య ప్రదర్శనలో చంద్రయాన్ గురించి, వారి శ్రమను గురించి ప్రదర్శించారు.పాఠశాల ఛైర్మన్ బి. రమణ రావు మాట్లాడుతూ మన జీవితంలో సైన్స్ ఒక భాగమని, ప్రతీ క్షణం సైన్స్ తోనే జీవితం ముడిపడి ఉంటుందని, అది విద్యార్థులు గమనించాలని తెలియచేశారు. ఎంతో మంది శాస్త్రవేత్తల పరిశోధనల ఫలితాలే నేడు మన సుఖమయ జీవనానికి ఆధారమని, ఇస్రో సంస్థలోని శాస్త్రవేత్తలు సదా అభినందనీయులని, వారి పరిశోధనల ఫలితమే నేడు మన దేశం ఒక గొప్ప స్థానంలో నిలబడిందని విద్యార్థులకు తెలియచేశారు. విద్యార్థులకు, సైన్స్ ఉపాధ్యాయ బృందానికి తన అభినందనలు తెలియచేశారు. కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులకు తన ప్రశంసలు తెలియచేశారు.

# ఘనంగా తెలంగాణ లేబర్ యూనియన్ ఆరవ ఆవిర్భావ దినోత్సవాలు




**కరీంనగర్ టౌన్, ఫిబ్రవరి28(ది క్రైమ్ న్యూస్):** రాష్ట్రంలో ఎక్కడ చూసినా కార్మికుల శ్రమ దోపిడీ జరుగుతుందని కార్మికులు శ్రమ దోపిడికి గురవుతున్నారని ప్రభుత్వ ఉన్నంత అధికారులు, కార్మిక ఉన్నంత అధికారులు అవినీతి నిద్ర మత్తులో ఉన్నారేమోననీ అనుమానం వ్యక్తం చేశారు. కార్మికులను పట్టించుకోని అధికారులను రాష్ట్ర ప్రభుత్వం విచారణ చేసి కఠినం శిక్షించి చర్యలు తీసుకోవాలని తెలంగాణ లేబర్ యూనియన్ (టి.ఎల్.యు) రాష్ట్ర అధ్యక్షులు శివరాజ్ డిమాండ్ చేశారు. కరీంనగర్ పట్టణం స్థానిక ప్రెస్ భవన్ లో తెలంగాణ లేబర్ యూనియన్ ఆరవ ఆవిర్భావ దినోత్సవాలను ఘనంగా నిర్వహించారు.ఈ సదస్సుకు జిల్లా అధ్యక్షులు కాశిపాక అజేయ్ అధ్యక్షత వహించారు. రాష్ట్ర అధ్యక్షులు కుతాడి శివరాజ్ ముఖ్య అతిథిగా పాల్గొని ఆయన మాట్లాడుతూ కార్మిక హక్కుల కోసం, కార్మికుల సంక్షేమం కోసం తెలంగాణ లేబర్ యూనియన్ ఏర్పడింది. కార్మిక చట్టాలను అమలు చేయాలని తెలంగాణ లేబర్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు కుతాడి శివరాజ్ డిమాండ్ చేశారు. రాష్ట్రంలో కార్మిక చట్టాలు అమలు అయ్యేదాకా పోరాటం చేస్తామని కుతాడి శివరాజ్ అన్నారు. రాష్ట్రంలోవలస కార్మికులు రావడం వల్ల , స్థానిక కార్మికులకు ఉపాధి కరువైందని ఆవేదన వ్యక్తం చేశారు. ఎక్కడ చూసినా వలస వచ్చిన కార్మికులు రాష్ట్రంలో ఉన్నారని, స్థానికులకు ఉపాధి లేకుండా చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం కార్మిక చట్టాలను చిత్తు కాగితం లాగా మార్చిందని ఆరోపించారు. రాష్ట్రంలో కార్మిక చట్టాలు అమలు అయ్యేదాకా తెలంగాణ లేబర్ యూనియన్ పోరాటం చేస్తుందని రాష్ట్ర అధ్యక్షులు కుతాడి శివరాజ్ అన్నారు. కార్మిక సంక్షేమే ధ్యేయంగా,కార్మిక హక్కుల కోసం తెలంగాణ లేబర్ యూనియన్ నిరంతరం పోరాటం చేస్తుందన్నారు. ప్రతి కార్మికునికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందాలని రాష్ట్ర అధ్యక్షులు శివరాత్రి అన్నారు.ఈ కార్యక్రమంలో తెలంగాణ లేబర్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు మొగురం మీరియా,కరీంనగర్ జిల్లా అధ్యక్షులు కాశిపాక అజయ్, మంచిర్యాల జిల్లా అధ్యక్షులు కారుకూరి శ్రీనివాస్, పి.డి.ఎస్.యు రాష్ట్ర నాయకులు,మంచిర్యాల జిల్లా మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు జగ్గబుంల లలిత. గందే కొమురయ్య ముదిరాజ్,చిప్పకుర్తి లలిత,పెర్క కౌశల్యా. తదితరులు పాల్గొన్నారు.

# ఆకట్టుకున్న ఆదర్శ సైన్స్ ఎక్స్ పో -2025



**భూపాలపల్లి/కాటారం/ఫిబ్రవరి - 28:(ది క్రైమ్ న్యూస్):** కాటారం మండల కేంద్రంలోని ఆదర్శ హైస్కూల్ లో శుక్రవారం నిర్వహించిన సైన్స్ ఎక్స్ పో -2025 ఆకట్టుకుంది. జాతీయ సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకొని ప్రఖ్యాత శాస్త్రజ్ఞుడు సివి రామన్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు.. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన నూతన ఆవిష్కరణలు, సైన్స్ ఎగ్జిబిట్లు , సాంస్కృతిక ప్రదర్శనలు పలువురిని ఆకట్టుకున్నాయి. అనంతరం విద్యార్థులు విజ్ఞానాన్ని పెంచుకో భవిష్యత్తును తీర్చిదిద్దుకో.. జాతీయ సైన్స్ దినోత్సవం వర్ధిల్లాలి వంటి నినాదాలతో కూడిన ప్లకార్డులను ప్రదర్శించారు. ఈ సందర్భంగా చైర్మన్ కరుణాకర్ రావు మాట్లాడుతూ విద్యార్థి స్థాయి నుండే ప్రతి ఒక్కరూ శాస్త్రీయ దృక్పథాన్ని అలవర్చుకోవాలన్నారు. శాస్త్ర సాంకేతిక విజ్ఞానాన్ని మంచి పనులకు వినియోగించాలన్నారు. ఈ కార్యక్రమంలో కరస్పాండెంట్ జనగామ కార్తీక్ రావు, ప్రిన్సిపాల్ జనగామ కృషిత, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# వేసవికాలం దృష్ట్యా ప్రజలకు తగు సూచనలు అందించాలి

**- డిప్యూటీ డీఎంహెచ్వో రవి సింగ్**



**ముత్తారం.ఫిబ్రవరి.28.(ది క్రైమ్ న్యూస్):** ముత్తారం మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని డిప్యూటీ డిఎంహెచ్ఓ శుక్రవారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆరోగ్య కేంద్రంలో అందుతున్న వైద్య సేవల గురించి అడిగి తెలుసుకున్నారు. రోగులకు ఏమైనా ఇబ్బందులు ఉన్నాయా అని ఆరా తీశారు.గ్రామాలలో ప్రజలు వేసవి కాలంలో డీహైడ్రేషన్కు గురి కాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సూచనలు చేయాలని అన్నారు. ఆయన వెంట మండల వైద్యాధికారి డాక్టర్ అమరేందర్ రావు, హెల్త్ అసిస్టెంట్ ఎం శ్రీనివాస్,ఎంఎల్ హెచ్ పిలు దీప్తి, లావణ్య పాల్గొన్నారు.

## భవన నిర్మాణ కార్మిక సంఘం మహా సభ

**- జిల్లా సహాయ కార్యదర్శి మల్లారపు నర్సయ్య**



**పెగడపల్లి, ఫిబ్రవరి,28 (ది క్రైమ్ న్యూస్):** ఏఐటియుసి అనుబంధ సంఘం టీఎస్ బిల్డింగ్ కన్స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ఫిబ్రవరి 25 న జగిత్యాల జిల్లా కేంద్రంలో మహా సభా నిర్వహించారు. అదే రోజున పెగడపల్లి మండలానికి చెందిన భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శిగా మల్లారపు నరసయ్యను ఎన్నుకోవటం జరిగింది. జిల్లా కార్యవర్గ సభ్యులుగా సుంకే ప్రకాష్ ఆత్మకూర్ రాజేష్ జిల్లా కౌన్సిల్ సభ్యులుగా మచ్చ అంజయ్య ఎన్నికయ్యారని ఏఐటియుసి జిల్లా ఉపాధ్యక్షులు ఇరుగురాల భూమేశ్వర్ ఒక ప్రకటనలో తెలిపారు వీరి ఎన్నిక పట్ల శనిగరపు ప్రవీణ్ ఏఐటీయూసీ మండల కన్వీనర్ రాచర్ల సురేష్ సిగిరి రాజ్ కుమార్ లింగంపల్లి కొమురయ్య కొత్తపెల్లి సత్యం హర్షం వ్యక్తం చేశారు.

# విస్తృత స్థాయి కార్యవర్గ సమావేశంలో పాల్గొన్న నగర కాంగ్రెస్ సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి



**కరీంనగర్ టౌన్, ఫిబ్రవరి28(ది క్రైమ్ న్యూస్):** హైదరాబాద్ గాంధీ భవన్లో నూతన ఏఐసిసి ఇంచార్జిగా విచ్చేసిన మీనాక్షి నటరాజన్స్వాగతంపరిచయ కార్యక్రమం, తెలంగాణ కాంగ్రెస్ కమిటీ విస్తృత స్థాయి కార్యవర్గ సమావేశంలో పాల్గొన్న నగర కాంగ్రెస్ అధ్యక్షులు, సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి.

## బీర్ తాగితే ఒంటికి చలువ చేస్తుందా..? కిడ్నీలో రాళ్లు కరుగుతాయా?

ఎండాకాలం వస్తే మద్యం ప్రియులు బీర్లు తెగ సేవిస్తారు. అదెంటి అంటే.. బీర్ తాగితే ఒంటికి చలవు చేస్తుందని చెబుతారు. కానీ ఇది ఎంతమాత్రం కరెక్ట్ కాదంటున్నారు డాక్టర్లు. అందుకు ఎలాంటి శాస్త్రీయమైన ఆధారాలు లేవంటున్నారు. అంతేకాదు బీర్ తాగితే గుండెకు మంచిదనే ప్రచారాన్ని కూడా కొట్టి పారేస్తున్నారు. ఇక బీర్‌ను తలకు పట్టిస్తే.. షాంపులా వాడితే జుట్టు పెరుగుతుందన్నది మరికొందరి వాదన. జుట్టు కుదుళ్ల నుంచే బలంగా ఉండాలి. జుట్టుకు ఏదైనా రాసుకుంటే పెరుగుతుందనే దాన్ని సైన్స్ విశ్వసించదు అంటున్నారు డాక్టర్లు. ఆల్కాహాల్ కొద్ది మొత్తంలో తీసుకుంటే మంచిదని గతంలో పరిశోధనల్లో తేలింది. అయితే వరల్డ్ హెల్త్ ఆర్గనైజేషన్.. జనవరిలో విడుదల చేసిన రిపోర్ట్ ప్రకారం.. ఎంత మొత్తంలో ఆల్కాహాల్ తీసుకున్నా కూడా అది ఆరోగ్యానికి చేటే అని వెల్లడించింది. ఆల్కాహాల్ సేవనం పలు రకాల క్యాన్సర్లకు కారణం అవుతుంది. అయితే బీర్ కాకుండా ఇతర రకాల ఆల్కాహాల్ తీసుకునే వారికి లివర్ 5 ఏళ్లలో దెబ్బతింటే, బీర్‌తాగే వారికి 10సంవత్సరాల్లో దెబ్బ తింటుందని కొందరు డాక్టర్స్ చెబుతున్నారు.

విశ్వజ




# మనకొద్దీ మోనోడైట్

బరువు తగ్గాలనుకునేవాళ్లు రకరకాల డైట్ ప్లాన్‌లు ఫాలో అవుతుంటారు. పక్షం రోజులు పని గట్టుకొని కడుపు మాడ్చుకుంటారు. లాభం లేదనుకొని మళ్లీ వెనక్కి తగ్గుతారు. కానీ, వెయిట్ లాస్ కోసం తహతహలాడుతున్న వారికోసం ఇప్పుడు నయా ట్రెండ్ ఒకటి పరిచయమైంది. అదే మోనో డైట్. ఈ విధానంలో రోజంతా గానీ, ఒక భోజనంలో గానీ ఒకే రకమైన ఆహారం తీసుకోవడమే మోనో డైట్ సూత్రం. ఉదాహరణకు ఒక రోజు కేవలం అరటిపళ్లు మాత్రమే ఆరగించాలి. ఇంకోరోజు కేవలం గుడ్డు వెరైటీలపై ఆధారపడాలి. ఇలా చేయడం వల్ల సులువుగా బరువు తగ్గొచ్చని కొందరు చెబుతున్నారు. హాలీవుడ్ నుంచి బాలీవుడ్ వరకు చాలామంది సెలెబ్రిటీలు దీన్ని ఫాలో అవుతున్నారు. ఆ స్టార్లను అభిమానించే వాళ్లు సైతం ఈ విధానానికి జై కొడుతున్నారు. ఈ పద్ధతిలో బరువు తగ్గడం సాధ్యమేనా అంటే.. భిన్న వాదనలు వినిపిస్తున్నాయి. కీడే ఎక్కువ.. మొదట్లో బరువు తగ్గినట్టు అనిపించినా, మోనోడైట్ వల్ల నష్టాలే ఎక్కువ అంటున్నారు పోషకాహార నిపుణులు. 'ఈ డైట్ వల్ల శరీరానికి కావాల్సిన అన్ని పోషకాలూ అందవు. ఫలితంగా దీర్ఘకాలంలో పలు ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయి' అని హెచ్చరిస్తున్నారు. అంతేకాదు, మోనోడైట్ వల్ల శరీర మెటబాలిజం మందగిస్తుంది. సరైన ప్రొటీన్లు, ఫైబర్ లేని ఆహారం వల్ల కండరాల శక్తి తగ్గుతుంది. బరువు తగ్గడం మాట అటుంచితే.. జీవక్రియలు పట్టు తప్పే ప్రమాదం ఉందంటున్నారు. పైగా, ఈ తరహా డైట్‌ను మొదట్లో ఉత్సాహంగా పాటించినా.. పోనుపోనూ బోర్ కొట్టేస్తుంది. ఇలాంటి షరతులతో కూడిన డైట్ దీర్ఘకాలం కొనసాగించడం సాధ్యం కాదంటున్నారు నిపుణులు. మొండిగా పాటించినా.. మోనోడైట్ వల్ల ప్రయోజనాల కన్నా దుష్పరిణామాలే ఎక్కువని వాళ్లు తేల్చి చెబుతున్నారు. కొవ్వు కరగదు కొన్ని రోజులపాటు ఈ డైట్ ఫాలో అయితే బరువు తగ్గినట్టు అనిపించవచ్చు. కానీ, ఇది ఎక్కువగా శరీరంలో నీటిని తగ్గిస్తుందే కానీ, కొవ్వును కరిగించదని నిపుణులు చెబుతున్నారు. మళ్లీ రెగ్యులర్ డైట్‌కు మళ్లినప్పుడు మరింత బరువు పెరిగే ప్రమాదం ఉంటుందని అంటున్నారు. కాబట్టి, ఆరోగ్యకరమైన ఆహారం తీసుకుంటూ, తగినంత శారీరక శ్రమ చేస్తుంటే.. క్రమపద్ధతిలో బరువు తగ్గే అవకాశం ఉంటుంది. అందువల్ల, మోనోడైట్‌కు బదులుగా పోషకాలన్నీ సమతులంగా ఉండే ఆహారం తీసుకుంటేనే మేలు.


# పేరెంటింగ్..లో రేటింగ్!



పిల్లల పెంపకం.. తల్లిదండ్రుల జీవితంలో అత్యంత ప్రధానమైనది. ఎన్నో సవాళ్లతో కూడుకున్నది. అయితే, నవతరం తల్లిదండ్రులు పేరెంటింగ్ విషయంలో 'లో రేటింగ్' తెచ్చుకుంటున్నారు. ఉరుకులు పరుగుల జీవితంలోపడి.. పిల్లల కోసం సమయాన్ని కేటాయించలేక పోతున్నారు. ఫలితంగా, పిల్లల పెంపకంపై పట్టు కోల్పోతున్నారు. ఈ క్రమంలో కొన్ని సలహాలు, సూచనలు స్వీకరించాల్సిన అవసరం ఉన్నది. 'దేవుడా.. కూతుర్ని ఇవ్వమంటే, క్వొశ్చన్ బ్యాంక్ ఇచ్చావా తండ్రీ?'.. అతడు సినిమాలో డైలాగ్ ఇది. నవతరం నైంటీస్ తల్లిదండ్రుల నోటినుంచి ప్రతినిత్యం వినిపిస్తూనే ఉన్నది. పిల్లలు అడిగే ప్రశ్నలకు జవాబులు చెప్పలేక.. వారిని కసురుకుంటున్నారు కొందరు తల్లిదండ్రులు. ఈ పద్ధతి ఎంతమాత్రం మంచిది కాదు. ముఖ్యంగా, రెండు నుంచి ఆరేళ్ల పిల్లలు తమచుట్టూ ఉన్న ప్రతిదాన్నీ సునిశితంగా పరిశీలిస్తుంటారు. చూసిన ప్రతి ఒక్కదాని గురించీ తెలుసుకోవాలనే కుతూహలంతో ఉంటారు. వారిలో ఉండే ఆలోచనా పద్ధతిని 'మ్యాజికల్ థింకింగ్'గా వ్యవహరిస్తారు. దాని ప్రభావంతోనే.. పిల్లలు ఎక్కువ ప్రశ్నలు వేస్తుంటారు. వాటికి ఓపికగా సమాధానం చెప్పాలి. అప్పుడే.. వారి ఆలోచనా పరిధి మరింత విస్తృతం అవుతుంది. కంప్యూటర్‌లో వీడియో గేమ్స్ ఆడుతూ పెరిగిన నైంటీస్ కిడ్స్.. తమ పిల్లలనూ అదేబాటలో నడిపిస్తున్నారు. ట్యాబ్ కొనివ్వడం.. యూట్యూబ్ ఆన్ చేసి ఇవ్వడం! పాటలు.. పాఠాలూ అన్నీ అందులోనే! ఇలా పిల్లల్ని గ్యాడ్జెట్లకు అలవాటు చేయడం.. వారి ఆరోగ్యంపై దుష్ప్రభావం చూపుతుంది. డిజిటల్ పరికరాలను ఎక్కువగా వాడటం వల్ల.. పిల్లల శారీరక, భావోద్వేగ, సామాజిక అభివృద్ధికి హాని కలుగుతుంది. అందుకే, యూట్యూబ్ పాఠాలకు బదులుగా.. పుస్తకాలు చదివేలా చూడండి. దీనివల్ల వారిలో భాషా నైపుణ్యాలు పెరుగుతాయి. గొప్ప జ్ఞానం, పఠనా శక్తి అలవడుతుంది. ఇక కథలు చెప్పమంటూ పిల్లలు పోరినా.. కొందరు పట్టించుకోరు. సమయం లేదనో.. ఉదయాన్నే ఆఫీస్‌కు వెళ్లాలనో సాకులు చెప్పి తప్పించుకుంటారు. కానీ.. పిల్లలకు కథలు చెప్పడం వల్ల ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయి. నీతికథలు.. వారిని సన్మార్గంవైపు నడిపిస్తాయి. తప్పొప్పుల గురించి అవగాహన కల్పిస్తూ.. జీవితంలో ఎలా నడుచుకోవాలో నేర్పిస్తాయి. మరికొన్ని కథలు.. పిల్లల్లో జిజ్ఞాసను, సృజనాత్మకతను పెంచుతాయి. వారి తెలివితేటలూ పెరుగుతాయి. పిల్లలు వారి తల్లిదండ్రులను చూస్తూ పెరుగుతారు. వారినే అనుకరిస్తారు. వారు ఎలా ఉంటే.. పిల్లలూ అలాగే ఉంటారు. అందుకే.. పిల్లల ముందు ఎక్కువగా ఫోన్ వాడటం మానేయాలి. అప్పుడు వారుకూడా ఫోన్ వాడకాన్ని తగ్గిస్తారు. అలాగే.. ఇంట్లో పెద్దల పట్ల తల్లిదండ్రులు గౌరవంతో వ్యవహరిస్తే.. పిల్లలు కూడా ఇతరులతో గౌరవంగా ప్రవర్తిస్తారు.

# బియ్యం కడిగిన నీళ్ళతో చర్మ సౌందర్యమే కాదు ఆరోగ్యం కూడా..

పారబోయొద్దు! ప్రతిరోజు మనం తప్పనిసరిగా వంట చేసుకుంటాం. దక్షిణాదిన ముఖ్యంగా అన్నం వండుకు తింటాం. ఈ అన్నం వండడానికి ముందుగా బియ్యాన్ని శుభ్రంగా కడిగి ఆ తర్వాత దానిని ఉడికించి తింటాం. అయితే ఈ బియ్యాన్ని శుభ్రం చేయడానికి నీళ్లను పోసి కడిగిన తర్వాత ఆ నీటిని పారబోస్తాము. బియ్యం కడిగిన నీళ్లు నిరుపయోగమని భావిస్తాం. కానీ బియ్యం కడిగిన నీళ్లు ఎంతో ఉపయోగపడేవని వాటిలో ఎన్నో పోషకాలుంటాయని డైటీషియన్లు చెప్తున్నారు. బియ్యం కడిగిన నీళ్ళతో ఆరోగ్య ప్రయోజనాలు అన్నాన్ని వండడానికి ముందు మూడుసార్లు బియ్యాన్ని కడిగి నీటిని పారబోసే వారు ముఖ్యంగా ఈ విషయాలను తెలుసుకోవాలని చెబుతున్నారు. బియ్యం కడిగిన నీళ్ళల్లో మినరల్స్, విటమిన్స్, అమైనో యాసిడ్స్, ప్రోటీన్లు, యాంటీ ఆక్సిడెంట్లు పుష్కలంగా ఉంటాయి. వాటి ఆరోగ్య ప్రయోజనాలు తెలిస్తే పొరపాటున కూడా బియ్యం కడిగిన నీళ్లను పారిపోయరు. %ూశ్రీంశీ =ఝ౦% మేడమ్ మీ నడుము చాలా బాగుంది బియ్యం కడిగిన నీళ్ళతో చర్మ ఆరోగ్యం బియ్యం కడిగిన నీళ్లు మన చర్మ ఆరోగ్యానికి ఎంతగానో దోహదం చేస్తాయి. బియ్యం కడిగిన నీటిలో కాటన్ లేదా శుభ్రమైన గుడ్డను ముంచి ముఖం పైన అప్లై చేయడం వల్ల ముఖం మెరుస్తుంది. ఈ నీటిని స్కిన్ ఫేషియల్ గా కూడా ఉపయోగించవచ్చని చెబుతున్నారు. బియ్యం కడిగిన నీళ్లతో ముఖం కడుక్కుంటే ముఖంపై ఉన్న ముడతలు తగ్గుతాయి. సహజంగా అందం కోసం కొరియన్స్ బియ్యం కడిగిన నీటిని ఎక్కువగా ఉపయోగిస్తారు. బియ్యం కడిగిన నీళ్ళతో జుట్టు ఆరోగ్యం ఇక బియ్యం కడిగిన నీళ్లు మన జుట్టు ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తాయని చెబుతున్నారు. బియ్యం




కడిగిన నీళ్ళల్లో లావెండర్ ఆయిల్ ను కలిపి జుట్టును కడిగినట్లయితే మన జుట్టు బలోపేతం అవుతుంది. జుట్టు ఒత్తుగా పెరగడం మాత్రమే కాకుండా విపరీతంగా జుట్టు రాలడం కూడా తగ్గుతుంది. బియ్యం కడిగిన నీళ్లలో ఉండే పోషకాల కారణంగా అవి తాగినా మంచే జరుగుతుంది. బియ్యం కడిగిన నీళ్ళతో బరువుకు చెక్ బియ్యం కడిగిన నీటిని తాగడం వల్ల కడుపులో మంట, విరోచనాలు వంటి సమస్యలు తగ్గుతాయి. ఈ నీటిలో కాస్త ఉప్పు, కాస్త నెయ్యి, కొంచెం మిరియాలపొడి కలుపుకొని తాగితే జీర్ణశక్తి మెరుగవుతుంది. బియ్యం కడిగిన నీళ్లను తాగడం వల్ల బరువు తగ్గడానికి కూడా ఉపయోగపడుతుంది. ఇది గుండె ఆరోగ్యానికి మంచి చేస్తాయి. మన శరీరంలో చెడు కొలెస్ట్రాల్ ను తగ్గించడానికి ఎంతగానో ఉపయోగపడతాయి. ఇన్ని ప్రయోజనాలను చేకూర్చే రైస్ వాటర్ ను పారబోస్తే నష్టం జరిగేది మనకే..

# మార్కెట్

## సెబీ కొత్త చీఫ్‌గా తుహిన్ కాంత పాండే నియామకం

%ూజుదీ× ఎష్ట్రఅవట% ఎ స్టాక్ మార్కెట్ల నియంత్రణ సంస్థ 'సెబీ' నూతన సారథిగా (%ూజుదీ× ఎష్ట్రఅవట%) తుహిన్ కాంత పాండే (%ఐబష్ట్రఱఅ ఖుఱ్ఖు ూఖఅంవఎ%) నియమితులయ్యారు. ప్రస్తుతం ఆర్థిక శాఖ కార్యదర్శిగా (%=వజవఅబవ ూవషతీమ్ఖుతీఎ%) పని చేస్తున్న ఆయనకు సెబీ చీఫ్ బాధ్యతలు అప్పగిస్తూ కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. కేంద్ర నియామకాల కమిటీ గురువారం ఇందుకు ఆమోదం తెలిపింది. కాగా, ప్రస్తుతం సెబీ చీఫ్‌గా ఉన్న మాధాబీ పురీ బుచ్ (%మీఝంష్ఝుఎఱ ూబతీఱ దీబఎష్ట్ర%) మూడేళ్ల పదవీ కాలం నేటితో (ఫిబ్రవరి 28తో) ముగియనుంది. ఈ నేపథ్యంలో తుహిన్ కాంత పాండేను సెబీ కొత్త చీఫ్‌గా ప్రభుత్వం నియమించింది. తుహిన్ కాంత పాండే 1987 బ్యాచ్ సీనియర్ ఐఏఎస్ అధికారి. ఆయన గతంలో ఆర్థిక కార్యదర్శిగా, రెవెన్యూ కార్యదర్శిగా పనిచేశారు. ఎయిరిండియా ప్రైవేటీకరణలో పాండే కీలక పాత్ర పోషించారు. తుహిన్ కాంత పాండేకు ఫైనాన్స్, పబ్లిక్ ఎంటర్‌ప్రైజెస్‌లో విస్తృత అనుభవం ఉంది. రానున్న మూడేళ్ల పాటు ఆయన ఆ పదవిలో కొనసాగనున్నారు. ఇక ఇప్పటి వరకూ సెబీకి చీఫ్‌గా వ్యవహరించిన మాధాబీ పూరీ బుచ్‌ను కేంద్రం 2022 ఫిబ్రవరి 28న నియమించిన విషయం తెలిసిందే. దీంతో ఆమె అదే ఏడాది మార్చి 2వ తేదీన బాధ్యతలు స్వీకరించారు. సెబీకి ఓ మహిళ ఛైర్మన్‌గా నియామకం కావడం ఇదే తొలిసారి. మాధవి గతంలో ఐసీఐసీఐ సెక్యూరిటీస్ హెడ్‌గా సేవలందించారు. 2017 నుంచి 2021 మధ్య కాలంలో సెబీ పూర్తి స్థాయి మెంబర్‌గా పని చేశారు. సెబీ చీఫ్‌గా ఆమె పదవీ కాలం నేటితో ముగియనుంది.



# భారత్‌పై టారిఫ్‌ల కత్తి!

### కేంద్రానికి ప్రతీకార సుంకాల భయం

### ట్రంప్ ఒత్తిళ్లకు తలొగ్గుతున్న మోదీ సర్కారు

### కార్లు, రసాయన దిగుమతులపై టారిఫ్‌ల కోతకు యోచన




న్యూఢిల్లీ : అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ టారిఫ్ హెచ్చరికలకు కేంద్రంలోని నరేంద్ర మోదీ సర్కారు తలొగ్గినట్టే కనిపిస్తున్నది. తమ దేశ వస్తూత్పత్తులపై అధిక సుంకాలను వేస్తున్న దేశాలకు ప్రతీకార సుంకాలు తప్పవని అగ్రరాజ్య అధ్యక్షుడు ఈమధ్య కాలంలో పదేపదే చెప్తున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలో భారత్‌కూ సుంకాల పోటు ఉంటుందని ఇటీవలి అమెరికా పర్యటనలో ప్రధాని మోదీకి ట్రంప్ నిర్మొహమాటంగా చెప్పిన సంగతీ విదితమే. ఈ నేపథ్యంలోనే కేంద్ర ప్రభుత్వం అప్రమత్తమైనట్టు తెలుస్తున్నది. ఇందులో భాగంగానే అమెరికా నుంచి భారత్‌కు వస్తున్న వివిధ రకాల దిగుమతులపై ప్రస్తుతం విధిస్తున్న సుంకాలను తగ్గించేందుకున్న అవకాశాలను అన్వేషిస్తున్నట్టు సంబంధిత అధికార వర్గాలు చెప్తున్నాయి. కార్లు, మోటర్‌సైకిళ్లు తదితర ఆటోమొబైల్స్, వ్యవసాయ ఉత్పత్తులు, రసాయనాలు, కీలక ఔషధాలు, కొన్ని వైద్య పరికరాలు, ఎలక్ట్రానిక్స్, విస్కీసహా మరికొన్నింటిపై వసూలు చేస్తున్న సుంకాలను తగ్గించే వీలుందంటున్నారు. తద్వారా అమెరికా అధిక సుంకాల నుంచి తప్పించుకోవచ్చన్న అభిప్రాయాలను వారు వ్యక్తం చేస్తున్నారు.

నిజానికి కేంద్ర ప్రభుత్వం.. అమెరికా సుంకాలను తప్పించుకోవడానికి ఇప్పటికే నిర్దేశించుకున్న సుంకాల కోత కంటే ఇంకా ఎక్కువగానే టారిఫ్‌లను తగ్గించాల్సి రావచ్చన్న అంచనాలను వారు వెలిబుచ్చుతుండటం గమనార్హం. దీంతో చాలారకాల వస్తు, సేవల దిగుమతులపై పెద్ద ఎత్తునే సుంకాలు తగ్గవచ్చని చెప్తున్నారు. అమెరికాతో మైత్రి.. ప్రస్తుతం అమెరికా సుంకాల హెచ్చరికలు.. యావత్తు ప్రపంచ వాణిజ్యాన్నే వణికిస్తున్నాయి. ఇప్పటికే స్టాక్, కరెన్సీ, కమోడిటీ మార్కెట్లపై ఆ ప్రభావం కనిపిస్తున్నది చూస్తూనే ఉన్నాం. ఈ క్రమంలో ఆయా దేశాలతోపాటు భారత్ సైతం అమెరికాతో స్నేహపూర్వక వాతావరణానికి ప్రయత్నిస్తున్నది. ముఖ్యంగా చైనాతో వాణిజ్య యుద్ధానికి ట్రంప్ కాలుదువ్వుతున్న నేపథ్యంలో అంతర్జాతీయ మార్కెట్‌లో ఉన్న అవకాశాలను భారత్ అందిపుచ్చుకునేందుకు చొరవ చూపాలని మెజారిటీ ఆర్థిక నిపుణులు సలహా ఇస్తున్నారు. నిజానికి గ్లోబల్ మార్కెట్‌లో చైనాకు చెక్ పెట్టాలంటే భారత్‌ను ప్రోత్సహించడమే మార్గమని అమెరికా సైతం భావిస్తున్నది. దీంతో అమెరికాతో ద్వైపాక్షిక వాణిజ్యం బలోపేతంపై కేంద్ర ప్రభుత్వం దృష్టి సారిస్తున్నది. మరోవైపు భారత్‌కు రక్షణపరమైన ఎగుమతుల్ని పెంచాలని అమెరికా చూస్తున్నది. అయితే ఇప్పుడు రష్యా నుంచే ఎక్కువగా ఇక్కడికి వస్తున్నాయి. ఫలితంగా రష్యాతో సంబంధాలు చెడకుండా ట్రంప్ మెప్పును పొందే పనిలో మోదీ సర్కారున్నట్టు చెప్తున్నారు. ఇక 2030 నాటికి ఇరు దేశాల వాణిజ్యం 500 బిలియన్ డాలర్లకు చేరాలని అటు అమెరికా, ఇటు భారత్ లక్ష్యంగా పెట్టుకున్నాయి. 2023లో ఇది 127 బిలియన్ డాలర్లే. మెక్సికో, కెనడాలపై టారిఫ్‌లు? పొరుగు దేశాలైన మెక్సికో, కెనడాలపై టారిఫ్‌లను మంగళవారం నుంచి విధించాలని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ భావిస్తున్నట్టు సమాచారం. అలాగే చైనా నుంచి వచ్చే దిగుమతులపై 10 శాతం యూనివర్సల్ టారిఫ్‌ను రెట్టింపు చేయాలని కూడా చూస్తున్నట్టు తెలుస్తున్నది. కాగా, అమెరికాలోకి ఎంతమాత్రం ఉపేక్షించని విధంగా మనుషుల అక్రమ రవాణా, ఔషధాల స్మగ్లింగ్ జరుగుతున్నదని, వీటికి అడ్డుకట్ట వేసేందుకు అధిక సుంకాలు ఒక్కటే మార్గమని ట్రంప్ అనుకుంటున్నారు.

# రాజధానిని పట్టాలకు ఎక్కిస్తున్నాం

**అమరావతి నిర్మాణానికి రూ.6 వేల కోట్లు**

**రాష్ట్రాభివృద్ధికి గ్రోత్ ఇంజనులా రాజధాని**

**తొలిసారిగా తెలుగు భాషాభివృద్ధికి రూ.10 కోట్లు**

**బడ్జెట్ ప్రసంగంలో మంత్రి పయ్యావుల కేశవ్**



అమరావతి : ఎన్నికల హామీల అమలుకు తాము కట్టుబడి ఉన్నామని ఏపీ ప్రభుత్వం తాజా బ్జడెట్ ద్వారా స్పష్టం చేసింది. సూపర్ సిక్స్, మేనిఫెస్టో హామీలు, అభివృద్ధి పనులకు ఎక్కువ కేటాయింపులు జరపడంతో 2025-56 ఏపీ బడ్జెట్ తొలిసారిగా రూ.3 లక్షల మార్కును దాటింది. సభలో ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ బడ్జెట్ ప్రవేశ పెట్టారు. రాజధానిని పట్టాలెక్కిస్తున్నామని చెప్పిన ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్.. ఈ బడ్జెట్ అమరావతి నిర్మాణానికి రూ.6 వేల కోట్లు కేటాయించారు. సంక్షేమానికి పెద్ద పీట వేస్తూ పలు పథకాలకు కార్యక్రమాలకు భారీ కేటాయింపులు జరిపారు. తొలిసారిగా తెలుగు భాషాభివృద్ధికి కూడా నిధులు కేటాయించారు. ఏకంగా రూ.10 కోట్ల నిధులు కేటాయించామని వెల్లడించారు. సంక్షేమానికి, వివిధ అభివృద్ధి పథకాలకు ఈసారి కూటమి ప్రభుత్వం పెద్ద పీట వేసింది. డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ మార్గదర్శకత్వంలో ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపరచాలనే లక్ష్యంతో గ్రామీణాభివృద్ధిలో ముందడుగు వేస్తున్నామని అన్నారు. రాజధాని పనులు త్వరలో ప్రారంభం కాబోతున్నాయని, రాష్ట్రాభివృద్ధికి గ్రోత్ ఇంజనులా రాజధాని అమరావతిని అభివృద్ధి చేస్తున్నామని పేర్కొన్నారు. గతేడాది రూ. 2.94. లక్షల కోట్లతో వార్షిక బ్జడెట్ ప్రవేశపెట్టగా ఈసారి బ్జడెట్ రూ.3 లక్షల 22 వేల 359 కోట్లకు చేరింది. వ్యవసాయ రంగానికి భారీగా కేటాయింపులు పెరిగాయి. అన్నదాతల కోసం కూటమి ప్రభుత్వం ఈసారి రూ.48,340 కోట్లను కేటాయించింది. గతేడాది బడ్జెట్ రూ. 43,402.33 కాగా ఈసారి కేటాయింపులు భారీ స్థాయిల పెరిగాయి. ఈసారి ద్రవ్యలోటు రూ.79,926 కోట్లు ఉండొచ్చని అంచాన వేసింది. ఎన్టీఆర్ వైద్య భరోసాకు రూ.31,613 కోట్లు కేటాయించారు. తల్లికి వందనం కోసం రూ.9,407 కోట్లు, బీసీ సంక్షేమానికి రూ.23,260 కోట్లు, వైద్యారోగ్య శాఖకు రూ.19,260 కోట్లు కేటాయించారు. గత బడ్జెట్‌లో పంచాయితీరాజ్, గ్రామీణాభివృద్ధికి రూ.16,739 కోట్లు కేటాయించగా ఈసారి కేటాయింపులు రూ.18,848 కోట్లకు చేరాయి. మూల ధన అంచనా వ్యక్తం రూ.32,712 కోట్లు నుంచి రూ.40,635 కోట్లకు పెరిగింది. జలవనరుల అభివృద్ధి బడ్జెట్ రూ.16,705 కోట్ల నుంచి రూ.18,020 కోట్లకు పెరిగింది. పాఠశాల విద్యకు గతంలో రూ. 29,909కోట్లు ఈసారి కేటాయింపులు రూ.31,806 కోట్లకు చేరాయి. గత బడ్జెలో పరిశ్రమలు వాణిజ్యం రూ. 3,127కోట్లు కాగా ఈసారి రూ.3,156 కోట్లు కేటాయించారు. యువజన, సాంస్కృతిక శాఖకు గతంలో 322కోట్లు కాగా ఈమారు రూ.469 కోట్లకు పెంచారు. పోలవరానికి రూ.6,705 కోట్లు కేటాయించారు. బీసీ సంక్షేమానికి గత బ్జడెట్‌లో రూ.39007 కోట్లు కేటాయించగా ఈసారి నిధులను రూ.47,456 కోట్లకు పెంచారు. ఎస్సీ, ఎస్టీ సంక్షేమానికి వరుసగా గతంలో రూ.18497 కోట్లు, రూ.7557 కోట్లు కేటాయించగా ఈసారి కేటాయింపులు ఎస్సీలకు రూ.20,281 కోట్లు, ఎస్టీ సంక్షేహానికి రూ.8,159 కోట్లకు చేరాయి. ప్రకృతి సేద్యం ప్రోత్సాహానికి రూ.62 కోట్లు, ఇరిగేషన్ ప్రాజెక్టులకు రూ. 11,314 కోట్లు, మత్స్యకార భరోసాకు రూ.450 కోట్లను కూటమి ప్రభుత్వం కేటాయించింది. ఆదరణ పథకం కోసం రూ.1000 కోట్లు, మనబడి పథకం కోసం రూ.3,486 కోట్లు, తల్లికి వందనం కోసం రూ.9,407 కోట్లు, దీపం 2.0 పథకానికి రూ.2,601 కోట్లు కేటాయించింది. రాష్ట్ర ప్రగతికి పరుగులు పెట్టించేలా వివిధ విధాన నిర్ణయాలు ఉన్నాయని బ్జడెట్ ప్రసంగంలో పేర్కొన్నారు. వైసీపీ ప్రభుత్వం అప్పులనే కాదు.. చెత్తను వారసత్వంగా ఇచ్చిందని అన్నారు. చెత్త పన్ను వేయడమే కాకుండా.. 83 లక్షల మెట్రిక్ టన్నుల చెత్తను ఎత్తకుండానే వైసీపీ ప్రభుత్వం వెళ్లిపోయిందని వ్యాఖ్యానించారు. తెలుగు భాషాభివృద్ధికి రూ. 10 కోట్లు కేటాయింపులు చేపట్టిన విషయాన్ని వెల్లడించారు. కాలుష్య రహిత ఆంధ్రగా తీర్చిదిద్దేలా ప్రణాళికలు చేపడుతున్నట్టు తెలిపారు. రాష్ట్రంలో 50 శాతం పచ్చదనం పెంచేలా చర్యలు చేపడుతున్నట్టు తెలిపారు.

## వృద్ధులను కూడా వదలని అత్యాచారనిందతుడు

**ట్యాక్సీలో తీసుకెళ్లి నగలు, నగదు లాక్కోవడం అలవాటు**

పుణె : ఒంటరి వృద్ధులను టార్‌ఎట్ చేసి వారివద్ద ఉన్న నగదు, నగలను బెదరించి లాక్కోవడంలోనూ అత్యారా నిందితుడు సిద్ధహస్తుడని తేలింది. నగలతో కనిపించిన పలువురు వృద్ధులను తన ట్యాక్సీలో ఎక్కించుకొని, నిర్జన ప్రదేశానికి తీసుకెళ్లి వారిని బెదిరించి.. దోపిడీలకు పాల్పడేవాడని పోలీసులు తెలిపారు.పుణెలోని స్వర్‌గేటు బస్టాండ్ వద్ద 26 ఏళ్ల యువతిపై బస్సులో అత్యాచారానికి పాల్పడిన ఘటనలో మహారాష్ట్ర పోలీసులు నిందితుడు రామ్‌దాస్‌ను పట్టుకున్నారు. ఈక్రమంలో నిందితుడి గురించి కీలక విషయాలు వెల్లడవుతున్నాయి. నిందితుడు నేర స్వభావం కలవాడని.. పలు చోరీలకు పాల్పడ్డాడని పోలీసులు పేర్కొన్నారు. 2019లో ఓ ట్యాక్సీ కొనుగోలు చేసినప్పటినుంచి పుణె-అహల్యనగర్ మార్గంలో తిప్పుతున్నట్లు విచారణలో తేలిందని అన్నారు. అప్పటినుంచి అతడు నిందితుడిపై దొంగతనం, దోపిడీ, చైన్‌స్నాచింగ్ మొదలైన పలు కేసులు ఉన్నట్లు గుర్తించామన్నారు. 2019లో ఓ నేరం కేసులో జైలు శిక్ష అనుభవించి.. ప్రస్తుతం బెయిల్‌పై బయట ఉన్నట్లు తెలిపారు. అంతేకాకుండా అతడు తరచూ స్వర్‌గేటు బస్టాండ్ వద్ద తిరుగుతూ.. అక్కడికి వచ్చిన ప్రయాణికులకు తనను తాను పోలీస్‌గా పరిచయం చేసుకునేవాడని అన్నారు. యువతిపై అత్యాచారానికి ముందు కూడా నిందితుడు ఇన్‌షర్ట్ వేసుకొని.. చాలా నీట్‌గా రెడీ అయ్యాడని, ఆమెకు కూడా తనను పోలీసుగా పరిచయం చేసుకొని, అక్క అని సంభోదిస్తూ నమ్మించాడని పేర్కొన్నారు. పుణెలోని స్వర్‌గేట్ ప్రాతంలోని బస్‌స్టాప్ వద్ద మంగళవారం ఉదయం 6 గంటల ప్రాంతంలో స్వగ్రామానికి వెళ్లేందుకు బస్‌స్టేషన్‌కు చేరుకున్న యువతిని తన గ్రామానికి చెందిన బస్సు మరోచోట ఉందని నిందితుడు రామ్‌దాస్ నమ్మించాడు. అనంతరం కొద్ది దూరంలో ఉన్న బస్సులోకి తీసుకెళ్లి అత్యాచారానికి పాల్పడ్డాడు. ఈ ఘటనపై రాష్ట్రవ్యాప్తంగా పెద్దఎత్తున నిరసనలు చెలరేగాయి. పోలీసులు 75 గంటల పాటు శ్రమించి పరారీలో ఉన్న నిందితుడిని పట్టుకొన్నారు.

## యూటీఎస్ ద్వారా టికెట్ తీసుకుంటే 3శాతం క్యాష్‌బ్యాక్

**అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలంటున్న అధికారులు**

హైదరాబాద్ : రైల్వే ప్రయాణికులకు అన్‌రిజర్వ్‌డ్ టికెటింగ్ సిస్టం(యూటీఎస్) యాప్ ద్వారా టికెట్లు తీసుకుంటే 3 శాతం క్యాష్ బ్యాక్ వంటి సేవలు కల్పించింది దక్షిణ మధ్య రైల్వే. వినియోగదారుడికి అనుకూలమైన డిజిటల్ పద్ధతులను ప్రవేశపెట్టడంతో ప్రయాణికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఊరెళ్లేందుకు రైల్వే స్టేషన్‌కు రావడం బుకింగ్ కౌంటర్ వద్ద రద్దీ ఉండడం చూసిన కొందరు ఏటీవీఎం (ఆటోమెటిక్ టికెట్ వెండింగ్ మిషిన్)లను ఆశ్రయిస్తున్నారు. దక్షిణ మధ్య రైల్వే ప్రయాణికులు ఇబ్బందులు పడకుండా ఉండేందుకు 2016లో హైదరాబాద్ జంట నగరాల్లో 26 సబర్బన్ స్టేషన్‌లలో జోన్ వారీగా యూటీఎస్ మొబైల్ అప్లికేషన్‌ను ప్రశేపెట్టింది. 2018 జూలైలో రైల్వేలోని అన్ని స్టేషన్లను యూటీఎస్ కవర్ చేస్తూ ప్లాట్ ఫాం ప్రయాణ టికెట్లు బుకింగ్ కోసం అన్ని నాన్-సబర్బన్ స్టేషన్లకు ఈ సౌకర్యం విస్తరించబడింది. ఆధునిక టికెట్ వ్యవస్థలో యూటీఎస్ యాప్ ప్రయాణికులకు సులువుగా మారింది. రైల్వేలో రిజర్వ్ చేయని టికెట్లపై ప్రయాణించే వారికి ఇదోక వరమని చెప్పవచ్చు. డిజిటల్ ఇండియా విధానానికి అనుగునంగా ఈ యాప్ నగదు రహిత లావాదేవీలను అనుమతిస్తుంది. అదే విధంగా ప్రయాణికులకు సులువుగా ఉండేందుకు ఆర్-వాలెట్, పేటీఎం, ఫోన్‌పే, గూగుల్‌పే, లేదంటే ఇంటర్నెంట్ బ్యాకింగ్ వంటి డిజిటల్ మోడ్‌ల ద్వారా చెల్లించేందుకు వెసులుబాటు కల్పించారు. ప్రయాణికులకు ఇష్టం ఉంటే రూ. 20 వేల వరకు డిపాజిట్ చేసుకునే విధంగా సౌకర్యాల్ని కల్పించారు. ఆర్ వాలెట్ ద్వారా టికెట్లు కొనుగోలు చేసుకునే ప్రయాణికులకు రైల్వే యంత్రాంగం 3 శాతం క్యాష్ బ్యాక్ ఇస్తున్నారు. ఆన్‌లైన్ టికెట్ల కొనుగోలు విషయంలో రోజు రోజుకు విక్రయాలు క్రమంగా పెరుగుతున్నాయి. యూటీఎస్ యాప్ ద్వారా 2023-24లో ఏప్రిల్ నుంచి జనవరి వరకు ఒక రోజులో 83.510 మంది ప్రయాణికులు సేవలు వినియోగించుకున్నారు. 2024-25 ఏడాదిలో ప్రతి రోజుకు 93,487 ప్రయాణికులు ఆన్‌లైన్ సేవలు వినియోగించుకున్న క్రమంలో 12 శాతం పెరిగిందని రైల్వే అధికారులు ప్రకటించారు. స్మార్ట్‌ఫోన్ ఉన్న వారు దాదాపు రైలు ప్రయాణం కోసం ఇంటి నుంచే ఆన్‌లైన్ సేవలు వినియోగించుకుంటున్నారు. స్మార్ట్‌ఫోన్‌లో యూటీఎస్ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని టికెట్ కొనుకుని సులువుగా రైలు ప్రయాణం చేయవచ్చు. లేదంటే ప్రయాణికులు నేరుగా బుకింగ్ కౌంటర్ వద్దకు వచ్చి కౌంటర్ల వద్ద యూటీఎస్ క్యూ ఆర్ కోడ్‌ను వినియోగించుకోవచ్చు.

## నాగర్‌కర్నూల్‌లో బీఆర్ఎస్, కాంగ్రెస్ కార్యకర్తల మధ్య ఘర్షణ

నాగర్‌కర్నూల్ : నాగర్‌కర్నూల్ జిల్లా పెద్దకొత్తపల్లి మండలంలో మంత్రి జూపల్లి కృష్ణారావు అనుచరులు వీరంగం సృష్టించారు. మండలంలోని సాతాపూర్‌లో ఫ్లెక్సీలు కడుతున్న బీఆర్ఎస్ కార్యకర్తలపై కాంగ్రెస్ కార్యకర్తలు దాడికిపాల్పడ్డారు. బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత శుక్రవారం కొల్లాపూర్‌లో పర్యటించనున్న ఈ సందర్భంగా పెద్దకొత్తపల్లి మండలంలోని సాతాపూర్‌లో బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు ఫ్లెక్సీలు ఏర్పాటు చేస్తున్నారు. ఎమ్మెల్యే జూపల్లి కృష్ణారావు అనుచరులు వారిని అడ్డుకున్నారు. ఈ క్రమంలో ఇరువర్గాల మధ్య వాగ్వాదం చోటుచేసుకున్నది. దీంతో బీఆర్ఎస్ నాయకుడు, కొల్లాపూర్ మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ గుజ్జుల పరమేశ్‌పై దాడికి పాల్పడ్డారు. తీవ్రంగా గాయపడిన అతడిని దవాఖానాకు తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం శుక్రవారం రాత్రి డిశ్చార్జ్ అయ్యారు. పరమేశ్‌ను ఎమ్మెల్సీ కవిత పరామర్శించారు. తమ పార్టీ కార్యకర్తల జోలికి వస్తే సహించేది లేదని హెచ్చరించారు. దాడి సమయంలో పోలీసులు అక్కడే ఉన్నప్పటికీ చోద్యం చూస్తూ ఉండిపోయారని ఆరోపించారు.

## రాష్ట్రాభివృద్ధికి వ్యవసాయమే ఆధారం

**రూ. 48,340 కోట్లతో వ్యవసాయ బడ్జెట్**

**వ్యవసాయ, అనుబంధ రంగాలకు రూ.13,487 కోట్లు**

**వ్యవసాయ బడ్జెట్ ప్రవేశ పెట్టిన మంత్రి అచ్చన్నాయుడు**

అమరావతి : ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం శుక్రవారం నాడు అసెంబ్లీలో వ్యవసాయ బడ్జెట్ ప్రవేశపెట్టింది. రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు దీనిని సభలో ప్రవేశపెట్టారు. ఇందులో రైతులకు శుభవార్త చెప్పారు. మొత్తం రూ. 48,340 కోట్లతో వ్యవసాయ బడ్జెట్ ప్రవేశపెట్టిన ప్రభుత్వం.. ఆయా రంగాలకు భారీగా కేటాయింపులు చేసింది. వ్యవసాయ, అనుబంధ రంగాలకు రూ.13,487 కోట్లు కేటాయించారు. దేశం, రాష్ట్రం అభివృద్ధికి వ్యవసాయమే ఆధారమని మంత్రి అచ్చెన్న పేర్కొన్నారు. వికసిత్ భారత్‌కు అనుసంధానంగా ఏపీ పురోభివృద్ధి ఉంటుందన్నారు. సాంకేతికతతో సాగు ఖర్చులు తగ్గించాలనేదే లక్ష్యంగా చెప్పారు. దేశం, రాష్ట్రం అభివృద్ధికి దోహదపడేది వ్యవసాయ రంగమని మంత్రి అచ్చెన్నాయుడు అన్నారు.ప్రధాన వనరైన వ్యవసాయాన్ని ప్రాథమిక రంగంగా గుర్తించామని మంత్రి ఈ సందర్భంగా తెలిపారు. రైతులను స్థితిమంతులుగా చూడాలని ఆకాంక్షిస్తూ స్వర్ణాంధ్ర-2047 లక్ష్యాన్ని సాధించే దిశగా అడుగులు వేస్తున్నట్లు చెప్పారు. వికసిత్ భారత్ 2047కు అనుసంధానంగా ఏపీని ప్రగతిపథంలో ముందుకు తీసుకెళ్తామని చెప్పారు. 2047 నాటికి 2.4 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా రాష్ట్రాన్ని మార్చాలని లక్ష్యంగా పెట్టుకున్నామని మంత్రి వెల్లడించారు.గత ప్రభుత్వం బకాయి పెట్టిన రూ.120 కోట్ల విత్తన రాయితీ చెల్లించామని అసెంబ్లీ వేదికగా మంత్రి ప్రకటించారు. 35.8 లక్షల మెట్రిక్ టన్నుల ఎరువు సరఫరా చేశామన్నారు. వ్యవసాయ రంగంలో తొలిసారి డ్రోన్‌ల వినియోగం చేపట్టామని మంత్రి అచ్చెన్న తెలిపారు. ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. భూమి ఉన్న రైతుకు గుర్తింపు సంఖ్య ఇస్తున్నామని.. అర్హులైన కౌలు రైతులకు హక్కు కార్డులు మంజూరు చేస్తామని మంత్రి చెప్పారు. ఎరువులు, ప్రకృతి వ్యవసాయం, వ్యవసాయ యంత్రాల రాయితీ, డ్రోన్ల రాయితీకి సంబంధించి భారీగా కేటాయింపులు జరిపారు. ఈ కేటాయింపుల వల్ల రైతులకు భారీగా మేలు చేకూరనుంది.వ్యవసాయ బడ్జెట్లో గ్రోత్ ఇంజిన్లుగా 11 పంటలను ప్రభుత్వం పేర్కొంది.ఎరువుల స్టాక్ నిర్వహణకు రూ.40 కోట్లు,ప్రకృతి వ్యవసాయం ప్రోత్సాహానికి రూ.61 కోట్లు,వ్యవసాయ యంత్రాల రాయితీకి రూ.139 కోట్లు, 7.78 లక్షల క్వింటాళ్ల విత్తనాలు పంపిణీ చేశామని అన్నారు. అలాగే డ్రోన్ల రాయితీ కోసం రూ.80 కోట్లు,875 కిసాన్ డ్రోన్ వ్యవసాయ యాంత్రీకరణ కేంద్రాలు ఏర్పాటు చేయనున్నారు. వ్యవసాయ యాంత్రీకరణకు రూ.219 కోట్లు, విత్తన రాయితీ పంపిణీకి రూ.240 కోట్లు. రైతులకు వడ్డీలేని రుణాల కింద రూ.250 కోట్లు., అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ అమలుకు రూ.9,400 కోట్లు., ఉచిత పంటల బీమా కోసం రూ.1,023 కోట్లు., వ్యవసాయ శాఖకు రూ.12,401 కోట్లు., ఉద్యాన శాఖకు రూ.930.88 కోట్లు., పట్టుపరిశ్రమకు రూ.96.22 కోట్లు,సహకారశాఖకు రూ.239.85 కోట్లు. పశుసంవర్ధక శాఖకు రూ.1,112.07 కోట్లు.,మత్స్య రంగానికి రూ. 540.9 కోట్లు కేటాయించారు. వ్యవసాయ బడ్జెట్ ప్రవేశపెట్టిన మంత్రి అచ్చెన్నాయుడు కీలక ప్రసంగం చేశారు.ఆర్థికమంత్రి పయ్యావుల కేశవ్ బడ్జెట్ ప్రసంగం ముగిసిన వెంటనే.. శాసనసభలో వ్యవసాయ బడ్జెట్ ను ఆ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు ప్రవేశ పెట్టారు.. ప్రకృతి వ్యవసాయం పై దృష్టి పెట్టాం.. ప్రజా భాగస్వామ్య ప్రకృతి వ్యవసాయం పై కూటమి సర్కార్ ఫోకస్ పెట్టిందన్నారు.. వ్యవసాయం ప్రాథమిక రంగంగా గుర్తింపు ఉంది.. రాష్ట్రంలో భూమి కలిగిన వారికి ప్రత్యేక గుర్తింపు సంఖ్య ఇవ్వనున్నట్టు వెల్లడించారు.. ఇక, శాసనమండలిలో వ్యవసాయ బడ్జెట్ 2025-26 ను మంత్రి నారాయణ ప్రవేశపెట్టారు..

## కిచెన్ వ్యర్థాలతో బయోగ్యాస్

**క్యాంపస్‌లోని హాస్టళ్ల నుంచి వ్యర్థాలతో ఉత్పత్తిని చేసేందుకు అధికారుల ప్రణాళికలు**

హైదరాబాద్ : సంప్రదాయేతర ఇంధన వనరుల వినియోగంపై జేఎన్‌టీయూ మరింత దృష్టి సారించింది. ఇప్పటికే సుల్తాన్‌పూర్ జేఎన్‌టీయూ కాలేజీలో సోలార్ ఎనర్జీ ప్లాంట్‌ను ఏర్పాటుతో విద్యుత్ చార్జీలు గణనీయంగా ఆదా అవుతుండగా, త్వరలో హైదరాబాద్ క్యాంపస్‌లోని హాస్టళ్ల నుంచి వచ్చే కిచెన్ వ్యర్థాలతో బయోగ్యాస్‌ని ఉత్పత్తి చేసేందుకు అధికారులు ప్రణాళికలు రూపొందిస్తున్నారు. ప్రస్తుతం వర్సిటీ ప్రాంగణంలో గౌతమి, కిన్నెర, మంజీరా, కమలానెహ్రూ వసతి గృహాలు ఉండగా, ఆయా హాస్టళ్ల నుంచి రోజుకు కనిష్టంగా 750నుంచి గరిష్టంగా 900క్వింటాళ్ల కిచెన్ వ్యర్థాలను మున్సిపాలిటీ డంపింగ్ యార్డులకు తరలిస్తున్నారు. అయితే, ఆ వ్యర్థాలతో బయోగ్యాస్ ఉత్పత్తి చేస్తే గ్యాస్ ఖర్చులు ఆదా అవడమే కాకుండా యూనివర్సిటీకి గ్రీన్ ఎనర్జీ క్రెడిట్స్ కూడా లభిస్తాయని ఉన్నతాధికారులు భావిస్తున్నారు. యూనివర్సిటీలోని ఇంజనీరింగ్ కాలేజీకి న్యాక్ అక్రిడిటేషన్, ఎన్‌బీఏ అక్రిడిటేషన్‌ల కోసం సమర్పించే దరఖాస్తులో గ్రీన్ ఎనర్జీ క్రెడిట్స్‌కు ప్రాధాన్యం ఉండడంతో ఆయా అక్రిడిటేషన్లు పొందేందుకు ఈ అంశం దోహదపడనుంది. గ్రీన్ ఎనర్జీని ప్రోత్సహించడంలో భాగంగా బయోగ్యాస్ ప్లాంట్ల ఏర్పాటుకు అయ్యే ఖర్చులో 50శాతం సబ్సిడీని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్నాయి. అయితే, ప్రస్తుతం భారీ ప్లాంట్లకు మాత్రమే అందిస్తున్న ఈ సబ్సిడీని చిన్న, మధ్యతరహా ప్లాంట్లకు కూడా అందించాలనే ప్రతిపాదనలు రాష్ట్ర ప్రభుత్వ పరిశీలనలో ఉన్నట్లు తెలుస్తోంది. కిచెన్ వ్యర్థాలు, ఆహార వ్యర్థాలతో బయోగ్యాసను ఉత్పత్తి చేయడంతో పాటు, చివరగా వచ్చే వ్యర్థాలను కూడా కంపోస్టు ఎరువుగా మార్చితే మరింత ఆదాయం సమకూరుతుందని బయోగ్యాస్ ప్రొడక్షన్ అంశంపై పరిశోధన చేసిన జేఎన్‌టీయూ పూర్వ విద్యార్థి శ్రీనివాస్ తెలిపారు. దీర్ఘకాలిక ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని వర్సిటీ ప్రాంగణంలో వెయ్యి కేజీల సామర్థ్యం కలిగిన ఎనరోబిక్ డైజెషన్ (బయోగ్యాస్ ప్లాంట్)ను ఏర్పాటు చేస్తే జేఎన్‌టీయూను జీరో వేస్టేజ్ క్యాంప్‌సగా మార్చవచ్చని పేర్కొన్నారు. యూనివర్సిటీ హాస్టళ్లలో కిచెన్ వ్యర్థాల నుంచి బయోగ్యాస్ ఉత్పత్తి చేస్తే ఏటా రూ.4.32లక్షలు ఆదా అవుతుందని ఉన్నతాధికారులు ఒక అంచనాకు వచ్చారు. వెయ్యి కేజీల వ్యర్థాల సామర్థ్యం కలిగిన ప్లాంట్ ద్వారా రోజుకు 52కేజీల గ్యాస్‌ను ఉత్పత్తి చేసేందుకు వీలవుతుంది. సగటున రోజుకు 3 ఎల్‌పీజీ గ్యాస్ సిలిండర్ల వాడకానికి అయ్యే ఖర్చును రూ.3 వేల దాకా (సిలెండర్‌కు రూ.1,000చొప్పున) తగ్గించవచ్చు. నెలకు రూ.36వేలు ఆదా అవుతుండగా, ఏడాదికి రూ.4.32లక్షలు, ఐదేళ్లకు సుమారుగా రూ.22లక్షలు వ్యయాన్ని తగ్గించవచ్చని అంచనా వేస్తున్నారు. అంతేకాకుండా వర్సిటీలో బయోగ్యాస్ ప్లాంట్(ఎనరోబిక్ డైజెషన్)ను ఏర్పాటు చేస్తే పరిశోధక విద్యార్థులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని ఆచార్యులు భావిస్తున్నారు.



## అభివృద్ధి, సంక్షేమానికి పెద్దపీట

**ప్రజల్లోకి బడ్జెట్‌ను తీసుకెళ్లే బాధ్యత ఎమ్మెల్యేలదే**

**చంద్రబాబు నాయుడు స్పష్టీకరణ**

అమరావతి : సంక్షేమం, అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తూ బడ్జెట్‌కు రూపకల్పన చేశామని సీఎం చంద్రబాబు అన్నారు. బడ్జెట్ ప్రవేశ పెట్టిన అనంతరం అసెంబ్లీ కమిటీ హాల్‌లో సీఎం చంద్రబాబు అధ్యక్షత టీడీఎల్పీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ ఇబ్బందికర పరిస్థితుల్లో కూడా ప్రజలకు మంచి బడ్జెట్ అందిస్తున్నామన్నారు. దీనిని ప్రజల్లోకి విస్తతంగా తీసుకెళ్లే బాధ్యత ఎమ్మెల్యేలదేనని స్పష్టం చేశారు. కొత్తగా వచ్చిన ఎమ్మెల్యేలు సబ్జెక్టుపై అవగాహన పెంచుకోవాలని, వచ్చే ఎన్నికల్లో కూడా టికెట్ దక్కాలంటే ఎమ్మెల్యేల పనితీరులో మార్పు రావాలన్నారు. మళ్లీ అసెంబ్లీకి రావాలి అనే భావనతో ఎమ్మెల్యేల పనితీరు ఉండాలని సూచించారు. ఎంపీలు, ఎమ్మెల్యేల మధ్య సమన్వయం ఉండాలని.. ఎక్కడా విభేదాలకు తావు లేదని, గ్రూపులు కడితే సహించేది లేదని హెచ్చరించారు.కష్టాల్లో కూడా మంచి బడ్జెట్‌ను ప్రజలకు అందించామని అన్నారు. సంక్షేమం, అభివృద్ధికి ప్రాధాన్యమిస్తూ రూపకల్పన చేసినట్లు చెప్పారు. ఎమ్మెల్యేలు, ఎంపీలకు దిశానిర్దేశం చేశారు. వైకాపా పాలనలో ఆర్థిక విధ్వంసం జరిగిందని ప్రజలు గుర్తించారన్నారు. ఈ బడ్జెట్‌ను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లే బాధ్యత ఎమ్మెల్యేలదే అని అన్నారు. కొత్తగా వచ్చిన ఎమ్మెల్యేలు అవగాహన పెంచుకోవాలని అన్నారు. వచ్చే ఎన్నికల్లో టికెట్ దక్కాలంటే ఎమ్మెల్యేల పనితీరులో మార్పు రావాలని చెప్పారు. ఆర్థిక కష్టాలు ఉన్నా జాగ్రత్తగా ముందుకు వెళ్తున్నామని వ్యాఖ్యానించారు. పార్టీని ఎవరూ నిర్లక్ష్యం చేయొద్దని అన్నారు. ఈ సమావేశంలో పార్టీ కేడర్‌కు చంద్రబాబు కీలక సూచనలు చేశారు. ఈ భేటీకి టీడీపీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలు హాజరయ్యారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు మాట్లాడుతూ... రాబోయే ఎన్నికల్లో మళ్లీ గెలిచి రావాలనే పట్టుదలతో ఈ రోజు నుంచే కష్టపడి పని చేయాలని కేడర్‌కు సీఎం చంద్రబాబు సూచించారు. నాయకుల పని తీరుపై తాను ఎప్పటికప్పుడు నివేదికలు తెప్పిస్తున్నానని చెప్పారు. తాను త్వరలో నేతలు, కార్యకర్తలను పిలిపించి ప్రత్యేకంగా మాట్లాడుతానని అన్నారు. కేడర్ పార్టీ నిర్మాణంపై దృష్టి పెట్టాలని సూచించారు. పార్టీని అలా వదిలేస్తే అందరం మునుగుతామని హెచ్చరించారు. అందుకనే పార్టీ కార్యకర్తలు, ద్వితీయ శ్రేణి నాయకులపై దృష్టి పెట్టాలని చెప్పారు. అందరినీ కలుపుకొని వెళ్తేనే ముందుకెళ్లగలుగుతామని అన్నారు. దెబ్బతిన్న రోడ్లను రెండు నెలల్లో పూర్తి చేయాలని ఆదేశించారు. ఆయా నియోజకవర్గాల్లో అభివృద్ధి పనుల గురించి కూడా దృష్టి పెట్టాలని సీఎం చంద్రబాబు సూచించారు.

## పోసానికి 14 రోజుల రిమాండ్

**రాజంపేట సబ్‌జైలుకు తరలింపు**

రైల్వే కోడూరు : వైకాపా నేత, సినీనటుడు పోసాని కృష్ణమురళికి అన్నమయ్య జిల్లా రైల్వేకోడూరు కోర్టు 14 రోజుల రిమాండ్ విధించింది. గురువారం రాత్రి 9.30 గంటల నుంచి శుక్రవారం ఉదయం 5 గంటల వరకు ఇరుపక్షాల మధ్య సుదీర్ఘంగా వాదనలు కొనసాగాయి. పోసాని తరఫున పొన్నవోలు సుధాకర్‌రెడ్డి వాదనలు వినిపించారు. బీఎన్ఎస్ చట్టం ప్రకారం పోసానికి 41ఏ నోటీసులు ఇచ్చి బెయిల్ ఇవ్వాలని పొన్నవోలు కోర్టును కోరారు. అందుకు నిరాకరించిన మెజిస్ట్రేట్ 14 రోజుల వరకు రిమాండ్ విధిస్తూ ఆదేశాలు జారీ చేశారు. మార్చి 12 వరకు పోసాని రిమాండ్‌లో ఉండనున్నారు. పోసానిని రాజంపేట సబ్ జైలుకు తరలించారు. కులాలు, సినీ అభిమానులు, రాజకీయ పార్టీల మధ్య విద్వేషాలు, వైషమ్యాలు రెచ్చగొట్టేలా వ్యవహరించారంటూ కేసు నమోదైంది. ఓబులవారిపల్లి మండలం కొర్లకుంటకు చెందిన జనసేన నాయకుడు జోగినేని మణి ఫిబ్రవరి 24న పోసానిపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో పోసానిపై వివిధ సెక్షన్ల కింద పోలీసులు కేసు నమోదు చేశారు. దీంతో 26న పోసానిని హైదరాబాద్‌లో ఆయన నివాసంలో పోలీసులు అరెస్టు చేశారు. అనంతరం ఆయనను ఓబులవారిపల్లె పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. మీరు చూపించిన రికార్డుల్లోని బూతు మాటలన్నీ నావే. నేను తప్పు చేశాను. అలా మాట్లాడి ఉండకూడదు. ఇప్పుడు పశ్చాత్తాపపడుతున్నా. ఇంతకంటే నేను చేసేది, చెప్పేది ఏమీ లేదని పోసాని కృష్ణమురళి అన్నమయ్య జిల్లా ఎస్పీ విద్యాసాగర్ నాయుడు ఎదుట అంగీకరించారు. విచారణలో తొలుత ఏ ప్రశ్న అడిగినా.. 'తెలియదు.. గుర్తులేదు' అంటూ సమాధానాలిచ్చారు. వైకాపా హయాంలో, కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత పోసాని చేసిన అనుచిత వ్యాఖ్యలు, బూతులున్న వీడియోలన్నీ చూపించిన పోలీసులు ఇవి చట్టవిరుద్ధం కాదా? అంటూ ప్రశ్నించగా... ప్రతిదానికీ 'లవ్ యూ రాజా' అంటూ వింతగా జవాబులిచ్చారు. దర్యాప్తు అధికారులు లోతుగా ప్రశ్నించగా.. ఆ మాటలన్నీ తనవేనని, తాను నేరం చేశానని అంగీకరించారు. చంద్రబాబు, పవన్ కల్యాణ్, నారా లోకేశ్‌ను ఎందుకు తిట్టాల్సి వచ్చింది? వారి కుటుంబసభ్యుల్ని సైతం ఎవరైనా అనుచితంగా మాట్లాడాలని ప్రోత్సహించారా అని అడగ్గా మౌనం దాల్చారు. ఒక్కోసారి 'అవును రాజా... చెప్పుడు మాటలు విన్నా' అని చెప్పారు. తన వ్యాఖ్యల వ్యవహారం ఇంతవరకు వస్తుందని తెలియక తప్పు చేశానంటూ పోలీసులతో చెప్పారు. పోలీసులు విచారణను వీడియో, ఆడియో రికార్డింగ్ చేశారు. ఈ విచారణ నివేదికను కోర్టులో మెజిస్ట్రేట్‌కు సమర్పించారు.

### హరీశ్‌రావుపై మరో కేసు నమోదు

హైదరాబాద్ : బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి హరీష్‌రావుపై మరో కేసు నమోదు అయింది. బాచుపల్లి పోలీసులు ఆయనపై కేసు నమోదు చేశారు. హరీష్‌రావు, ఆయన అనుచరులు బెదిరిస్తున్నారని కాంగ్రెస్ నేత చక్రధర్ గౌడ్ బాచుపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు ఏ -1 గా వంశీ కృష్ణ, ఏ -2 గా హరీష్‌రావు, ఏ-3 సంతోష్‌కుమార్, ఏ-4గా పరుశు రాములు పేర్లు చేర్చారు. బీఎస్ఎన్ యాక్ట్‌ప్రకారం కేసు నమోదు చేసిన బాచుపల్లి పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.



# వాణిజ్య ప్రకటనలను తెచ్చిన కష్టాలు

## కాజల్, తమన్నాలను విచారించనున్న పోలీసులు

కాసులకు ఆశపడి స్టార్స్ చేసే కొన్ని ప్రకటనలు వారికి ఊహించని కష్టాలను కొని తెచ్చిపెడతాయి. ఇప్పటికే పలువురు హీరోలు, హీరోయిన్లు, క్యారెక్టర్ ఆర్టిస్టులు కూడా ఇలాంటి సమస్యలలో చిక్కుకున్నారు. తాము ప్రచారం చేసే ప్రొడక్ట్‌తో ఎలాంటి ఇబ్బందులు ఎదురవుతాయో ముందు ఊహించుకోకుండా వీరు ఆయా ప్రకటనల్లో పాల్గొనడమే ఇందుకు కారణం. నిజానికి బ్రాండ్ అంబాసిడర్ గా అంగీకార పత్రాన్ని సమర్పించేప్పుడే ఆ ప్రొడక్ట్ లేదా ప్రాజెక్ట్ వల్ల వినియోగదారులు నష్టపోతే తమకు సంబంధం లేదనే క్లాజ్ ను చేర్చికానీ కొందరు సైన్ చేయడం లేదు. కానీ అంతలోతుగా వివరాలను అధ్యయనం చేయకుండా చాలామంది హీరోయిన్లు రెమ్యూనరేషన్ కు ప్రాధాన్యం ఇచ్చి... వాణిజ్య ప్రకటనలు చేసేసి ఆపైన ఇబ్బందులు పడుతున్నారు. తాజాగా ఆ జాబితాలోకి కాజల్ అగర్వాల్, తమన్నా భాటియా పేర్లు కూడా చేరాయి. పుదుచ్చేరికి చెందిన ఓ సంస్థ క్రిప్టో కరెన్సీ లో పెట్టుబడులు పెడితే అధిక లాభం పొందవచ్చంటూ కొందరిని తన బుట్టలో వేసుకుంది. దాదాపు పదిమంది ఈ సంస్థలో 2.40 కోట్లను మదుపు చేశారు. అయితే ఆ తర్వాత తాము మోసపోయామంటూ ఘొల్లుమంటున్నారు. ఈ విషయమై లాస్ పేట్టెకు చెందిన అశోకన్ అనే వ్యక్తి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీంతో సంబంధిత వ్యక్తులను పోలీసులు విచారించడం మొదలు పెట్టారు. ఈ సంస్థ 2022లో కోయంబత్తూరులో కార్యాలయం ప్రారంభించినప్పుడు అతిథిగా తమన్నా హాజరైంది. అలానే ఆ తర్వాత మహాబలిపురంలోని ఓ స్టార్ హోటల్ లో జరిగిన ప్రోగ్రామ్ కు కాజల్ వెళ్ళింది. ఇంతేకాకుండా ముంబైలోని ఒక ఓడలో భారీ పార్టీని సదరు సంస్థ నిర్వహించి, అక్కడ కూడా వేలాది మంది నుండి బోలెడంత డబ్బును సేకరించింది. ఇప్పటికే ఈ సంస్థకు చెందిన నితీశ్ జెయిన్, అరవింద్ కుమార్ అనే వ్యక్తులను పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. ఇందులో భాగంగా సంస్థ కార్యక్రమాలలో పాల్గొన్న కాజల్, తమన్నాలనూ కూడా విచారించాలని పోలీసులు భావిస్తున్నారట. తమ సమయాన్ని లక్షల రూపాయల్లోకి మార్చేసుకుని, సొమ్ము చేసుకుంటున్న కథానాయికులు... ఇప్పుడు పోలీసుల విచారణ కోసం సమయం కేటాయించాల్సిన రావడం చిత్రమే.



# తల్లికాబోతున్న కియారా అడ్వాణీ

హీరోయిన్ కియారా అడ్వాణీ, నటుడు సిద్ధార్థ్ మల్హోత్ర దంపతులు గుడ్ న్యూస్ చెప్పారు. త్వరలోనే తాము తల్లిదండ్రులు కాబోతున్నట్లు పరోక్షంగా వెల్లడించారు. బేబీ సాక్స్‌ను చేతుల్లో పట్టుకున్న ఫొటోను ఇన్‌స్టా వేదికగా షేర్ చేశారు. “మా జీవితానికి సంబంధించిన అద్భుతమైన బహుమతి త్వరలో రానుంది” అని ఇన్‌స్టాగ్రామ్ వేదిక పోస్ట్ చేశారు. దీనికి బేబీ ఎమోజీని జత చేశారు. దీనిపై పలువురు నెటిజన్లు స్పందిస్తూ స్టార్ కపుల్‌కు అభినందనలు తెలుపుతున్నారు. రకుల్, కరీనా కపూర్, నేహా ధూపియా, ఏక్తా కపూర్ కియారా దంపతులకి శుభాకాంక్షలు తెలిపారు. ‘షేర్షా’ సినిమా కోసం తొలిసారి వీరిద్దరూ కలిసి నటించారు. ఆ సినిమా చిత్రీకరణ సమయంలోనే స్నేహం ఏర్పడింది. కొంతకాలానికే అది ప్రేమగా మారడంతో కుటుంబ సభ్యుల సమక్షంలో 2023 ఫిబ్రవరి 7న పెళ్లి చేసుకున్నారు. వివాహం తర్వాత కూడా వీరిద్దరూ సినిమాల్లో యాక్ట్ చేస్తున్నారు. కియారా అడ్వాణీ నటించిన ‘గేమ్ ఛేంజర్’ సంక్రాంతికి ప్రేక్షకుల ముందుకు వచ్చింది.




# ఎస్ఎస్ఎంబీ-29లో మహేష్ న్యూలుక్

## సోషల్‌మీడియాలో వైరల్

టాలీవుడ్ దర్శక దిగ్గజం ఎస్.ఎస్ రాజమౌళి, సూపర్ స్టార్ మహేశ్ బాబు కాంబోలో ఒక సినిమా రానున్న విషయం తెలిసిందే. ఎస్-ఎస్ఎంబీ29 అంటూ వస్తున్న ఈ ప్రాజెక్ట్ ప్రస్తుతం శరవేగంగా షూటింగ్ జరుపుకుంటుంది. ఇక ఈ సినిమా అప్‌డేట్‌ల కోసం అటు బాబు ఫ్యాన్స్‌తో పాటు మూవీ లవర్స్ తెగ ఎదురుచూస్తున్నారు. ఈ నేపథ్యంలోనే మహేశ్ కొత్త లుక్‌కి సంబంధించి ఒక వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. రాజమౌళితో పాటు ఈ సినిమా కోసం మహేశ్ కూడా బాగా కష్టపడుతున్నారు. ఇప్పటికే జుట్టు గడ్డం పెంచేసి లుక్స్ మొత్తం మార్చేసిన మహేశ్ తాజాగా జిమ్‌లో వర్కౌట్స్? చేస్తున్నాడు. అయితే మహేశ్ జిమ్‌లో ఎక్సర్‌సైజ్ అనంతరం అద్దం ముందుకు వెళ్లి తన లుక్‌ని చూసుకుని బయటకు వెళ్లే వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఇందులో జుట్టు మొత్తం వదిలేసి రగ్గడ్ లుక్‌లో కనిపిస్తున్నాడు. దీంతో ఈ వీడియో ఒక్కసారిగా సోషల్ మీడియాలో ట్రెండింగ్?లోకి దూసుకెళ్లింది. ఇక వీడియో చూసిన అభిమానులు బాబు కొత్త లుక్ అదుర్స్ అంటూ కామెంట్లు పెడుతున్నారు. అడ్వెంచర్ బ్యాక్‌డ్రాప్‌లో వస్తున్న ఈ సినిమా అమెజాన్ అడవుల నేపథ్యంలో సాగే కథతో వస్తుండగా.. ప్రియాంక చోప్రా కథానాయికగా నటిస్తుంది.




# సిద్ధార్థకు నాకు అస్సలు పడదు : థమన్

బాయ్స్’ సినిమా టైంలో తనకు నటుడి సిద్ధార్థ్‌కి అసలు పడకపోయేదని సంగీత దర్శకుడు థమన్ వెల్లడించాడు. ఆది పినిశెట్టి కథానాయకుడిగా వస్తున్న తాజా చిత్రం శబ్దం. ఈ సినిమాకి అరివళగన్ దర్శకత్వం వహిస్తుండగా.. థమన్ సంగీతం అందించాడు. వైశాలి సినిమాతో థమన్ సంగీత దర్శకుడిగా ఎంట్రీ ఇచ్చిన విషయం తెలిసిందే. మళ్లీ ఇప్పుడు ఇదే కాంబోలో శబ్దం సినిమా వస్తుంది. ఈ చిత్రం నేడు ప్రేక్షకుల ముందుకు రాగా.. రీసెంట్‌గా ఈ మూవీ ప్రమోషన్స్‌లో పాల్గొన్న థమన్ నటుడు సిద్ధార్థ్ గురించి ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. థమన్ మాట్లాడుతూ.. ఈ సినిమా దర్శకుడు అరివళగన్ నాకు బాయ్స్ సినిమా అప్పటినుంచి తెలుసు. దర్శకుడు శంకర్ సార్ నన్ను చూసుకోమని అరివళగన్‌కి అప్పగించాడు. దీంతో మేమిద్దరం అప్పటినుంచి ఫ్రెండ్స్ అయ్యాం. అయితే ఈ సినిమా టైంలో నాకు సిద్ధార్థ్ గాడికి నాకు అసలు పడేది కాదు. వాడికంటే నేనే అప్పుడు ఎక్కువ రెమ్యూనరేషన్ తీసుకున్న. దీంతో ఒకసారి నా దగ్గరికి సిద్ధార్థ్ వచ్చి నేను హీరో అన్నాడు. అయితే ఏంటి నేను ఎక్కువ రెమ్యూనరేషన్ తీసుకుంటున్నా అనేవాడిని. అంతేగాకుండా.. సిద్ధార్థ్ కారవాన్‌లో ఉన్నప్పుడు కరెంటు ఆపేవాడిని. నీళ్ల పైప్ కట్ చేసే వాడిని అంటూ చెప్పుకోచ్చాడు.

# ప్రభాస్‌తో రెండు గంటలు సినిమా కష్టం..?

ప్రభాస్‌తో సింగిల్ సినిమా చేయలేకపోతున్నారా మన దర్శకులు..? రెబల్ స్టార్‌తో రెండున్నర గంటల సినిమా చేయడం అంత కష్టమా..? ప్రభాస్ డేట్స్ ఇస్తే చాలు.. కనీసం రెండు పార్ట్స్ ఉన్న సినిమానైనా చేయాలంటూ ముందుగానే బ్లైండ్‌గా ఫిక్స్ అయిపోతున్నారా..? అసలేం జరుగుతుంది..? మరి ఇప్పుడే సినిమా 2 పార్ట్స్‌గా రాబోతుంది..? ప్రభాస్‌తో పెద్ద స్పాన్ ఉన్న సినిమాలే కాదు.. పెద్ద కథలు కూడా రాసుకుంటున్నారు మన దర్శకులు. కనీసం 5 గంటల సినిమా ప్లాన్ చేసుకుంటున్నారు. బడ్జెట్ వర్కవుట్ అవుతుంది కదా అని.. ప్రతీ సినిమాను 2 భాగాలుగా తెరకెక్కిస్తున్నారు. ఇప్పటికే బాహుబలి 2 పార్ట్స్‌గా వచ్చింది.. కల్కి 2, సలార్ 2 సెట్స్‌పైకి వచ్చేందుకు సిద్ధంగా ఉన్నాయి. ప్రభాస్ సినిమాలకు తక్కువలో తక్కువ 300 నుంచి 500 కోట్ల వరకు బడ్జెట్ పెడుతున్నారు నిర్మాతలు. అంత వర్కవుట్ అవ్వాలంటే 2 పార్ట్స్ ఉండాల్సిందే అంటున్నారు దర్శకులు. ప్రస్తుతం రాజా సాబ్, హను రాఘవపూడి ఫౌజీ సినిమాలను ఒకేసారి పూర్తి చేస్తున్నారు ప్రభాస్. ఇందులో రాజా సాబ్ 2 పార్ట్స్ సినిమాగా ప్లాన్ చేస్తున్నట్లు ప్రచారం జరుగుతుంది. వరసగా సీరియస్ సినిమాలు చేస్తున్న ప్రభాస్.. మారుతితో తక్కువ బడ్జెట్‌లో సరదా సినిమా చేయాలని రాజా సాబ్ షురూ చేసారు. కానీ రానురాను ఇది కూడా భారీ బడ్జెట్ అయిపోయింది. దీనికోసం పీపుల్ మీడియా ఫ్యాక్టరీ 300 కోట్లకు పైగా ఖర్చు చేస్తున్నారు. దీనికి సైతం మారుతి సీక్వెల్ ప్లాన్ చేస్తున్నారంటూ టాక్ వినిపిస్తుందిప్పుడు. ఆల్రెడీ కల్కి, సలార్ సీక్వెల్స్ ఎప్పుడొస్తాయో క్లారిటీ లేదు.. ముందైతే స్పిరిట్ పూర్తి చేయాలని చూస్తున్నారు ప్రభాస్. అంతలోనే రాజా సాబ్ సీక్వెల్ కూడా అంటే కాస్త కష్టమే. అయినా ప్రతీ సినిమాను 2 పార్ట్స్‌గా చేయడమనే ఆలోచన మంచిది కాదనే వాదన కూడా వినిపిస్తుందిప్పుడు. మరి దీనిపై ప్రభాస్ దర్శక నిర్మాతలు ఏం ఆలోచిస్తారో చూడాలి.



# బన్నీతో దిల్‌రాజ్ సినిమా

ఐకాన్ స్టార్ అల్లు అర్జున్‌కు ప్రముఖ నిర్మాత దిల్ రాజుతో విడదీయరాని బంధం ఉంది. తొలి చిత్రం ‘గంగోత్రి’ తర్వాత అల్లు అర్జున్ తో ‘ఆర్య’ మూవీని నిర్మించి మంచి విజయాన్ని కట్టబెట్టాడు దిల్ రాజు. ఆ తర్వాత దిల్ రాజు బ్యానర్ లో ‘పరుగు, ఎవడు, డి.జె. దువ్వాడ జగన్నాథమ్’ చిత్రాలను బన్నీ చేశాడు. అప్పట్లోనే అల్లు అర్జున్ హీరోగా ‘ఐకాన్ : కనబడుట లేదు’ అనే సినిమా నిర్మించబోతున్నట్టు దిల్ రాజు ప్రకటించాడు. దానిని శ్రీరామ్ వేణు డైరెక్ట్ చేస్తారనీ అన్నారు. కానీ ఎందుకో అది మాత్రం పట్టాలెక్కలేదు. ఇటీవల విడుదలైన ‘పుష్ప-2’తో బన్నీ ఇమేజ్ అమాంతంగా పెరిగిపోయింది. ఈ సినిమా వరల్డ్ వైడ్ రూ. 1871 కోట్ల గ్రాస్ ను వసూలు చేసింది. అల్లు అర్జున్ తదుపరి చిత్రాలపై రకరకాల ఊహాగానాలు వినిపిస్తున్నాయి. అయితే... తాజాగా అల్లు అర్జున్... దిల్ రాజు బ్యానర్ లో సినిమా చేయడానికి పచ్చజెండా ఊపాడని తెలుస్తోంది. ఇది ‘ఐకాన్’ మూవీనేనా... లేక పోతే వేరే కథను తీసుకుంటారా అనేది తెలియాల్సి ఉంది. అసలు ఇప్పుడున్న కమిట్ మెంట్స్ మధ్యలో దిల్ రాజుకు బన్నీ డేట్స్ ఇవ్వడమే పెద్ద విషయం అనీ అంటున్నారు. ఈ యేడాది దిల్ రాజు నిర్మించిన రెండు సినిమాలు ‘గేమ్ ఛేంజర్’, ‘సంక్రాంతికి వస్తున్నాం’ విడుదల కాగా, మొదటి సినిమా నిర్మాతగా దిల్ రాజుకు చుక్కలు చూపించింది. రెండో సినిమా ఘన విజయం సా ధించి, దిల్ రాజు ప్రొడక్షన్ హౌస్ కు కొత్త ఊపిరిలూదింది. ఇలాంటి పరిస్థితుల్లో అల్లు అర్జున్... దిల్ రాజుకు డేట్స్ ఇవ్వడమంటే గ్రేట్ అని సినిమా వర్గాలు చెప్పుకుంటున్నాయి. ఇదిలా ఉంటే... ‘పుష్ప-2’ రేంజ్ మామూలుగా లేదనే విషయం మరోసారి ప్రూవ్ అయ్యింది. అమెరికన్ పాపులర్ షో ‘ఎన్.బి.ఎ.’ గేమ్ లో ఛీర్ లీడర్స్ ఏకంగా ‘పుష్ప -2’లోని వస్తున్నాయ్ పీలింగ్స్ పాటకు స్టెప్పులేసి అలరించారు. దానికి సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారిపోయింది. ఇండియన్ సినిమా ఒకటి గ్లోబల్ స్టేజ్ లో ఏ పొజిషన్ కు చేరుకుందో చెప్పడనికి ఇదో గొప్ప ఉదాహరణ. ఈ నేపథ్యంలో అల్లు అర్జున్ ఎవరితో సినిమా చేసినా... అది సంచలనం అవుతుందనడంలో సందేహం లేదు.





Printed, Published & Owned by B. Srinivas, Printed at Abhyudaya Publications,& Printers Algunoor, MDI: Thimmapur District, Karimnagar. 505001(T.S) Published at H.NO. 6-3-289,Kishan Nagar, Karimnagar MDI: District karimnagar- 505001(T.S) Editor: B.Srinivas, RNI NO. APTEL/2006/18964, Cell : 7989575563, Mail:thecrimenews123@gmail.com